SUNRISE EDUCATIONAL HUB
ADILABAD
IIT - JEE / NEET
ADMISSIONS
CLOSING SOON
2025 - 26
Secure Your Spot. Time is running out!
ADDRESS: Near Nayara Petrol Pump, Dwaraka Nagar, Ravindra Nagar Colony, Adilabad
Contact NO. : 8309936686, 6281762501

www.jananinadam.com

Follow :

# జననినాదం

ప్రతి అక్షరం - సామాన్యుడి ఆయుధం

తెలుగు దినపత్రిక

**జిల్లా వారిగా విలేకర్లు కావలెను**

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ . అవినీతి పై సమరాన్ని సాగిస్తున్న **జననినాదం** తెలుగు దినపత్రికలో చేయుటకు అను భవం ఉన్న ఆసక్తి గత వారికి అవకాశం కలదు. అన్ని జిల్లా లు,డివిజన్లు, మున్సిపల్ మరియు మండలాల వారిగా విలేకరుల కావలేను,

సంప్రదించాల్సి నెంబర్

9550100197,9490111460

సంపుటి: 1 సంచిక: 291 | Simultaneously published from , Asifabad, Karimnagar, Adilabad , & Hyderabad. | గురు వారం 05-06- 2025 | పేజీలు : 8 | వెల : రూ.2.00



## రాహుల్ గాంధీపై అలహాబాద్ హైకోర్టు ఆగ్రహం

2వ పేజీలో...



2వ పేజీలో...

## భారత్‌కు అందని జి-7 సదస్సు ఆహ్వానం

**దౌత్యపరంగా ఇదో పెద్ద దెబ్బే అంటున్న కాంగ్రెస్**



2వ పేజీలో...

## బీసీసీఐకి కొత్త అధ్యక్షుడిగా రాజీవ్ శుక్లా

ముంబై జూన్ 4, : త్వరలో బీసీసీఐకి కొత్త అధ్యక్షుడు రానున్నారు. ఆయన ఎవరో కాదు.. బీసీసీఐ ఉపాధ్యక్షు డిగా ఉన్న రాజీవ్ శుక్లా. ప్రస్తుత చీఫ్ రోజర్ బిన్నీ 2025 జూలైలో 70 ఏళ్లు నిండిన తర్వాత పదవి నుంచి వైదొలగుతారు.భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీ సీఐ) నాయకత్వ మార్పుకు సిద్ధమవుతోంది. ఈ తరుణంలో కాంగ్రెస్ నేత, రాజ్యసభ సభ్యుడు రాజీవ్ శుక్లా పేరు తెరపైకి వచ్చింది. అనుభవజ్ఞుడైన రాజకీయ వ్యూహకర్త, క్రికెట్ అడ్మినిస్ట్రేటర్ అయిన శుక్లా బోర్డు తాత్కాలిక అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టనున్నట్లు సమాచారం.ఛత్తీస్‌గఢ్‌కు చెందిన రాజ్యసభ సభ్యుడు రాజీవ్ శుక్లా ప్రస్తుతం బీసీసీఐ ఉపాధ్యక్షుడిగా ఉన్నారు. ప్రస్తుత చీఫ్ రోజర్ బిన్నీ 2025 జూలైలో 70 ఏళ్లు నిండిన తర్వాత పదవి నుంచి వైదొలగుతారు.


## కేసీఆర్‌ను బద్నాం చేసేందుకే నోటీసులు..

### రేవంత్ సర్కారుపై కవిత ఫైర్..

హైదరాబాద్,: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కాళేశ్వరం కమిషన్ నోటీసులు జారీ చేయడాన్ని నిరసిస్తూ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నేతృత్వంలో తెలంగాణ జాగృతి హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద మహా ధర్నా నిర్వహించింది. ధర్నాలో కవిత పాల్గొని మాట్లాడారు. రాజకీయ దురుద్దేశంతో కేసీఆర్‌కు నోటీసులు జారీ చేశారని ఆరోపించారు.

2వ పేజీలో...





## జూలై 21 నుంచి పార్లమెంటు సమావేశాలు

న్యూఢిల్లీ : వచ్చే నెల జూలై 21 నుంచి ఆగస్టు 12 వరకు పార్లమెంటు వర్షాకాల సమావేశాలు జరగనున్నాయి. ఈ విషయాన్ని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు బుధవారం వెల్లడించారు. మే 7న జమ్మూకాశ్మీర్ పెహల్గామ్‌లో ఉగ్రదాడికి 26 మంది మృతి చెందారు. పాకిస్తాన్‌పై ఈ దాడికి ప్రతీకార చర్యగా భారత ప్రభుత్వం ఆపరేషన్ సిందూర్‌ను చేపట్టింది. ఈ ఆపరేషన్ సిందూర్ చేపట్టిన తర్వాత తొలిసారి పార్లమెంటరీ సమావేశాలు జరగనుండడం గమనార్హం. కాగా, పెహల్గామ్ దాడి తర్వాత స్పెషల్ పార్లమెంటరీ సెషన్స్ నిర్వహించాలని ప్రతిపక్షాలు కేంద్ర ప్రభుత్వాన్ని పట్టుబట్టిన సంగతి తెలిసిందే. పెహల్గామ్ దాడి తర్వాత అనంతర పరిణామాలు పార్లమెంటులో చర్చ జరగాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ, టిఎంసి ఎంపి అభిషేక్ బెనర్జీ డిమాండ్ చేశారు.



## పాలన చేతగాని కాంగ్రెస్ పార్టీ

**వేములవాడ కోడెల మృతి దారుణం**

**ఎర్రగడ్డ ఆస్పత్రిలో ఫుడ్ పాయిజనింగ్**

**మాజీమంత్రి హరీష్‌రావు విమర్శలు**

2వ పేజీలో...



## అమెరికా వర్సెస్ చైనా

**మిక్కీ మౌస్ లలో నేతల వ్యవహారం**

2వ పేజీలో...

న్యూఢిల్లీ, జూన్ 4, : చైనా ఆర్థిక, సాంకేతిక వ్యూహాలు అమెరికా ఆధిపత్యాన్ని సవాలు చేయడానికి ఉద్దేశించినవి. దక్షిణ చైనా సముద్రం, బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్ వంటి చర్యలు ఈ లక్ష్యంలో భాగం. అయితే, అమెరికా ఆంక్షలు, ఇండో?పసిఫిక్ ఒప్పందాలు చైనాకు సవాళ్లుగా నిలిచాయి. చైనా ఆఫ్రికాలో వాణిజ్య ఆధిపత్యం సాధించినప్పటికీ, పూర్తి విజయం సాధించలేకపోయింది, త్రిశంకు స్వర్గంలా మధ్యలో నిలిచిపోయింది.బ్రిక్స్ దేశాలు డాలర్ ఆధిపత్యాన్ని తగ్గించేందుకు కొత్త కరెన్సీ లేదా చెల్లింపు విధానం కోసం చర్చించాయి. 2024లో రష్యా 'ది యూనిట్' అనే బంగారం ఆధారిత కరెన్సీని ప్రదర్శించినప్పటికీ, ఇది అమలులోకి రాలేదు. చైనా?ఇండియా విభేదాలు, ఏకీకృత బ్యాంకు లేకపోవడం వంటి సమస్యలు ఈ ప్రయత్నాన్ని అసాధ్యం చేశాయి. డాలర్ ఇప్పటికీ 58% గ్లోబల్ రిజర్వ్‌లలో ఆధిపత్యం చెలాయిస్తోంది.చైనా దక్షిణ చైనా సముద్రంలో 2016లో ఖఅం తీర్పును తిరస్కరించడం ద్వారా అంతర్జాతీయ చట్టాన్ని ఉల్లంఘించిందని విమర్శలు ఎదుర్కొంది. ఈ తీర్పు చైనా చర్యలను నియంత్రించలేకపోయింది,



## లిక్కర్ క్వీన్ అంటూ.. మధు యాష్కి టార్గెట్

2వ పేజీలో...

నిజామాబాద్, జూన్ 4,: ఆమె యాక్షన్‌కి ఈయన రియాక్షన్. అప్పుడైనా?ఇప్పుడైనా? ఆమెకి కౌంటర్ వేసేది ఆయనేనా..? పార్టీ ఇక ఫుల్ పవర్స్ ఇచ్చేసిందా? అట్నుంచి ఎప్పుడు పొలిటికల్ మిస్సైల్ వదిలినా?. మన పార్టీకి ఎస్ 400లా అడ్డుకోవాల్సింది నువ్వేనని అధిష్టానం చెప్పేసిందా? ఇంతకీ ఎవరా ఇద్దరు నేతలు? వాళ్ళ మధ్యనే పొలిటికల్ యుద్ధం ఎందుకు ఎక్కువగా జరుగుతోంది? తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం హాట్ టాపిక్ అంటే?. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ఇష్యూ నే. బీజేపీ?కాంగ్రెస్ అంటూ మాటల తూటాలు ఎక్కు పెడుతున్నారామె. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి టార్గెట్ గా? ఆరోపణలు గుప్పిస్తున్నారు. తెలంగాణ సంస్కృతిని ధ్వంసం చేసే కుట్ర జరుగుతోందని ఫైరై పోతున్నారు కవిత. ఆమె పరంగా వ్యవహారం అలా ఉంటే? ఇటు కాంగ్రెస్‌వైపు నుంచి మాత్రం పెద్దగా ఎవరూ రియాక్ట్ అవ్వొద్దన్న అనధికార ఆదేశాలున్నాయట. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌ని టార్గెట్ చేస్తున్నా?. ఆమె విషయంలో అట్నుంచి ఇంతవరకు రియాక్షన్ రానప్పుడు మనం మాత్రం స్పందించడం ఎందుకని అనుకుంటున్నారట కాంగ్రెస్ లీడర్స్. అయితే? తాజాగా మాజీ ఎంపీ మధు యాష్కి రియాక్ట్ అవడంతో ఆసక్తిగా గమనిస్తున్నాయి రాజకీయ వర్గాలు. గతంలో కూడా కవితపై మాట్లాడాలంటే? ముందుండే వారు కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ మధు యాష్కీ. ఇద్దరు నేతలు గతంలో నిజామాబాద్ ఎంపీలుగా పనిచేసిన వారే. ఇద్దరి మధ్య రాజకీయ వైరం అక్కడి నుంచే ఉందని అంటున్నారు పరిశీలకులు.



## ఎర్రగడ్డ ఆస్పత్రి ఘటనపై మంత్రి దామోదర ఆరా

### ఫుడ్ పాయిజనింగ్‌పై విచారణకు ఆదేశం

హైదరాబాద్,జూన్4: తెలంగాణ అవతరణ దినోత్సవం రోజు ఎర్రగడ్డ మానసిక ఆసుపత్రిలో చోటు-చేసు కున్న ఫుడ్ పాయిజన్ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. జూన్ 2న జరిగిన ఈ ఘటనపై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నరసింహ స్పందించారు. మొ త్తం 92 మంది రోగులు అస్వస్థతకు గురవగా, వారిలో 18 మందిని తీవ్ర ంగా ఉండటంతో ఉస్మానియా ఆసు పత్రికి తరలించారు. మిగిలిన వారిని గాంధీ ఆసుపత్రి, ఉస్మానియా సహా ఇతర ఆసుపత్రుల్లో ఏర్పాటు-చేసిన ఆరు వైద్య బృందాలు పర్యవేక్షిస్తున్నా యి. ఈ ఘటనపై మంత్రి దామోదర రాజ నరసింహ మాట్లాడుతూ, ఫుడ్ పాయిజన్ కు కారణంగా ఆసుపత్రిలో అందించిన ఆహారమే అని ప్రాథమి కంగా నిర్ధారణ అయినట్లు- వెల్లడించారు. అదనంగా అందించిన స్వీట్ కూడా అనారోగ్యానికి కారణమైనట్లు - అనుమానం వ్యక్తం చేశారు. ప్రస్తు తం బాధితుల ఆరోగ్యం మెరుగవు తోందనీ, ప్రాణాలకు ఎటువంటి ప్రమాదం లేదని వైద్యులు తెలిపారు. వారు రెండు రోజుల్లో పూర్తిగా కోలుకుంటారని చెప్పారు.

2వ పేజీలో...

# అమెరికా వర్సెస్ చైనా




మొదటిపేజీ తరువాయి...

ఇది చైనా యొక్క 'సినోసెంట్రిక్' లక్ష్యాలను కొనసాగించేలా చేసింది. ఈ వైఫల్యం చైనా అంతర్జాతీయ చట్టపరమైన సవాళ్లను సూచిస్తుంది.చైనా యొక్క భౌగోళిక రాజకీయ లక్ష్యాలు అమెరికాతో పోటీ, బ్రిక్స్ కరెన్సీ, చట్టపరమైన సవాళ్లు పాక్షిక విజయాలు, పాక్షిక వైఫల్యాలతో త్రిశంకు స్వర్గంలా నిలిచిపోయాయి.

ఇండో పసిఫిక్‌లో చైనా దూకుడు..: తైవాన్‌ను చైనా తన భూభాగంలో భాగంగా పరిగణిస్తుంది. అయితే తైవాన్ తనను స్వతంత్ర దేశంగా చూస్తోంది. ఈ అంశం దశాబ్దాలుగా చైనా?తైవాన్ మధ్య, అలాగే చైనా?అమెరికా మధ్య ఉద్రిక్తతలకు కారణమైంది. పీట్ హెగ్సెత్ తన ప్రసంగంలో చైనా తైవాన్ చుట్టూ సముద్ర జలాల్లో యుద్ధ విమాన వాహక నౌకలను మోహరిస్తూ బెదిరింపులకు పాల్పడుతోందని ఆరోపించారు. ఇటీవలి సంవత్సరాల్లో, చైనా తైవాన్ సమీపంలో సైనిక విన్యాసాలు, యుద్ధ విమానాల రాకపోకలను పెంచింది. ఇది ఈ ప్రాంతంలో భద్రతా ఆందోళనలను పెంచింది. ఉదాహరణకు, 2024లో చైనా తైవాన్ సమీపంలో రికార్డు స్థాయిలో సైనిక విన్యాసాలు నిర్వహించినట్లు నివేదికలు సూచిస్తున్నాయి. చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి లిన్ జియాన్, తైవాన్ అంశం చైనా అంతర్గత వ్యవహారమని, ఇందులో విదేశీ దేశాల జోక్యం అనవసరమని స్పష్టం చేశారు. ఈ స్పందన చైనా "ఒకే చైనా" విధానాన్ని గట్టిగా నొక్కి చెబుతుంది, ఇది తైవాన్‌ను తమ భూభాగంగా చూసే వైఖరిని ప్రతిబింబిస్తుంది.ఇండో?పసిఫిక్ ప్రాంతంలో చైనా దూకుడు కేవలం తైవాన్‌కే పరిమితం కాదు. దక్షిణ చైనా సముద్రంలో చైనా ఏకపక్ష చర్యలు, ద్వీపాల నిర్మాణం, సైనికీకరణ వంటివి ఫిలిప్పీన్స్, వియత్నాం, మలేషియా వంటి దేశాలతో వివాదాలకు దారితీశాయి. హెగ్సెత్ తన ప్రసంగంలో ఈ భౌగోళిక వివాదాలను ప్రస్తావిస్తూ, చైనా ఈ ప్రాంతంలో ఆధిపత్యం కోసం ప్రయత్నిస్తోందని విమర్శించారు. చైనా యొక్క "బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్" (ఃఖీఎ) ద్వారా ఆర్థిక, వాణిజ్య ఒత్తిళ్లను కూడా ఈ ప్రాంతంలోని దేశాలపై చైనా చేస్తోందని అంతర్జాతీయ విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదనంగా, హెగ్సెత్ పనామా కాలువపై చైనా ఆధిపత్య ప్రయత్నాలను ప్రస్తావించారు. చైనా లాటిన్ అమెరికాలో తన ప్రభావాన్ని పెంచుకోవడానికి పనామా కాలువను ఒక వ్యూహాత్మక సాధనంగా ఉపయోగించుకోవాలని చూస్తోందని ఆయన ఆరోపించారు. ఈ వ్యాఖ్యలు చైనా యొక్క ఆర్థిక, సైనిక విస్తరణ వైఖరిని ఎదుర్కోవడానికి అమెరికా తీసుకుంటున్న చర్యలను సూచిస్తాయి.చైనా దూకుడును అడ్డుకోవడానికి అమెరికా ఇండో?పసిఫిక్ ప్రాంతంలో తన సైనిక, ఆర్థిక సామర్థ్యాలను బలోపేతం చేస్తోంది. హెగ్సెత్ తన ప్రసంగంలో ఈ ప్రాంతంలోని మిత్ర దేశాలైన జపాన్, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా, భారతదేశం వంటి దేశాలతో సహకారాన్ని పెంచడం, రక్షణ వ్యయాన్ని పెంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంలో, ఆసియా?పసిఫిక్ ప్రాంతంలో అమెరికా నాయకత్వంలో ఏర్పడిన సహకారం మరింత బలపడుతోంది. ఈ కూటమి చైనా యొక్క ఆధిపత్య ధోరణులను అడ్డుకోవడానికి కీలక పాత్ర పోషిస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు. అమెరికా తైవాన్‌కు ఆయుధాల సరఫరా, సైనిక శిక్షణను కొనసాగిస్తోంది, ఇది చైనాకు కోపం తెప్పిస్తోంది.చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి లిన్ జియాన్, అమెరికా తైవాన్‌కు ఆయుధాల సరఫరా, సైనిక సంబంధాలను నిలిపివేయాలని హెచ్చరించారు. "నిప్పుతో ఆడుకోవద్దు" అనే వ్యాఖ్య చైనా యొక్క గట్టి వైఖరిని, ఈ అంశంలో ఎట్టి రాజీ లేని స్థితిని సూచిస్తుంది. ఈ ఉద్రిక్తతలు భవిష్యత్తులో సైనిక ఘర్షణలకు దారితీసే అవకాశం ఉందని విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇండో?పసిఫిక్ ప్రాంతంలో అమెరికా?చైనా మధ్య ఈ ఉద్రిక్తతలు కేవలం రాజకీయ, సైనిక సమస్యలకే పరిమితం కాక, ఆర్థిక, వాణిజ్య రంగాలపై కూడా ప్రభావం చూపవచ్చు. చైనా ఆర్థిక ఒత్తిళ్లు, వాణిజ్య ఆంక్షలు ఈ ప్రాంతంలోని దేశాల ఆర్థిక స్థిరత్వాన్ని ప్రభావితం చేయవచ్చు. అదే సమయంలో, అమెరికా యొక్క సైనిక బలోపేతం, మిత్ర దేశాలతో సహకారం ఈ ప్రాంతంలో శాంతి, స్థిరత్వాన్ని కాపాడేందుకు కీలకం.

## లిక్కర్ క్వీన్ అంటూ మధు యాష్కి టార్గెట్

మొదటిపేజీ తరువాయి...

కవిత, యాష్కీ మధ్య నిజామాబాద్‌లో మొదలైన యుద్ధం ఇప్పుడు హైదరాబాద్ చేరినట్టు చెప్పుకుంటున్నారు. మొదట్నుంచి కూడా కవిత చేసే విమర్శలపై మధుయాష్కీనే ఎక్కువగా స్పందిస్తున్నారు.ఈ క్రమంలో వరుసగా? వారం రోజులుగా సాగుతున్న వ్యవహారం పై.. సీరియస్ గానే స్పందించారు మధు యాష్కి. లిక్కర్ క్వీన్ కవిత బీజేపీ వదిలిన బాణమేనంటూ?ఘాటుగా స్పందించారాయన. లిక్కర్ కేసునుండి బయట పడటానికి బీజేపీ సహకారం కవితకే కావాలని, ఆమె మీద నిజామాబాద్ లో ఐబబి స్కామ్ కూడా ఉందని ఆరోపించారు యాష్కీ. తన అవినీతిని కప్పి పుచ్చుకోవడానికే ఆమె పొలిటికల్ డ్రామాలు మొదలుపెట్టారంటూ అటాక్ చేశారు కాంగ్రెస్ మాజీ ఎంపీ. ఆమె సొంత సంస్థ జాగృతిలో? 800 కోట్ల రూపాయల అవినీతి జరిగిందంటూ బాంబు పేల్చారాయన. జాగృతి మీద విచారణ జరిపించాలని, ఆ దిశగా సీఎం రేవంత్ ఆదేశించాలని కూడా కోరారు మధు యాష్కి. అసలామెను కాంగ్రెస్‌లో చేర్చుకొనేంత అంత ఖర్మ మాకు పట్టలేదంటూ స్ట్రాంగ్‌గా రియాక్ట్ అయ్యారాయన. మొత్తం మీద కవిత విషయంలో ఇన్నాళ్లు సమయమనం పాటించిన కాంగ్రెస్ పార్టీ తమ తరపున కౌంటర్ వేయడానికి మధు యాష్కీకి ఫుల్ పవర్స్ ఇచ్చినట్టు చెప్పుకుంటున్నారు. నిజామాబాద్ ఎంపీ సీట్లో ఇద్దరికీ డైరెక్ట్ ఫైట్ ఉన్నందున ఆయనే కరెక్ట్ అని భావిస్తున్నారట కాంగ్రెస్ పెద్దలు. మరీ స్పందించకుండా ఉన్నా.. ఇబ్బందే కాబట్టి? అవసరమైనట్టు, సందర్భానికి తగ్గట్టుగా కవిత చేసే ఆరోపణలకు కౌంటర్స్ వేసే బాధ్యతను మధుకు అప్పగించారట కాంగ్రెస్ పెద్దలు.

## భారత్‌కు అందని జి-7 సదస్సు ఆహ్వానం

మొదటిపేజీ తరువాయి...

న్యూఢిల్లీ,జూన్4 : అనూహ్యంగా జి-7 సదస్సుకు భారత్‌కు ఆహ్వానం అందలేదు. దీంతో ఈ దఫా ప్రధాని మోడీ సదస్సుకు హాజరు కావడం లేదు. కెనడాలోని పరిస్థితులే ఇందుకు కారణమన్న వాదనా ఉంది. కెనడాలోని అల్బెర్టాలో ఈ నెల 15 నుంచి 17 వరకు జరగనున్న జీ7 సదస్సుకు భారత్‌కు ఇంకా ఆహ్వానం అందలేదు. దీంతో ఆరేళ్లలో తొలిసారి ఈ సదస్సుకు ప్రధాని మోదీ దూరంగా ఉండను న్నట్లు తెలుస్తోంది. ఈ పరిణామంపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించిం ది. భారత్-పాక్‌ల మధ్య మధ్యవర్తిత్వం చేయడానికి అమెరికాను అనుమతించిన తర్వాత ఇది మరో దౌత్యపరమైన భంగపాటేనని పేర్కొంది. కెనడాలో జరగనున్న జీ7 సదస్సులో పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులు, రష్యా-ఉక్రెయిన్‌ల మధ్య దీర్ఘకాలంగా కొనసా గుతున్న యుద్ధంతో పాటు- ప్రపంచం ఎదుర్కొంటు-న్న సవాళ్లపైనా చర్చించే అవకాశం ఉంది. అయితే, ఈ సదస్సుకు ప్రధాని మోదీ హాజరయ్యే అవకాశం లేదని సన్నిహిత వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ శిఖరాగ్ర సమావేశానికి ప్రధాని మోదీకి ఇంకా ఆహ్వానం పంపలే దని తెలిసింది. ఒకవేళ ఆహ్వానం వచ్చినా.. ప్రస్తుతం ఇరుదేశాల మధ్య నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో ప్రధాని మోదీ అక్కడికి వెళ్లకపోవచ్చనే వాదన ఉంది. దీంతో జీ7లో ప్రధాని మోదీ పాల్గొన కపోవడం ఆరేళ్లలో తొలిసారి అవుతుంది. ఇదే అంశంపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. అమెరికా, ఫ్రాన్స్, బ్రిటన్, జపాన్, ఇటలీ, కెనడాతోపాటు- జర్మనీ అధినేతలు జీ7 సదస్సులో పాల్గొననున్నారని, వీరితోపాటు- బ్రెజిల్, మెక్సికో, దక్షిణాఫ్రికా, ఉక్రెయిన్, ఆస్ట్రేలియా దేశాధినేతలకు ఆహ్వానం అందిందని కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ జైరాం రమేశ్ వెల్లడించారు. 2014కు ముందుకు జీ8గా ఉండేదని, నాటి ప్రధాని మన్మోహన్‌కు అప్పట్లో ఆహ్వానం వచ్చేదన్నారు. 2014 తర్వాత ఈ సంప్రదాయం కొనసాగినప్పటికీ.. ఆరేళ్లలో తొలిసారి మన ప్రధానికి ఆహ్వానం అందలేదన్నారు. ఎలా చూసినా.. దౌత్యపరంగా ఇదో భంగపాటేనన్నారు. ఇదిలాఉంటే, జీ7 దేశాల్లో భారత్ లేకున్నప్పటికీ.. నిర్వహణ దేశాల ఆహ్వానం మేరకు మన ప్రధాని ఆ శిఖరాగ్ర సదస్సుల్లో పాల్గొంటు-న్నారు. గతేడాది ఇటలీ వేదికగా జరిగిన సదస్సుకు భారత్‌తోపాటు- ఆఫ్రికా, దక్షిణఅమెరికా, పలు అభివృద్ధి చెందుతున్న దేశాలు పాల్గొన్నాయి. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ కూడా పాల్గొని తన గళాన్ని వినిపించారు.

## రాహుల్ గాంధీపై అలహాబాద్ హైకోర్టు ఆగ్రహం

మొదటిపేజీ తరువాయి...

ఢిల్లీ,: ఇండియన్ ఆర్మీపై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదు అంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై అలహాబాద్ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. 2022లో భారత్ జోడో యాత్ర సందర్భంగా రాహుల్ చేసిన కామెంట్లకు సంబంధించి లక్నో కోర్టు సమన్లను జారీ చేసింది. ఆ ఉత్తర్వులకు వ్యతిరేకంగా కాంగ్రెస్ దాఖలు చేసిన పిటిషన్ ను జస్టిస్ సుభాష్ విద్యార్థితో కూడిన సింగిల్ బెంచ్ ధర్మాసనం నేడు విచారించింది. రాహుల్ పిటిషన్‌ను ధర్మాసనం తోసిపుచ్చింది. వాక్ స్వాతంత్ర్యం హక్కులో ఏ వ్యక్తికైనా, సైన్యానికి అయినా పరువు నష్టం కలిగించే ప్రకటనలు చేసే స్వేచ్ఛ లేదని స్పష్టం చేసింది. భవిష్యత్ లో సైన్యం గురించి అనుచిత వ్యాఖ్యలు చేయవద్దని రాహుల్ గాంధీని హెచ్చరించింది. ఇదిలా ఉంటే 2022లో భారత్ జోడో యాత్రలో రాహుల్ మాట్లాడుతూ.. చైనా సైనికులు అరుణాచల్ ప్రదేశ్‌లో భారత ఆర్మీపై దాడులు చేస్తున్నారు. సైనికులను కొడుతున్నారు. చైనా 2000 కిలో మీటర్ల భారత భూభాగాన్ని ఆక్రమించి, 20 మంది భారత సైనికులను చంపేసింది. అంటూ రాహల్ వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై లక్నోలోని ఓ కోర్టులో ఉదయ్ శంకర్ శ్రీవాస్తవ అనే వ్యక్తి ఫిర్యాదు చేశాడు. దీంతో కోర్టు రాహుల్‌కు సమన్లు జారీ చేసింది.

## బీసీసీఐకి కొత్త అధ్యక్షుడిగా రాజీవ్ శుక్లా

మొదటిపేజీ తరువాయి...

భారత క్రికెట్ బోర్డు నిబంధనల ప్రకారం 70 ఏళ్లు దాటిన తర్వాత బీసీసీఐలో ఏ వ్యక్తి కూడా ఏ పదవిలో ఉండకూడదు..బీసీసీఐ ప్రస్తుత ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో జన్మించారు. ఆయన ప్రారంభ జీవితం విద్యారంగం, జర్నలిజంపై ఉండేది. జర్నలిస్ట్ గా కెరీర్ ప్రారంభించిన ఆయన జనసత్తా, రవివర్ వంటి ప్రముఖ పబ్లికేషన్స్ లో పనిచేశారు. పదునైన రాజకీయ విశ్లేషణ, కమ్యూనికేషన్ స్కిల్స్ ఆయనను రాజకీయాల్లో కెరీర్‌కు సహజంగానే వెళ్లేలా చేశాయి.2000లో రాజీవ్ శుక్లా అధికారికంగా రాజకీయాల్లోకి ప్రవేశించారు. మొదట్లో అఖిల భారతీయ లోక్ తాంత్రిక్ కాంగ్రెస్‌తో, ఆ తరువాత భారత జాతీయ కాంగ్రెస్‌లోకి వచ్చారు. అనతికాలంలోనే జాతీయ అధికార ప్రతినిధిగా, ఆ తర్వాత రాజ్యసభలో ఎంపీ వరకు ఎదిగారు.రాజీవ్ శుక్లా ఉత్తరప్రదేశ్ క్రికెట్ సంఘంలో కీలక వ్యక్తి. ఉత్తరప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్‌లో సెక్రటరీగా పని చేశారు. ఆ తర్వాత బీసీసీఐ వైపు వచ్చారు. రాజీవ్ శుక్లా 2011లో ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపీఎల్) ఛైర్మన్‌గా నియమితులయ్యారు. వివాదాల మధ్య 2013లో ఆయన తాత్కాలికంగా పదవి నుంచి వైదొలిగారు. చివరకు 2015లో మళ్లీ ఆ పదవిలోకి వచ్చారు. 2020లో బీసీసీఐ ఉపాధ్యక్షుడయ్యారు.బిన్నీ స్థానంలో శుక్లా అధ్యక్షుడిగా నియమితులైతే జనరల్ బాడీ, అపెక్స్ కౌన్సిల్ సమావేశాలన్నింటికీ ఆయన అధ్యక్షత వహించాల్సి ఉంటుంది. బీసీసీఐ ఆడిట్ చేసిన వార్షిక ఖాతాలు, ఇతర ఆర్థిక ప్రకటనలపై సంతకం చేయాల్సిన ముగ్గురు వ్యక్తులలో ఆయన ఒకరు అవుతారు.

## మంథని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో

# ఉద్యోగ శిక్షణ, ఉపాధి కల్పన కార్యక్రమం



**-వందకు పైగా హాజరైన యువతి యువకులు**

మంథని ప్రతినిధి, జూన్ 04: మంథని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో మంథని పట్టణంలో ఇంటర్మీడియట్ మరియు డిగ్రీ పూర్తి చేసినటువంటి యువతకు ఉద్యోగ శిక్షణ మరియు ఉపాధి కల్పన కార్యక్రమాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. ఈ ఉద్యోగ శిక్షణ ఉపాధి కార్యక్రమానికి సుమారు 100కు పైగా యువతీ యువకులు హాజరయ్యారు. బిఎఫ్ఎస్ఐ, లాజిస్టిక్స్ హెచ్ఆర్ లు ఇంటర్వ్యూ ద్వారా హాజరైన యువతను సెలెక్ట్ చేశారు.ఎంపికైన అభ్యర్థులకు ప్రారంభ వేతనము 18వేల రూపాయలు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఇలాంటి ఉద్యోగ అవకాశాలకు సంబంధించిన కార్యక్రమా లకు మన కళాశాలను ఎంపిక చేసినందుకు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జై కిషన్ ఓజా తెలంగాణ ఐటీ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు కు, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ విఎల్వీఎస్ఎస్ సుబ్బారావు కు కృతజ్ఞతలు తెలిపారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్. జొన్నలగడ్డ సుధాకర్ మాట్లాడుతూ ఐటీ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, వైస్ ఛాన్సర్ సుబ్బారావు చొరవతో గ్రామీణ ప్రాంత యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగు తుందని తెలియజేశారు. ఇకముందు కూడా ఇలాంటి కార్యక్రమాలు ఇంకా కొనసాగిస్తామని గ్రామీణ ప్రాంత యువతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నదే తమ ఉద్దేశమని తెలియజేశారు. ముమ్ముందు ఇంకా ఇలాంటి ఎన్నో ఉద్యోగ అవకాశాలకు సంబంధించిన కార్యక్రమాలు కళాశాలలో జరుగుతాయని మంథని మరియు పరిసర ప్రాంత విద్యా ర్థులు, యువత డిగ్రీ చేయుటకు ఈ కళాశాలను ఎంపిక చేసుకొని తమ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జై కిషన్ ఓజా అన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్. జొన్నలగడ్డ సుధాకర్ కు బిఎఫ్ఎస్ఐ, లాజిస్టిక్స్ కార్పొరేట్ ట్రైనర్స్, హెచ్ఆర్ మేనేజర్ లకు కళాశాల ప్రిన్సిపల్ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## ఎర్రగడ్డ ఆస్పత్రి ఘటనపై మంత్రి దామోదర ఆరా

మొదటిపేజీ తరువాయి...

ఈ ఘటనకు కారణమైన డైయట్‌ను పర్యవేక్షించే కాంట్రాక్టర్ పనితీరు సంతృప్తికరంగా లేనందున అతని కాంట్రాక్టును రద్దు చేసినట్టు- మంత్రి తెలిపారు. ఇదే సమయంలో ఘటనపై సమగ్ర విచారణ కోసం ఒక ప్రత్యేక కమిటీని నియమిం చామని, కమిటీ నివేదిక వచ్చిన వెంటనే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇప్పటికే ఈ ఘటనపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయింది. ఇక ఫుడ్ పాయిజన్ కారణంగా మరణించిన వ్యక్తి కరణ్‌కు సంబంధించి పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉన్నట్లు- మంత్రి పేర్కొన్నారు. కరోనా వ్యాప్తి కోణంలో ఈ ఘటనపై ఆందోళన అవస రం లేదని ఆయన స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఎర్రగడ్డ మానసిక ఆసుపత్రిలో కలుషితాహారం ఘటనలో మంగళవారం ఒక రోగి మృతి చెందడంతో పాటు- 70 మంది అస్వస్థతకు గురయ్యారు. బుధవారం కూడా పలువురు రోగులు డయేరి యా లక్షణాలతో బాధపడుతున్నారు. వీరిలో 18 మందిని ఉస్మానియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కలుషితాహార ఘటనపై ఎర్రగడ్డ ఆసుపత్రిలో డీఎంఈ, డీఎంహెచ్‌వో, వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులు విచారణ చేస్తున్నారు. తాగునీరు కలుషితమైందా? అనే కోణంలోనూ పరిశీలిస్తున్నారు. ఈ సంఘటనకు కారణాలు తెలుసుకునేందుకు నమూనాలను పరీక్షలకు పంపారు.

## పాలన చేతగాని కాంగ్రెస్ పార్టీ

మొదటిపేజీ తరువాయి...



సిద్దిపేట,జూన్4 : కాంగ్రెస్ పార్టీకి పాలన చేతగావడం లేదని ఎమ్మెల్యే హరీష్ రావు తీవ్రంగా విమర్శించారు. వేములవాడలో కోడెల మృతి, ఎర్రగడ్డ మానసిక ఆసుపత్రిలో జరిగిన ఫుడ్ పాయిజన్ ఘటనలపై మాజీ మంత్రి హరీష్ రావు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి పరిపాలన చేయడం చేతకావడం లేదని వ్యాఖ్యానించారు. ఎర్రగడ్డ మానసిక రోగులకు తగిన ఆహారం కూడా అందడం లేదని 70 మంది ఆస్వస్థతకు గురయ్యారని, ఈ విషయంపై ఇప్పటివరకు సీఎం నుంచి ఎలాంటి స్పందన కనిపించలేదని మండిపడ్డారు. వేములవాడలో కోడెల మరణం కొనసాగుతుండగా ప్రభుత్వం స్తంభించినట్లే ఉంది అని వ్యాఖ్యలు చేశారు. అనేక కోడెలు గడ్డి లేక చనిపోతున్నా, ప్రభుత్వం పట్టింపు తీసుకోవడంలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మాకు బాధ్యత అప్పగిస్తే కోడెలను కాపాడుతాం అని స్పష్టత ఇచ్చారు. ఈ మధ్యే మాపై కేసులు పెట్టడం, కమిషన్లు ఏర్పాటు- చేయడం తప్ప అసలు సమస్యలపై ప్రభుత్వాన్ని పట్టించుకోడం లేదని, నిజమైన ప్రజా సమస్యలను వదిలి మిగతా విషయాల్లో బిజీ అయ్యారని తెలిపారు. ఇక రేపటి కేబినెట్ సమావేశంలో రైతు బంధు డబ్బులను వెంటనే విడుదల చేయాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని తీవ్రంగా పిలుపునిచ్చారు.

# కేసీఆర్‌ను బద్నాం చేసేందుకే నోటీసులు..

మొదటిపేజీ తరువాయి...

కేసీఆర్ ఏం తప్పు చేశారని నోటీసులు ఇచ్చారని ప్రశ్నించారు. కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చారంటే.. మొత్తం తెలంగాణకు నోటీసులు ఇచ్చినట్లేనని.. తెలంగాణ భూములకు నీళ్లు ఇవ్వడం కేసీఆర్ గారు చేసిన తప్పా ? తెలంగాణను అభివృద్ధిలో నెంబర్ వన్‌గా నిలబెట్టడం తప్పా? అంటూ మండిపడ్డారు. కాళేశ్వరం కమిషన్ కాదు.. అది కాంగ్రెస్ కమిషన్, రాజకీయ కమిషన్ కాళేశ్వరం అంటూ విమర్శించారు. ప్రాజెక్టు అంటే కేవలం మూడు బ్యారేజీలే కాదని.. ఆ ప్రాజెక్టులో 21 పంప్ హౌస్‌లు, 15 రిజర్వాయర్లు, 200 కిలోమీటర్ల మేర టన్నెల్ ఉందన్నారు.కాళేశ్వరం ప్రాజెక్టులో 1500 కిలోమీటర్ల మేర కాలువలు ఉన్నాయన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో ఎత్తిపోసిన మట్టితో దాదాపు 300 పిరమిడ్లు కట్టవచ్చునని.. కాళేశ్వరంలో వాడిన స్టీల్‌తో వంద ఈఫిల్ టవర్లు కట్టవచ్చన్నారు. కాళేశ్వరంలో పోసిన కాంక్రీట్‌తో 50 బూర్జు ఖలీఫాలు కట్టవచ్చునని తెలిపారు. అంత భారీ ప్రాజెక్టు కాళేశ్వరమని.. ప్రాజెక్టు పూర్తయితే 35 శాతం తెలంగాణ భూభాగానికి నీళ్లు అందిస్తుందన్నారు. 40 టీఎంసీలతో హైదరాబాద్‌కు శాశ్వతంగా నీళ్లు ఇచ్చే ప్రాజెక్టు కాళేశ్వరమని.. మన పరిశ్రమలకు 16 టీఎంసీల నీళ్లు అందించే ప్రాజెక్టు కాళేశ్వరమని.. 90 మీటర్ల అడుగున ఉండే నీళ్లను 600 మీటర్లపైకి.. ఎత్తిపోసే ప్రాజెక్టు కేసీఆర్‌దేనన్నారు. గట్టి గుండె కాబట్టి అంత పెద్ద ప్రాజెక్టును నిర్మించారని.. కాంగ్రెస్ పార్టీ నాయకులకు కలలో కూడా అంతపెద్ద ప్రాజెక్టును కట్టాలన్న ఆలోచన రాదన్నారు. తెలంగాణ సస్యశ్యామలం కావాలని కట్టిన ప్రాజెక్టు కాళేశ్వరమని.. దాదాపు 40 లక్షల ఎకరాలకు నీళ్లు అందించే ప్రాజెక్టుపై కుట్ర చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. కేసీఆర్‌ని బద్నాం చేయడానికి మాత్రమే కాళేశ్వరం కమిషన్ వేసిందని విమర్శించారు. గతంలో కాంగ్రెస్ హయాంలో జలయజ్ఞం పేరుతో ధనయజ్ఞం చేస్తూ 90 శాతం పనులను మెఘా కృష్ణారెడ్డి కంపెనీకి ఇచ్చారని.. మేడిగడ్డకు చిన్న చిన్న మరమ్మతులు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం పొలాలను ఎండబెడుతోందని.. కాళేశ్వరం ప్రాజెక్టులో 15 పంప్ హౌస్ పనులు చేసిన మెఘా కృష్ణారెడ్డిని కమిషన్ ముందుకు పిలిచే ధైర్యం రేవంత్ రెడ్డికి లేకపోవడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కమీషన్ల కోసం, కాంట్రాక్టర్ల కోసం మాత్రమే పనిచేస్తోందని మండిపడ్డారు. 90 శాతం పంప్‌హౌస్‌ల పనులు చేసిన కాంట్రాక్టర్‌ను ఎందుకు వదిలేశారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ పౌరుషాన్ని చూపించాల్సిన సమయం వచ్చిందని.. ఏపీ ప్రభుత్వం చేపడుతున్న బనకచర్ల ప్రాజెక్టును సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు వ్యతిరేకించడం లేదంటూ నిలదీశారు. తెలంగాణ నీళ్లను ఏపీకి తరలించుకుపోతుంటే రేవంత్ రెడ్డి ఎందుకు కేంద్రానికి ఫిర్యాదు చేయడం లేదని.. గోదావరి పెన్నా అనుసంధానం పేరిట నీళ్ల తరలింపును తక్షణవే అడ్డుకోవాలన్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాయాలని డిమాండ్ చేస్తున్నానన్నారు. చంద్రబాబు ఎన్డీఏలో ఉన్నందున జల దోపిడి చేసినా రాష్ట్ర బీజేపీ నాయకులు ప్రశ్నించడం లేదన్నారు. ఎనిమిది ఎంపీలు, ఎనిమిది మంది ఎమ్మెల్యేలు ఉన్నా రాష్ట్రానికి కేంద్రం నుంచి ఏమీ తేవడం లేదన్నారు.

# రైవెన్యూ సదస్సులలో భూ సమస్యల పరిష్కారానికి చర్యలు

**జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్**



**జననినాదం,లింగాపూర్04:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి చట్టంలో భాగంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులలో భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్ అన్నారు. బుధవారం జిల్లాలోని లింగాపూర్ మండలం గమ్నూరు గ్రామంలోని గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటుచేసిన రెవెన్యూ సదస్సు కార్యక్రమానికి హాజరై దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ భూభారతి చట్టం ద్వారా రైతుల భూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, రైతులు తమ భూ సమస్యలపై రెవెన్యూ సదస్సులలో దరఖాస్తులు సమర్పించినట్లయితే క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 20వ తేదీ వరకు రెవెన్యూ సరస్సులు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని, పేరు సవరణ, విస్తీర్ణ సవరణ, మిస్సింగ్‌సర్వే నెంబర్, నిషేధిత జాబితాలో నమోదైన భూములు వంటి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం సిర్పూర్ (యు) మండలం భూర్నూర్ (బి) గ్రామంలో, జైనూర్ మండలం పవార్‌గూడ గ్రామంలో చేసిన రెవెన్యూ సదస్సులను సందర్శించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ రాఠడ్ ప్రహ్లాద్, అడ భీంరావ్, పెద్దిరాజు, రెవెన్యూ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

# జిల్లాలో 28 వేల 642 మంది రైతుల ఖాతాలలో 325 కోట్ల రూపాయల జమ

**జననినాదం,మంచిర్యాల్ ప్రతినిధి 04:** జిల్లాలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల వద్ద నుండి వరి ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 345 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి 321 కేంద్రాలు ద్వారా 28 వేల 642 మంది రైతుల వద్ద నుండి 1 లక్ష 95 వేల 554 టన్నుల వరిధాన్యం కొనుగోలు చేసి సంబంధిత రైతుల ఖాతాలలో 325 కోట్ల 13 లక్షల రూపాయలు జమ చేయడం జరిగిందని తెలిపారు. రైతుల వద్దనుండి పూర్తి స్థాయిలో నిబంధనల ప్రకారం వరిధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేసిన 325 కొనుగోలు కేంద్రాలను మూసి వేయడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యమైన వరిధాన్యంను రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి కనీస మద్దతుధర పొందాలని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రతి రోజు 1 వేయి 500 మంది సిబ్బంది, హమాలీలు యజ్ఞంలా పని చేస్తున్నారని, నిత్యం 2 వేల నుండి 4 వేల టన్నుల ధాన్యం కాంటా చేసి 90 లారీల ద్వారా 2 వేల నుండి 3 వేల



టన్నుల ధాన్యం పెద్దపల్లిలోని 110 మిల్లులకు, జిల్లాలోని 22 మిల్లులకు తరలించడం జరుగుతుందని, మిల్లుల వద్ద ధాన్యం దిగుమతి ప్రక్రియ వేగంగా జరుగుతుందని తెలిపారు. ప్రతి రోజు 10 నుండి 20 కోట్ల రూపాయలు రైతుల ఖాతాలలో జమ చేయడంజరుగుతుందని, రైతు పండించిన ధాన్యం నష్టపోకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

# బడిబాట కార్యక్రమం విజయవంతానికి సమిష్టిగా కృషి చేద్దాం..

**జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి జనార్ధన్**



జననినాదం,మంచిర్యాల్ ప్రతినిధి 04: జిల్లాలో ఈ నెల 6వ తేదీ నుండి తలపెట్టిన ప్రొ,, జయశంకర్ బడిబాట కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు సమిష్టిగా కృషి చేయాలని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి జనార్ధన్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఎ.టి.డి.ఓ. పురుషోత్తంతో కలిసి వసతిగృహాల సంక్షేమాధికారులు, ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి మాట్లాడుతూ జిల్లాలో ఈ నెల 6వ తేదీ నుండి నిర్వహించనున్న బడిబాట కార్యక్రమ విజయవంతానికి అందరం కలిసి సమిష్టిగా కృషి చేద్దామని అన్నారు. ఈ నెల 6వ తేదీన అన్ని గ్రామాలలో, మున్సిపాలిటీలలో బడిబాట కార్యక్రమం ద్వారా చేపట్టబోయే కార్యక్రమాలపై గ్రామసభలు నిర్వహించి బడి బయట ఉన్న పిల్లలు, 5 సంవత్సరాల వయసు నిండిన ప్రతి ఒక్కరిని పాఠశాలలో చేర్పించే విధంగా కార్యచరణ చేపట్టాలని, స్వయం సహాయక సంఘాలు, ఎ.ఎ.పి.సి. సభ్యులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, వసతిగృహాల సంక్షేమ అధికారులు, పాత విద్యార్థుల భాగస్వామ్యంతో మారుమూల ప్రాంతాలలో అవగాహన కల్పించాలని, ప్రతిజ్ఞ, బడిబాట ర్యాలీ నిర్వహించాలని తెలిపారు. 7వ తేదీన ఇంటింటిని సందర్శించి బడి వయస్సు పిల్లలను నమోదు చేయాలని, జాబితా తయారు చేయాలని తెలిపారు. 8వ తేదీ నుండి 10వ తేదీ వరకు అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి పిల్లలను బడిలో చేర్పించాల, పాఠశాలలో విద్యార్థులకు కల్పించే సౌకర్యాలను వివరించాలని, భవిత కేంద్రాలకు పిల్లలకు పంపించే విధంగా చర్యలు తీసుకోవాలని, ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించి ఉట్నూర్లోని కొమురంభీం కాంప్లెక్స్‌ని వికాసం ప్రత్యేక పాఠశాలలో చేర్పించాలని తెలిపారు. 11వ తేదీన 10వ తేదీ వరకు జరిగిన కార్యక్రమ పురోగతిపై చర్చించి, 12వ తేదీ నుండి కార్యచరణ ప్రకారంగా రోజువారి కార్యక్రమాలపై చర్చించి అవసరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. 12వ తేదీన పాఠశాలల పున:ప్రారంభించబడి విద్యా సంవత్సరం ప్రారంభమవుతుందని, బడిబాట కార్యక్రమం ఆవశ్యకత తెలిసేలా పండగ వాతావరణంలో పాఠశాలలను అందంగా ముస్తాబు చేయాలని, తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించి ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని, నోట్ పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు, వర్క్‌బుక్స్, ఏక రూప దుస్తుల పంపిణీ కార్యక్రమాలు నిర్వహించాలని, గత విద్యా సంవత్సరంలో విద్యా సంబంధిత అంశాలు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలలో మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజలో పాల్గొన్న జిల్లా నాయకులు జువ్వాజీ అనిల్ గౌడ్

**జననినాదం,తిర్యాణి04:** మండలంలోని పెర్కపల్లి, సుంగాపూర్, దానాపూర్, గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు జువ్వాజీ అనిల్ గౌడ్ భూమి పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల గృహ కలను సాకారం చేస్తూ సిఎం రేవంత్ రెడ్డి ప్రజల హృదయాల్లో నిలిచారని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లు కేవలం నిర్మాణాలు కాదు, పేదల గౌరవానికి నిదర్శనమని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పున ప్రారంభంతో రాష్ట్ర వ్యాప్తంగా వేలాది కుటుంబాలకు ఆశ్రయం లభిస్తుందన్నారు. పేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి తీగల సాయిరాం గౌడ్, కిసాన్ సెల్ మండల అధ్యక్షులు మెడిశెట్టి శంకర్, సింగారపు బాపు, బల్లం శంకర్, మాజీ సర్పంచ్ టేకం మారుతి, టేకం సురేష్, పరకాల వెంకటేశం గౌడ్,



నానవేణి కొమురయ్య, కార్యకర్తలు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యత ప్రమాణాలు పాటించని బేకరీలు

- బూజు పట్టిన కేకులు విక్రయాలు
- ప్రశ్నిస్తే ఎవరికైనా చెప్పుకో అని సమాధానం

**జననినాదం,కాగజ్ నగర్ 04:** కాగజ్ నగర్ పట్టణంలోని కొన్ని బేకరీల్లో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడం, శుద్ధి లేని ఆహార పదార్థాలను విక్రయించడం ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది. ముఖ్యంగా పిల్లలు ఎక్కువగా తీసుకునే కేకులు, పఫ్లు వంటి పదార్థాల్లో బూజు పట్టిన ఘటనలు, దుర్వాసన రావడం వంటి ఫిర్యాదులు వరుసగా వెలుగులోకి వస్తున్నాయి. విజేత హాస్పిటల్ సమీపంలోని ఓ బేకరీలో కొనుగోలు చేసిన కేక్ బూజుపట్టిన దుర్వాసన వస్తుండటంతో వినియోగదారుడు నిలదీయగా, యజమాని నిర్లక్ష్యంగా "ఎవరికైనా చెప్పండి" అని సమాధానం ఇచ్చినట్టు సమాచారం. అలాగే చికెన్ పఫ్, ఎగ్ పఫ్, కర్రీ పఫ్ ల్లోనూ శుద్ధి



లోపాలు ఉన్నాయని, నాణ్యతపై ప్రశ్నించిన వినియోగదారులను బెదిరిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టే ఇటువంటి బేకరీలపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేసున్నారు.

# భూభారతి సదస్సులో వృద్ధ రైతుపై పోలీసు అధికారి అమానుషం

**జననినాదం,ఖానాపూర్ 04:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతుల భూవివాదాలు లేకుండా ధరణి చట్టాన్ని తీసివేసి రైతు భూభారతి చట్టాన్ని అమలోకి తీసుకవచ్చింది. రైతు భూభారతి సదస్సు నిర్వహించగా భూభారతి సదస్సులో తన భూసమస్యను అధికారులకు విన్నవించుకోగా అక్కడ ఉన్న పోలీస్ అధికారి జులుంతో వృద్ధ రైతును దౌర్జన్యంగా ఈడ్చుకెళ్లి బయటకు తోసేసిన ఘటన నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని పాత ఎల్లపూర్ చోటుచేసుకుంది. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని పాత ఎల్లపూర్ గ్రామ పంచాయతీ భవనంలో బుధవారం రైతు భూభారతి సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పాలుగోన్నా తహిసిల్దార్ సుజాత రెడ్డికి పాత ఎల్లపూర్ గ్రామానికి చెందిన అల్లెపు వెంకన్న అనే వృద్ధ రైతు భూసమస్య గోడును విన్నవించుకోగా క్యూ లైన్ లో రాలేదు అనే నెపంతో అక్కడ ఉన్న ఏఎస్ఐ సదరు రైతుపై దురుసుగా ప్రవర్తిస్తూ అక్కడి నుండి బయటకు నెట్టివేశాడు. ఇది గమనించిన అక్కడ ఉన్న గ్రామస్తులు రైతులపై పోలీసులు దురుసుగా ప్రవర్తించడం ఏంటి అని వీడియోలు తీసి వాట్సాప్ గ్రూపులో షేర్ చేయగా వైరల్ అయింది.



## ఏఎస్ఐ రాంచందర్ సస్పెండ్

ఖానాపూర్ మండలంలోని పాట ఎల్లపూర్ గ్రామంలో రైతు భూభారతి సదస్సులో వృద్ధరైతు పై దురుసుగా ప్రవర్తిస్తూ చేయచేసుకున్న ఏఎస్ఐ రామచందర్ పై జిల్లా ఎస్పీ జానకి షర్మిల క్రమశిక్షణ చర్యలు చేపడుతూ సస్పెండ్ చేశారు.

# ఆసియా కప్ విజేతగా సుహాసిని ప్రతిభ చాటింది

**జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస్ రావు**



**జననినాదం,ఆసిఫాబాద్ ప్రతినిధి 04:** సిర్పూర్(యు) మండలానికి చెందిన గేడం సుహాసిని, ఆసియా కప్ పోటీలో బంగారు పతకం సాధించి జిల్లాకు గొప్ప గౌరవం తీసుకువచ్చిందని జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస్ రావు అన్నారు. బుధవారం ఆమెను జిల్లా పోలీస్ కార్యాలయంలో అభినందిస్తూ, శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్లో నిర్వహించిన ఆసియా కప్ పోటీల్లో వివిధ దేశాల నుంచి పాల్గన్న క్రీడాకారులతో పోటీ పడి, గిరిజన విద్యార్థినిగా సుహాసిని బంగారు పతకం గెలవడం ఎంతో గర్వకారణమని చెప్పారు. ఆమె సాధించిన విజయం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలవాలని అభిప్రాయపడ్డారు. సుహాసినిలో ఉన్న పట్టుదల, క్రమశిక్షణ వల్లే ఈ స్థాయికి చేరిందని పేర్కొంటూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి దేశానికి, జిల్లాకు మరింత ఖ్యాతి తీసుకురావాలని ఆకాంక్షించారు. తద్వారా గిరిజన బాలికలకూ ఆటలలో అవకాశాలు విస్తరిస్తున్నాయని హర్షం వ్యక్తం చేశారు.

# ఎస్.ఎస్.సి. ఫలితాలలో జిల్లా విద్యార్థుల ప్రతిభ అభినందనీయం

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**జననినాదం,మంచిర్యాల్ ప్రతినిధి 04:** 2024-25 ఎస్.ఎస్.సి. ఫలితాలలో ప్రభుత్వ, జిల్లా పరిషత్ విభాగంలో జిల్లాలోని జన్నారం మండలం కిష్టాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ చాంబర్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్.ఎస్.సి. ఫలితాలలో ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించడం అభినందనీయమని అన్నారు. జన్నారం మండలం కిష్టాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన రాథోడ్ యోగేశ్వర్ (582), ఏల్పుల నరేందర్ (570), కొత్త అనిల్ (560)లు మంచి మార్కులు సాధించారని, జాతీయ స్థాయిలో ఎన్.ఎంఎం.ఎస్. ఫలితాలలో జిల్లాలో మొదటి స్థానం, జాతీయ స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించడంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుండ రాజన్న, ఉపాధ్యాయ బఅందం కృషి ఎంతో ఉందని అన్నారు. మేధ చారిటబుల్ ట్రస్ట్-హైదరాబాద్ అందిస్తున్న మేధా సంపూర్ణ శిక్షలో భాగంగా 5



సంవత్సరాలకు గాను ఇంటర్మీడియట్ కార్పొరేట్ విద్య, ఎం.బి.బి.ఎస్./ఐ.ఐ.టి. తదితర డిగ్రీ కోర్సులలో ఉచిత విద్యకు ఇద్దరు విద్యార్థులు ఎంపిక కావడం, సి.ఓ.ఈ. గౌలిదొడ్డికి ఎంపిక కావడం సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారులు సత్యనారాయణ మూర్తి, చౌదరి, శ్రీనివాసరావు, ఉపాధ్యాయ సిబ్బంది దాముక కమలాకర్, గోవర్ధన్, రాజన్న బుచ్చి లింగయ్య, ప్రకాష్, కాంతయ్య తదితరులు పాల్గొన్నారు.





# అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**జననినాదం,మంచిర్యాల్ ప్రతినిధి 04:** జిల్లాలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ చాంబర్లో జిల్లా పంచాయతీరాజ్, పంచాయతీ, గ్రామీణాభివృద్ధి, జిల్లా పరిషత్ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద మంజూరై కొనసాగుతున్న అంగన్వాడీ కేంద్రాలు, గ్రామపంచాయతీ భవనాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని తెలిపారు. జిల్లాలోని స్వంత భవనాలు లేని గ్రామపంచాయతీ కార్యాలయాలు, పురోగతిలో ఉన్న గ్రామపంచాయతీ కార్యాలయాల భవనాల నిర్మాణ పనులు, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన పనుల బిల్లుల చెల్లింపుల వివరాలు తెలుసుకొని పలు సూచనలు చేశారు. నిర్మాణ దశలు పూర్తి అయిన మేరకు బిల్లులు సమర్పించాలని తెలిపారు. భవన నిర్మాణానికి భూమి గుర్తించని ప్రాంతాలలో త్వరగా ప్రక్రియ పూర్తి చేయాలని, షెడ్యూల్ తెగల జనాభా అధికంగా ఉన్న అటవీ ప్రాంతాలో భూమి అందుబాటులో లేనట్లయితే అటవీ భూమి అవసరమైన మేరకు ప్రతిపాదనలు సిద్దం చేసి సమర్పించాలని తెలిపారు. జిల్లాలోని గ్రామపంచాయతీల వారిగా కొనసాగుతున్న గ్రామపంచాయతీ కార్యాలయాలు, అంగన్వాడీ కేంద్రాల భవన నిర్మాణ పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీర్ రామ్మోహన్రావు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్రావు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి గణపతి, ఎ.ఈ.ఈ.లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గోన్నారు.

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారి**



**జననినాదం,జైనూర్,జూన్04:** రాబోయే వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆసిఫాబాద్ స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారి అధికారులకు ఆదేశించారు. ఆయన బుధవారం మండలంలో పర్యటించి ముందుగా లెండిగూడ సమీపంలోని ఏటవాలు వంతేనను పరిశీలించారు. ఈ వంతెన వల్ల నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులతో మాట్లాడారు. లోతట్టు ప్రాంతాలపై దృష్టి సారించాలని పది చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు కోరారు. మండల కేంద్రంలోని మండల కేంద్రంలోని నూతనంగా నిర్మించిన సామూహిక మరుగుదొడ్ల సముదాయాన్ని పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీలో ఫాగింగ్ మిషన్ అందుబాటులో ఉంచుకోవాలని, ఇందిరమ్మ పనులు వేగవంతం చేసేలా చూడాలని అధికారులకు ఆదేశించారు. . గ్రామాల్లో గర్భిణీ స్త్రీల వివరాలను తెప్పించుకొని వారు ప్రసూతి అయ్యే సమయంలో వారికి ఎలాంటి ఇబ్బందులు కలగ కుండా ఆసుపత్రిలో సౌకర్యాలు కల్పించేలా చూడాలని అన్నారు. ఉపాధి హామీ పనుల్లో భూగర్భ జలాలు పెంచే విధంగా రైతులకు ఉపయోగపడే పనులకు ప్రధానెత తీవ్వాలని ఆయన కోరారు. తదితర విషయాలపై అధికారులతో సమీక్షించారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుధాకర్ రెడ్డి, ఎంపీ ఓ మోహన్, సూపర్డెంట్ శ్రీనివాస్, గౌరీ కోలం కూడా కార్యదర్శి సురేఖ, ఉద్యోగులు పాల్గోన్నారు.

# గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ తోనే సాధ్యం


**జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాజి అనిల్ గౌడ్**

**పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమి పూజ**



**జననినాదం,తిర్యాణి 04:** గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ తోనే సాధ్యమని జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు జువ్వాజి అనిల్ గౌడ్ అన్నారు. తిర్యాణి మండల కేంద్రంలోని ఎల్లమ్మ గుడి, గంగాపూర్ జంగుబాయి గుడి, ఆవరణంలో నిర్మించే రేకుల షెడ్లను భూమి పూజ కు వారు ముఖ్య అతిథిగా పాల్గోన్నారు. ముందుగా తిర్యాణి గౌడ సంఘ నాయకులు వారిని శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించారు. అనంతరం గుండ్ల ఆవరణలో రూ.5 లక్షల వ్యయంతో నిర్మించే రేకుల షెడ్ల భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా అనిల్ గౌడ్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న యెన్నో గ్రామాలకు కాంగ్రెస్ ప్రభుత్వంలో మహర్దశ పట్టిందని అన్నారు. ఎన్ని రకాలుగా ఆర్థిక ఇబ్బందులు ఉన్న రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మరెన్నో పథకాలు కొనసాగిస్తుందని తెలిపారు. గత పాలకుల పద్ధతి ప్రణాళిక లేకుండా అడ్డగోలుగా చేసిన పనులే నేడు మనకు అప్పులుగా మిగిలాయని పేర్కొన్నారు. ఆర్థిక క్రమశిక్షణ లేకుండా అడ్డగోలుగా పథకాలు అమలు చేసినా కెసిఆర్ ప్రభుత్వం మళ్ళి జన్మలో అధికారంలో రాదని విమర్శించారు. ఏది ఏమైనా తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన పార్టీ కాంగ్రెస్ పార్టీ మళ్ళి తెలంగాణ రాష్ట్రం అన్ని రకాలుగా ఆర్థిక అభివృద్ధి చెందాలంటే అధి కాంగ్రెస్ పార్టీ తోనే సాధ్యం అని అన్నారు. త్వరలో ఆలయ ప్రాంగణంలో పరహరి గోడ మంజూరు అయ్యేవిధంగా చూస్తానని హామీ ఇచ్చారు.

# సింగరేణి ఉత్తమ అధికారిగా పురస్కారం అందుకున్న పీకే ఓ సి-2 మేనేజర్ కె సురేష్ కుమార్



మణుగూరు జూన్ 04: బీతెలంగాణ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో సింగరేణి సీఎండి ఎన్ బలరాం చేతుల మీదుగా సింగరేణి మణుగూరు ఏరియా ఉత్తమ అధికారి పురస్కారాన్ని అందుకున్న మణుగూరు ఏరియా పి కే ఓ సి సెక్షన్ 2 గని మేనేజర్ కె సురేష్ కుమార్ ని ఓసి 2 బి రిలే కార్మికు గని ఆవరణలో శాలువా పుష్పగుచ్చంతో ఘనంగా సత్కరించారు ఈ సందర్భంగా పలువురు కార్మిక సంఘాల నాయకులు ఆపరేటర్లు మాట్లాడుతూ ఓసి-2 కి సంస్థ నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాల సాధనలో కార్మికులతో మమేకమై పనిచేస్తున్నారని

**ఘనంగా సత్కరించిన రిలే బి కార్మికులు**

సురేష్ కుమార్ సేవలను గుర్తించిన యాజమాన్యం ఆయనకు ఉత్తమ అధికారిగా పురస్కారం అందజేయటం అభినందనీయమని ఈ సందర్భంగా సురేష్ కుమార్ సేవలను వారు కొనియాడారు. మేనేజర్ సురేష్ కుమార్ తమ అనుభూతిని వ్యక్తం చేస్తూ ఉద్యోగుల అభిమానానికి తను ఫిదా అయ్యానని అన్నారు ఇదే స్ఫూర్తితో రక్షణతో కూడిన ఉత్పత్తికి ప్రతి ఒక్కరం సమిష్టి కృషితో పనిచేద్దామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రక్షణ అధికారి ఎం లింగబాబు, భూక్య భా%శీ%గ్య, కోడి కృష్ణమూర్తి, భూక్య రాందాస్ గుర్తింపు కార్మిక సంఘం ఎఐటియుసి నాయకులు వై రాంగోపాల్ ప్రాతినిధ్య సంఘం ఐ ఎన్ టి యు సి నాయకులు వత్సవాయి కృష్ణంరాజు, సిహెచ్ అశోక్ పిట్ కార్యదర్శులు సేఫ్టీ మైన్స్ కమిటీ సభ్యులు అధికారులు సూపర్వైజర్లు పెద్ద ఎత్తున ఉద్యోగులు పాల్గొన్నారు.

# బక్రీదు పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

## -మంథని సిఐ రాజు

మంథని ప్రతినిధి, జూన్ 04: బక్రీదు పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని మంథని సిఐ రాజు సూచించారు. బుధవారం మంథని పోలీస్ స్టేషన్లో సిఐ రాజు ఆధ్వర్యంలో పీస్ కమిటీ సభ్యులతో బక్రీద్ పండుగ సందర్భంగా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంథని సీఐ రాజు మాట్లాడుతు బక్రీదు పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా అందరు సహకరించాలని పీస్ కమిటీ సభ్యులకు సూచనలు చేశారు. ఎవరైనా అవాంఛనీయ సంఘటనలకు పాల్పడినచో వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మంథని ఎస్సై డి రమేష్, రామగిరి ఎస్సై చంద్రకుమార్, ముత్తారం ఎస్సై నరేష్ లు పాల్గొన్నారు.

# దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**జననినాదం,మంచిర్యాల్ ప్రతినిధి 04:** ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి నూతన ఆర్.ఓ.ఆర్. చట్టంలో భాగంగా పైలెట్ మండలంగా ఎంపికైన భీమారం మండలంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల ద్వారా స్వీకరించిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని భీమారం మండల తహశిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ప్రత్యేక తహశిల్దార్ జ్యోతి, రాంచందర్లతో కలిసి దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం తొలుతగా రాష్ట్రంలోని 4 జిల్లాలో 4 మండలాలను పైలెట్ మండలాలుగా ఎంపిక చేయడంలో భాగంగా జిల్లాలోని భీమారం మండలాన్ని ఎంపిక చేసి రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూసమస్యల సంబంధిత దరఖాస్తులు స్వీకరించడం జరిగిందని తెలిపారు. ఈ క్రమంలో స్వీకరించిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని, తిరస్కరించబడిన దరఖాస్తులకు సంబంధించి వివరాలు పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. నూతన చట్టంలో రికార్డులలో తప్పుల సవరణకు అవకాశం ఉందని, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేసేందుకు ముందు భూముల వివరాలు పూర్తి స్థాయిలో సర్వే చేసి, మ్యాప్ తయారు చేయడం జరుగుతుందని, పెండింగ్ సాదా బైనామా దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిష్కరించడం జరుగుతుందని, వారసత్వంగా వచ్చిన భూములకు విరాసత్ చేసే ముందు నిర్ణీత కాలంలో సమగ్ర విచారణ చేయడం, సంబంధిత వారసులకు నోటీసులు జారీ చేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలో జరుగుతున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. స్థానిక ప్రజలకు అందుబాటులో వేగవంతమైన, మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేస్తుందని, పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గోన్నారు.

# దొంగల హల్చల్..

# రెండు ఇండ్లలో చోరీ



గంగాధర : గంగాధర మండలం లక్ష్మీదేవిపల్లి గ్రామంలో జరిగిన రెండు దొంగతనాల ఘటనలు స్థానికులను కలకలం రేపుతున్నాయి. గ్రామానికి చెందిన గడ్డం వీరారెడ్డి తండ్రి భూమిరెడ్డి కుటుంబం మే 31వ తేదీన కరీంనగర్లోని బంధువుల ఇంటికి వివాహ వేడుకల కోసం వెళ్లిన సమయంలో వారి ఇంటిలో దొంగతనం చోటు చేసుకుందని ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం వీరారెడ్డి ఇంటికి వేసిన తాళాలు పగలగొట్టి ఉండడం చూసిన పక్కింటి వారు వీరారెడ్డికి విషయం తెలిపారు. దీంతో మంగళవారం సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చిన వీరారెడ్డి షాక్ కు గురయ్యారు. ఇంటి తాళాలు పగలగొట్టి తలుపులు తెరిచి ఉండగా, ఇంట్లోని వస్తువు లు చిందరవందరగా పడి ఉండటం గమనించారు. ఇంట్లో దాచిన రూ. 2,00,000 నగదును గుర్తు తెలియని దొంగలు అపహరించారని ఎస్సై తెలిపారు. ఇదే రోజు అదే గ్రామంలో మరికొంత దూరంలో నివసిస్తున్న కనకట్ల ఎల్లవ్వ ఇంట్లో కూడా దొంగతనం జరిగిందని, ఆమె ఇంట్లోనుంచి సుమారు రూ. 4000 విలువ గల రెండు ఇత్తడి బిందెలు, రెండు బియ్యంబస్తాలు దొంగిలించినట్లుబాధితులు పోలీసు లకు ఫిర్యాదు చేశారని ఎస్సై తెలిపారు. ఈ ఘటనల పై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గంగాధర ఎస్సై వంశీ కృష్ణ తెలిపారు. సంఘటన స్థలానికి కరీంనగర్ రూరల్ ఏసీపీ శుభం ప్రకాష్ చేరుకొని క్లూస్ టీమ్ తో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# డివైడర్ పై దూసుకువచ్చిన లారీ వ్యక్తి దుర్మరణం

ఏలూరు: డివైడర్ పై నిద్రిస్తున్న వ్యక్తి పైకి పార్సెల్ సర్వీస్ లారీ దూసుకుపోయింది దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం ఉదయం ఏలూరు జాతీయ రహదారిలో రత్నన్ డాబా సమీపంలో చోటుచేసుకుంది. మృతుడు ఏలూరు మంచినీళ్ల తోటకు చెందిన రోళ్ళ చంద్రరావు( 44) గా గుర్తించారు. అయితే ఈయన గత కొంతకాలం క్రితం ఇంటి నుండి వచ్చేసి ఇలా డివైడర్ పై నిద్రిస్తూ ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు.

# నూతన తాసిల్దార్ రాథోడ్ ప్రహ్లాద్ కు సన్మానం



**జననినాదం,సిర్పూర్(యు)04:** సిర్పూర్ (యు) మండల నూతన తాసిల్దార్ గా రాథోడ్ ప్రహ్లాద్ బాధ్యతలు స్వీకరించగా బుధవారం బాండేర్ వీటీడీఏ అధ్యక్షులు కుమ్ర భీంరావు, మాజీ సర్పంచులు నూతన తాసిల్దార్ కు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన తాసిల్దార్ కు రాథోడ్ ప్రహ్లాదుకు శాలువతో సన్మానం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వి టి డి ఏ అధ్యక్షులు కుమ్ర భీంరావు, తాజా మాజీ సర్పంచ్ అర్క నాగోరావ్ ,యశ్వత్రావులుపాల్గోన్నారు.

# భూ సమస్యలకు ఇక శాశ్వత పరిష్కారం

## -మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్




మంథని ప్రతినిధి,జూన్ 04: భూ సమస్యలన్నీ ధరణి చట్టంతోనే వచ్చాయని, తమ ప్రభుత్వం తీసుకొస్తున్న భూభారతి చట్టం ద్వారా నిఖార్సైన రికార్డులు తయారు చేసి రైతుల భూములకు శాశ్వత పరిష్కారం చూపుతామని మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ అన్నారు. మంథని మండలం గుంజపడుగు గ్రామంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులో తహసిల్దార్ కుమారస్వామి, సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ పాల్గొన్నారు, ఈ సందర్భంగా కొత్త శ్రీనివాస్ మాట్లాడుతూ రైతుల భూములు సర్వే చేయించి సంపూర్ణంగా సరిహద్దులు గుర్తించి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చేయడమే ఈ చట్టం లక్ష్యమన్నారు. ఈ నెల 20వ తేదీ వరకు జరిగే రెవెన్యూ సదస్సులను రైతులు వినియోగించుకోవాలని కోరారు. రెవెన్యూ సదస్సుల్లో రైతులు తమ భూ సమస్యలపై తగు పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ యంత్రాంగం భూ భారతి చట్టం అమలుపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమం లో ఆర్ఐ అనిల్ కుమార్, రెవెన్యూ సిబ్బంది సతీష్, వరలక్ష్మీ, మధుకర్, తదితరులు పాల్గొన్నారు.

# భూభారతి దరఖాస్థులను క్షేత్రస్థాయిలో విచారణ చేయాలి



జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి జూన్ 4: భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులు ఆధారంగా రెవెన్యూ సిబ్బంది క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించిన భూ సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. బుధవారం భూపాలపల్లి మండలం, వజినేపల్లి గ్రామంలో జరుగుతున్న భూ భారతి రెవెన్యూ సదస్సును ఆకస్మిక తనిఖీ చేసి ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన భూ భారతి చట్టంపై ఏప్రిల్ మాసంలో అన్ని మండలాల్లో అవగాహన సదస్సులు నిర్వహించామని తెలిపారు. అనంతరం రేగొండ మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి ప్రజల నుండి విజ్ఞాపనలు, సలహాలు, సూచనలు తీసుకున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ఈ నెల 3వ తేదీ 20వ తేది వరకు జిల్లాలోని అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని ప్రజలు ఇచ్చిన ప్రతి దరఖాస్తు రిజిస్టర్ లో నమోదు చేయాలని ఆదేశించారు. వచ్చిన దరఖాస్తు పరిశీలించి క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి పట్టాలు జారీ చేస్తామని తెలిపారు. ప్రజలు రెవెన్యూ సదస్సులలో తమ భూ సమస్యలపై దరఖాస్తు ఇవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా సదస్సుకు వచ్చిన ప్రజల భూములకు సంబంధించిన సమస్యలను కలెక్టర్ స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గిర్దావర్ రామస్వామి, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆయుధ లైసెన్సులు ప్రమాదకరం!



అస్సాం సరిహద్దు ప్రాంతాల్లో 21 ఏళ్లు నిండిన ప్రజలందరికీ ఆయుధాల లైసెన్సులు మంజూరు చేయాలని అక్కడి బిజెపి డబుల్ ఇంజన్ సర్కారు నిర్ణయించడం రాజ్యాంగాన్ని అపహాస్యం చేయడమే! సరిహద్దు ఆవలి నుంచి చొరబడి బెదిరింపులకు దిగేవారి నుంచి రక్షణ, వ్యక్తిగత భద్రత కల్పించేందుకు బంగ్లాదేశ్ పొడవునా రెండు జిల్లాల్లోని ఆరు ప్రాంతాల వాసులకు ఆయుధాల లైసెన్సులివ్వాలని నిర్ణయించినట్లు ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ చెబుతున్నారు. ప్రజలకు రక్షణ, భద్రత కల్పించాల్సిన బాధ్యత, మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసి, వారి జీవన ప్రమాణాలు మెరుగుపడేలా చేయూతనందించాల్సిన కర్తవ్యం ఎన్నికైన ప్రభుత్వాలదే! అందుకు భిన్నంగా మతం, జాతి వైషమ్యాలు రెచ్చగొట్టి%ొ% లవ్ జిహాద్, ల్యాండ్ జిహాద్, ఫుడ్ జిహాద్%ొ%తదితర పేర్లతో విభజనను పెంచి లబ్ధి పొందడమే ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో నడిచే బిజెపి డబుల్ ఇంజన్ సర్కార్ల దుర్మార్గ పాలన. బుల్డోజర్లతో ముస్లింల ఇళ్లను నేలమట్టం చేసి శరణార్థుల్లా మార్చేయడం, వారి జీవనోపాధిని, వ్యాపారాలను దెబ్బతీయడం అస్సాం బిజెపి సర్కారుకు నిత్యకృత్యమే! ఆయుధాలివ్వడానికి ప్రభుత్వం గుర్తించిన ప్రాంతాల్లో ముస్లిం జనాభా అధికంగా ఉండటం ఆందోళనకరం. అక్కడ ముస్లిమేతరులకు ఆయుధాలివ్వడం మత విభజనను తీవ్రతరం చేసి, సామాజిక సామరస్యాన్ని దెబ్బతీయడానికి దారితీస్తుంది. సాయుధ ముఠాల పరస్పర దాడులతో ఏళ్ల తరబడి మణిపూర్‌లో మంటలు రేగడం బిజెపి నేతృత్వంలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యమే. గత కొన్నేళ్లుగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా నేతృత్వంలోని బిఎస్ఎఫ్, రాష్ట్ర పోలీసులు%ొ% మతం ప్రాతిపదికన అక్రమ వలసదారులను గుర్తిస్తూ, వారిని రాష్ట్ర సరిహద్దులకు తీసుకెళ్లి చట్టవిరుద్ధంగా దేశం నుంచి బయటకు గెంటేస్తున్నారు. జాతి %-% నేల %-% స్థానికతను కాపాడతామని కబుర్లు చెబుతూ%ొ% మత విద్వేషాలు రెచ్చగొట్టే చర్యలకు పాల్పడుతున్నారు. పహల్గాం ఉగ్రదాడి తరువాత ఎలాంటి ధ్రువీకరణ లేకుండానే బెంగాలీ మాట్లాడే ముస్లింలను తరిమివేసే ప్రక్రియ మరింత తీవ్రమైంది. ఈ చర్యలపై రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు పెల్లుబుకడం, గౌహతి హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో ఫిర్యాదులు దాఖలు కావడంతో%ొ% ఇలా నెట్టేసిన 65 మందిని తిరిగి రాష్ట్రంలోకి తీసుకురావాల్సి వచ్చింది. విదేశీయులను వారి దేశాలకు పంపించేయాలని చెబుతూనే, భారత పౌరులా? కాదా? అనే అంశంపై కేసులు పరిష్కారం కాని, ఎలాంటి నిర్ధారణ కాని వారిని దేశం నుంచి పంపివేయలేమని సర్వోన్నత న్యాయస్థానం ఫిబ్రవరిలో తేల్చిచెప్పింది. అక్రమ మార్గాల్లో దేశంలో ప్రవేశించే పేదలు, పత్రాలు లేని, ఎటువంటి నేరచరిత్ర లేని వలసదారులను గౌరవంగా చూడాలి. వారిపట్ల చట్టప్రకారం వ్యవహరించాలి. ట్రంప్ మాదిరిగా అంతర్జాతీయ చట్టాలన్నింటినీ ఉల్లంఘించి, యుద్ధ నేరస్తుల్లా ఘోరంగా అవమానించడమూ సరికాదు. వారిని బూచిగా చూపి స్థానిక ప్రజలకు ఆయుధాలివ్వడం అత్యంత ప్రమాదకరం. ఈ పద్ధతి అనైతికమూ, రాజ్యాంగ విరుద్ధమూ అని భావించడం వల్లే మన దేశంలో ఆయుధ లైసెన్సింగ్ విధానం కఠినంగా ఉంటుంది. 1959 ఆయుధ చట్టం, 2016 ఆయుధ నియమాల ప్రకారం కఠినమైన లైసెన్సింగ్ ప్రక్రియ ద్వారా స్వీయ సంరక్షణకు పరిమిత సంఖ్యలోనే లైసెన్సులు ఇస్తారు. ఇటువంటి కఠిన నియమాలు లేకుండా ఆయుధాలిస్తే అవి చట్టవ్యతిరేక శక్తుల చేతుల్లోకి వెళ్లే ప్రమాదమే ఎక్కువ. వ్యక్తిగత కక్షలు, గ్యాంగ్‌ల మధ్య హింసకు దారితీయొచ్చు. దీని పర్యవసానాలు అత్యంత తీవ్రంగా ఉంటాయి. అమెరికా తదితర పశ్చిమ దేశాల్లోని గన్ కల్చర్ ఇందుకు సజీవ సాక్ష్యం. అక్కడ సగటున వంద మంది వద్ద 120.5 తుపాకులున్నాయని గణాంకాలు చెబుతున్నాయి. ఏటా 30 వేల నుంచి 40 వేల మధ్య తుపాకీ కాల్పుల వల్ల మరణాలు సంభవిస్తున్నాయి. ఎటువంటి కారణం లేకుండానే పౌరులను, చిన్నారులను దారుణంగా పొట్టన పెట్టుకుంటున్న ఉదంతాలెన్నో! అస్సాంలో ఉల్ఫా వంటి ఉగ్రవాద సంస్థల ఆగడాలు గతంలోని భయానక స్థితిని గుర్తు చేసేవే. శాంతి భద్రతలను కాపాడటం, చొరబాట్లను నిరోధించడం, సామరస్యపూర్వక వాతావరణం కల్పించడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత. ఆ కర్తవ్యాలను గాలికొదిలేయడం క్షంతవ్యం కాదు. 'జంగిల్ రాజ్ ఏర్పాటు చేయడానికా ఆయుధాల లైసెన్సులిస్తున్నార'ని ప్రతిపక్షాలు, మేధావులు నిలదీస్తున్నారు. ఇప్పటికైనా ఇటువంటి ప్రమాదకర నిర్ణయాలను డబుల్ ఇంజన్ సర్కారు వెనక్కి తీసుకోవాలి.

## లాయర్స్ ఇండియా ఆర్గనైజేషన్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ గా ఇనుముల సత్యనారాయణ

### -నియామక ఉత్తర్వులు అందించిన ఎల్ఐఓ జాతీయ కార్యదర్శి పొన్నం రవీందర్



మంథని ప్రతినిధి, జూన్ 04: మంథని పట్టణానికి చెందిన ప్రముఖ హైకోర్టు న్యాయవాది ఇనుముల సత్యనారాయణ జాతీయ లాయర్స్ ఇండియా ఆర్గనైజేషన్( ఎల్ ఐ ఓ) తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ గా నియామకం అయ్యారు. ఈ మేరకు ఇనుముల సత్యనారాయణ ను నియమిస్తూ లాయర్స్ ఇండియా ఆర్గనైజేషన్ జాతీయ కార్యదర్శి పొన్నం రవీందర్ బుధవారం నియామకం ఉత్తర్వులు అందించారు. హైదరాబాద్ లో జరిగిన ఈ కార్యక్రమంలో లాయర్స్ ఇండియా ఆర్గనైజేషన్ ద్వారా తెలంగాణ రాష్టంలో సంస్థ కార్యక్రమాలను విస్తరించాలని, లీగల్ అవేర్నెస్, న్యాయవాదుల సంక్షేమ కార్యక్రమాలు, లీగల్ సెమినార్లు, న్యాయ సలహా క్యాంపులు,సంస్థ ఆధ్వర్యంలో ప్రజా ప్రయోజనాల వాజ్యాల దాఖలు, సంస్థ ఆధ్వర్యంలో అధికార, న్యాయ మరియు ప్రభుత్వ సంస్థలకు వినతులు ఇవ్వడం మరియు స్థానిక న్యాయవాదులను జిల్లా మరియు లీగల్ కమిటీల్లో నియామకం చేయాలని ఆ నియామకం ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా హైకోర్టు న్యాయవాది ఆలే నర్సింహా కు కూడా నియామకం ఉత్తర్వులు అందించారు. ఈసందర్భంగా తమకు పదవీ ఇచ్చి ప్రోత్సాహం అందించిన లాయర్స్ ఇండియా ఆర్గనైజషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి పొన్నం రవీందర్ ని ఇనుముల సత్యనారాయణ శాలువాతో సత్కరించి ధన్యవాదాలు తెలిపారు.

# ఒకేసారి 3 లక్షల మందికి లబ్ధి

విజయవాడ, జూన్ 4: ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ కూటమి సర్కారు ఏర్పాటై.. మరికొన్ని రోజుల్లో ఏడాది పూర్తి కానుంది. 2024 ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఊహించని రేంజులో ఘన విజయం అందుకుంది ఎన్డీఏ కూటమి. మొత్తం 175 స్థానాలకు గానూ.. 164 చోట్ల టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులు విజయం సాధించారు. దీంతో తిరుగులేని మెజారిటీతో టీడీపీ కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. జూన్ 12వ తేదీన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.. డిప్యూటీ సీఎంగా పవన్ కళ్యాణ్, మంత్రులుగా నారా లోకేష్ సహా కీలక నేతలు ప్రమాణ స్వీకారం చేశారు. అమరావతిలో జరిగిన ఆ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా హాజరయ్యారు. అయితే ఏపీలో టీడీపీ కూటమి ప్రభుత్వం కొలువుదీరి వచ్చే జూన్ 12తో ఏడాది పూర్తి కానుంది. ఈ నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం భారీ శుభవార్త వినిపించనున్నట్లు వార్తలు వస్తున్నాయి.ఏపీలో ఎన్డీఏ కూటమి సర్కారు ఏడాది పాలన పూర్తైన సందర్భంగా కొత్తగా నిర్మించిన 3 లక్షల ఇళ్లను ప్రారంభించి.. గృహప్రవేశాలు చేయించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిసింది. ఇందుకు జూన్ 12వ తేదీని ముహూర్తంగా నిర్ణయించినట్లు సమాచారం. మూడు లక్షల మంది పేదలకు ఇళ్లను అందించి.. అదేరోజు వారితో గృహప్రవేశాలు చేయించేలా ప్లాన్ చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో జూన్ 12 వ తేదీ లోపు ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. మూడు లక్షల ఇళ్లల్లో ఇప్పటి వరకూ 1.70 లక్షలు పూర్తికాగా.. మరో 60 వేల ఇళ్లు తుది దశలో ఉన్నాయి. గడువులోగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేయించేందుకు ప్రభుత్వం అదనపు సాయం కూడా అందిస్తున్న విషయం తెలిసిందే.
బీసీ, ఎస్సీ లబ్ధిదారులకు రూ.50 వేలు చొప్పున, ఎస్టీలకు రూ.75 వేలు చొప్పున ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసేందుకు సాయం అందిస్తున్నారు. గడువులోగా ఇంటి నిర్మాణాలను పూర్తి చేయించాలని సీఎం నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ (హౌసింగ్) అజయ్ జైన్ జిల్లా అధికారులకు పలు సూచనలు చేశారు. ఇళ్ల నిర్మాణాల ప్రగతిపై ప్రతిరోజూ జిల్లా కలెక్టర్లు, గృహ నిర్మాణ శాఖ అధికారులతో నిత్యం సమీక్షిస్తున్నారు. పనులను గడువులోగా పూర్తి చేసేలా సూచనలు, సలహాలు ఇస్తున్నారు.

# ఖని లో కృష్ణవేణి వికాస్ జూనియర్ కళాశాల సంచలనం

**జేఈఈ అడ్వాన్స్డ్ ఫలితాల్లో "మోక్షిత్"కు 2835 ర్యాంక్**
**ఎంట్రెన్స్ పరీక్షల్లో సత్తా చాటుతున్న కాలేజ్**
**టీచింగ్ మెథడ్స్, ఎంట్రన్స్ బుక్స్ ద్వారా ఆల్ ఇండియా ర్యాంకులు**
**కృష్ణవేణి వికాస్ విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించే విద్యాలయం**
**కోల్ బెల్ట్ ఆణిముత్యాలకు కృష్ణవేణి వికాస్ పదును**
**చైర్మన్ డా రవికుమార్ నాగండ్ల, ప్రిన్సిపల్ వెంకన్న**




గోదావరిఖని :కృష్ణవేణి వికాస్ జూనియర్ కళాశాల ఆల్ ఇండియా స్థాయిలో ప్రతిభ చాటినది. సోమవారం విడుదల అయిన జేఈఈ ఫలితాల్లో "రాచపల్లి మోక్షిత్"కు 2835 ర్యాంక్ సాధించాడు. ఈ మేరకు మంగళవారం కళాశాలలో చైర్మన్ డా: రవికుమార్ నాగండ్ల సూచన మేర ర్యాంకర్ మోక్షిత్ ను ప్రిన్సిపల్ ఎం వెంకన్న ఘనంగా సన్మానించారు. శాలువాతో సత్కరించి పుష్పగుచ్చం అందజేసి మిఠాయి తినిపించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మీడియాతో మాట్లాడుతూ......టీచింగ్ మెథడ్స్, ఎంట్రన్స్ బుక్స్ ద్వారా ఆల్ ఇండియా ర్యాంకులు గత పది ఏండ్లుగా సాధ్యమవుతున్నట్లు తెలిపారు. కళాశాలను స్థాపించి 12 సంవత్సరాలుగా అన్ని రకాల ఎంట్రెన్స్ పరీక్షలలో, ఇంటర్మీడియట్ పబ్లిక్ ఎగ్జామ్స్ ఫలితాలలో ప్రభంజనం సృష్టిస్తున్నది అని తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తుండడం ఆనందాన్ని కలిగిస్తున్నదని అన్నారు. కృష్ణవేణి వికాస్ జూనియర్ కళాశాల గోదావరిఖని ప్రాంతంలో విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించే విద్యాలయంగా కీర్తింపబడడం విద్యార్థుల విజయం పట్ల తమ బాధ్యతను రెట్టింపు చేస్తున్నదని తెలిపారు. కోల్ బెల్ట్ ఆణి ముత్యాలకు కృష్ణవేణి వికాస్ పదును పెట్టే సరస్వతి నిలయమని ప్రశంసించారు. దేశంలోనే అత్యంత ప్రాచుర్యం పొందిన జేఈఈ అడ్వాన్స్డ్ ఫలితాలలో కృష్ణవేణి వికాస్ జూనియర్ కళాశాల విద్యార్థి మోక్షిత్ 2835 ర్యాంకు సాధించడం చరిత్రపుటల్లో లిఖించే సంతోషమైన సందర్భంగా అభివర్ణించారు. ఈ యొక్క సన్మాన కార్యక్రమంలో కళాశాల లెక్చరర్లు ఆఫీస్ స్టాఫ్, ర్యాంకర్ మోక్షిత్ మాతృమూర్తి వసంత పాల్గొన్నారు.

# కరీంనగర్ లో డివిజన్ల నోటిఫికేషన్



కరీంనగర్, జూన్4,: మున్సిపల్ ఎన్నికలకు త్వరలోనే నగరా మోగనున్న నేపథ్యంలో పట్టణాలు, నగరాల్లో విలీన గ్రామాలకు సంబంధించి డివిజన్లు, వార్డుల పునర్విభజనకు రాష్ట్ర సర్కారు సోమవారం నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ మేరకు ఈ నెల 3న డివిజన్ల విభజనకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేయాల్సి ఉంటుంది 5 నుంచి 11 వరకు అభ్యంతరాలు, నివేదికలు స్వీకరించాలి. 12 నుంచి 16 వరకు అభ్యంతరాలను పరిశీలించాల్సి ఉంటుంది. 17, 18 తేదీల్లో డివిజన్ల విభజన పత్రాలకు కలెక్టర్ అనుమతి తీసుకోవాలి. 19న ముసాయిదా జాబితాను సీడీఎంఏకు పంపించాలి. 20న సీడీఎంఏ నుంచి ప్రభుత్వానికి నివేదికను పంపించి, 21న ఫైనల్ డివిజన్ల జాబితాను విడుదల చేస్తారు. కరీం'నగరం' సమీపంలో కొత్తపల్లి మున్సిపాలిటీతో పాటు మల్కాపూర్, చింతకుంట, గోపాల్‌పూర్, దుర్శేడ్, బొమ్మకల్ గ్రామాలను కలుపుతూ ప్రస్తుతం ఉన్న 60 డివిజన్లను 66కు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం కొద్దిరోజుల క్రితం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఈ మేరకు నగరపాలక అధికారులు 66 డివిజన్లకు సంబంధించి గతంలోని ఓటరు జాబితాను అనుసరించి డివిజన్ల విభజనను పూర్తి చేసి సీడీఎంఏకు పంపినట్లు సమాచారం. అందుకు సంబంధించిన ఒక జాబితా కూడా గతంలోనే సోషల్ మీడియాల్లో చక్కర్లు కొట్టింది. అప్పటి నుంచే కార్పొరేషన్‌లోని వివిధ పార్టీల నాయకుల్లో డివిజన్ల విభజనపై ప్రత్యేక ఆసక్తి నెలకొన్నది.ఎవరికివారే తమ డివిజన్ల విభజన ఎలా జరిగింది? ఏయే కాలనీల ఓట్లు ఏయే ప్రాంతాల్లో కలిపారన్న చర్చలు సాగాయి. ప్రతి డివిజన్‌కు 4500 నుంచి 5500 ఓటర్లు ఉండేలా అధికారులు డివిజన్లను విభజించినట్లు తెలుస్తుండగా, అయితే పలు డివిజన్లల్లో దూర ప్రాంతాలకు చెందిన ఇండ్లను చేర్చినట్లు ప్రచారం జరుగుతున్నది. ఈ క్రమంలో ఆయా ప్రాంతాలకు సంబంధించి ఫిర్యాదులు, తమ అభ్యంతరాలు తెలిపేందుకు ఇప్పటికే పలు పార్టీలకు చెందిన నాయకులు సిద్ధమయ్యారు

## మరణించి మరొకరికి వెలుగుని ఇచ్చిన హెడ్ కానిస్టేబుల్



కనగల్లు : కనగల్ పోలీస్ స్టేషన్ లో హెడ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న బొల్లెపల్లి సైదులు మంగళవారం డ్యూటీలో ఉండగానే రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. కనగల్లు ఎస్సై పి.విష్ణు మృతుడి ఐ డొనేషన్ కోసం మానవతా దృక్పథంతో కుటుంబ సభ్యులను చైతన్య పరిచి నేత్ర దానానికి ఒప్పించారు. నేత్ర దానానికి ఒప్పుకున్న కుటుంబ సభ్యులు లయన్స్ క్లబ్ ఆఫ్ నల్గొండ చారిటబుల్ ట్రస్ట్ కి ఐ డొనేషన్ చేశాడు.
నేత్రదానం ద్వారా ఇద్దరు కార్నియా అంధులకు వెలుగు చూపించారు. బాధలను కుటుంబ సభ్యుల త్యాగం మరువలేనిది అని లయన్స్ క్లబ్ సభ్యులు అన్నారు. 127వ కంటి దానంగా, 254 వ కార్నియా కంటి పొరల సేకరణలో సైదులు పేరు నమోదు అయినట్లు తెలిపారు.

## ఆర్థిక సహాయం



కొడిమ్యాల, జూన్ 4: కోడిమ్యాల మండల కేంద్రానికి చెందిన చిర్ర రమేష్ ఇటీవల అనారోగ్యం తో మరణించారు. వారి కుటుంబానికి మరియు మ్యకల తుషార్ హైద్రాబాద్ లో పటాన్చెరువు ప్రాంతములో పనిచేస్తుండగా ఫిట్స్ రావడంతో అతనిని కలిసి ఆరోగ్య సమాచారం కొత్తూరీ అంజన్న సతీమణి గత సంవత్సర కాలం నుండి క్యాన్సర్ తో బాధపడుచు ఈ మధ్య ఆమెకి సర్జరీ జరిగింది వారి కుటుంబాన్ని కలిసి ఈ మూడు కుటుంబాలను కలిసివారికి మనో ధైర్యాన్ని చెప్పి ట్రస్ట్ ఆవర్ జగన్మాత శంకర్ మల్లన్న హ్యూమన్ నెట్వర్క్ ద్వారా బింగి మనోజ్ కుమార్ సామాజిక కార్యకర్త ఆర్థిక సహాయం బియ్యం పంపిణీ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో పర్లపెల్లి జలంధర్ సముద్రాల భూమేష్ యువకులు పాల్గొన్నారు.

# మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పేదలకు ఉచిత న్యాయ సహాయం –


## సీనియర్ సివిల్ జడ్జ్ వి.భవాని





మంథని ప్రతినిధి,జూన్ 04: మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పేదలకు ఉచిత న్యాయ సహాయం అందిస్తున్నట్లు మంథనిసీనియర్ సివిల్ జడ్జ్ వి.భవాని పేర్కొన్నారు, బుధవారం మంథని మండలం గుజపడుగు గ్రామంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జ్ వి.భవాని సదస్సులో మాట్లాడుతూ ఈనెల 14 న నిర్వహించనున్న లోక్ అదాలత్ లో రాజీకి అవకాశం ఉన్న కేసులను ఇరు వర్గాల మధ్య అవగాహన తో పరిష్కరించే అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు,పేద ప్రజలు న్యాయ సహాయం కోసం కోర్టులకు రావచ్చని పేర్కొన్నారు,బార్ అసోషియేషన్ ఉపాధ్యక్షులు కె రఘోత్తమ్ రెడ్డి పౌరుల హక్కులు,భాద్యతలు,చట్టాల పట్ల అవగాహన కల్పించారు,మంథని తహసీల్దార్ కుమార స్వామి భూభారతి,భూ చట్టపరమైన అంశాల పట్ల అవగాహన కల్పించారు, మంథని ఏస్.ఐ డి.రమేష్ సైబర్ చట్టాలు,మారక ద్రవ్యాలపై మాట్లాడారు,న్యాయ వాదులు శశిభూషణ్ కాచె,కటకం శ్రీనివాస్ లు రైతు సంబంధించిన చట్టపరమైన ఆశాలపై మాట్లాడారు. పిఏసిఏస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్,లోక్ అదాలత్ సభ్యులు కనుకుంట్ల స్వామి తోపాటు మహిళలు,రైతులు పాల్గొన్నారు.

# ఆ మూడు శాఖలపైనే జనసేన దృష్టి



విజయవాడ, జూన్ 4: జనసేన అధినేత పవన్ కల్యాణ్ తమ పార్టీకి కేటాయించిన మూడు శాఖలపై మాత్రం ఫోకస్ పెట్టారు. ఉప ముఖ్యమంత్రిగా మిగిలిన శాఖలను ఆయన ఇటీవల కాలంలో పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం ఏర్పాటయిన తొలినాళ్లలో హోంశాఖపై పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు అప్పుడు సంచలనమే అయ్యాయి. హోంమంత్రికి చేతకాకుంటే తాను ఆ శాఖను తీసుకోవాల్సి వస్తుందని కూడా అని ఆయన ఒకరకంగా టీడీపీకి కేటాయించిన శాఖలపై కూడా కాస్త కటువుగానే వ్యవహరించేవారు. కానీ గత కొద్ది రోజుల నుంచి మాత్రం తమ పార్టీకి కేటాయించిన శాఖల పర్యవేక్షణకు మాత్రమే పరిమితమయినట్లు కనిపిస్తుంది. మిగిలిన శాఖల జోలికి ఆయన పోవడం లేదు.ప్రధానంగా తాను నిర్వహిస్తున్న గ్రామీణాభివృద్ధి శాఖతో పాటు అటవీ శాఖపై కూడా ఇప్పటికే పట్టు సంపాదించిన పవన్ కల్యాణ్ స్థానిక సంస్థలకు నిధులను విడుదల చేయడంలో సక్సెస్ అయ్యారు. గ్రామీణ రహదారులను మెరుగుపర్చేందుకు కూడా నిధులను కేటాయించారు. ప్రతి గ్రామంలో రక్షిత మంచినీటి సదుపాయాన్ని కల్పించేలా తగిన చర్యలు తీసుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులతో పాటు వివిధ కేంద్ర ప్రాయోజిత పథకాలను కూడా రాష్ట్రానికి తీసుకు వచ్చి గ్రామీణాభివృద్ధి పాలనలో గతంలో ఎన్నడూ రాని విధంగా నిధులు రప్పించే ప్రయత్నం చేస్తున్నారు. కేంద్రంలోని బీజేపీ నేతలతో ఉన్న సత్సంబంధాలతో మెరుగ్గా నిధులను రాష్ట్రానికి తెచ్చేందుకు కృషి చేస్తున్నారు. ఇక తన పార్టీకి చెందిన కందుల దుర్గేష్ కు పర్యవేక్షిస్తున్న సినిమాటోగ్రఫీ, టూరిజంపైన కూడా పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా ఫోకస్ పెట్టారు. ముఖ్యంగా సినీ థియేటర్లలో బంద్ కు ఎగ్జిబిటర్లు పిలుపు నిచ్చిన తర్వాత పవన్ కల్యాణ్ స్వయంగా రంగంలోకి దిగారు. థియేటర్లలో సోదాలు, దాడులు చేయిస్తూ ఆహార పదార్థాల ధరలను తగ్గించేలా చర్యలు తీసుకున్నారు. తన సినిమా హరిహర వీరమల్లు రిలీజ్ కు ముందు ఈ బంద్ నిర్ణయం పై ఆగ్రహంతో పవన్ ఈ దాడులు చేయిస్తున్నారన్న విమర్శలు వినిపించినప్పటికీ థియేటర్లలో ఆహార వస్తువుల ధరలు పది నుంచి ఇరవై శాతానికి తగ్గిస్తూ యాజమాన్యాలు నిర్ణయం తీసుకోవడంతో పవన్ చర్యల వల్లనేనని ప్రజలు భావిస్తున్నారు. మరో ముఖ్యమైన శాఖ పౌర సరఫరాల శాఖ. ఈ శాఖ చాలా కీలకమైనది కూడా. పేదలతో నిత్యం టచ్ లో ఉండే శాఖ కావడంతో పవన్ దీనిపై కూడా దృష్టిపెట్టారు. పవన్ కల్యాణ్ నేరుగా రంగంలోకి దిగి రేషన్ దుకాణాలను ఈ రోజు నుంచి రెండు పూటలా నిర్వహించేలా ఆదేశాలు విడుదల చేయించగలిగారు. అంతేకాదు ఆదివారం కూడా రేషన్ సరుకులు ఇవ్వాలని తెలిపారు. రేషన్ ను గత ప్రభుత్వం వాహనాల ద్వారా అందచేయడం వల్ల ఎక్కువగా దుర్వినియోగం అవుతుందని, అందుకే రేషన్ దుకాణాల ద్వారానే పంపిణీ చేయాలని నిర్ణయించడం వెనక కూడా పవన్ కల్యాణ్ ఆలోచన ఉంది. రేషన్ దుకాణాల్లో బియ్యంతో పాటు నూనె, పప్పు వంటి వస్తువులను కూడా చౌకగా సరఫరా చేయాలని నిర్ణయించారు.మొత్తం మీద పవన్ కల్యాణ్ మూడింటిపైనే దృష్టి పెట్టినట్లు కనిపిస్తుంది. తమకు అప్పగించిన శాఖల్లో వైఫల్యం ఉండకూదన్నది ఆయన ఆలోచనగా ఉంది.

# మరో హైవే విస్తరణకు మోక్షం

నిజామాబాద్, జూన్ 4: తెలంగాణలో మరో హైవే విస్తరణకు మోక్షం లభించింది. నిజామాబాద్- జగ్దల్‌పూర్ జాతీయ రహదారి విస్తరణ పనులకు పర్యావరణ, అటవీశాఖ అనుమతులు లభించాయి. దీంతో ఎనిమిదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ ప్రాజెక్టుకు మార్గం సుగమమైంది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి పరిహారంపై కేంద్రానికి ప్రతిపాదనలు వెళ్లగా.. త్వరలోనే పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ఈ జాతీయ రహదారిని నాలుగు వరుసలుగా విస్తరించనున్నారు. ఇది ఆర్మూర్, బాల్కొండ, కోరుట్ల, జగిత్యాల, ధర్మపురి నియోజకవర్గాల మీదుగా మంచిర్యాల వద్దనున్న క్యాతన్‌పల్లి వరకు కొనసాగుతుంది. 2016లో కేంద్ర ప్రభుత్వం భారత్‌మాల పరియోజన ప్రాజెక్ట కింద గ్రీన్ ఫీల్డ్ అలైన్‌మెంట్‌ను ప్రతిపాదించింది. ఇందులో భాగంగా రాయపట్నం గోదావరి వంతెనకు సమాంతరంగా కొత్తపల్లి వద్ద మరో నూతన వారధిని నిర్మించనున్నారు. జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ జనావాసాలకు దూరంగా.. కొండలు, గుట్టలు, ప్రభుత్వ భూముల గుండా సాధ్యమైనంత తక్కువ భూసేకరణతో ఈ విస్తరణ పనులు చేపట్టాలని ప్రణాళికలు రూపొందించింది. గత ఏడాది అక్టోబరులో శాటిలైట్ సర్వే నిర్వహించింది. అనంతరం నిజామాబాద్ జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, ఆర్డీవోలు రైతులతో సమావేశమై భూసేకరణ ప్రక్రియను ప్రారంభించారు.జిల్లాలో 30 గ్రామాల్లోని 240 మంది రైతుల నుంచి సుమారు 250 హెక్టార్ల భూమిని సేకరించారు. మెట్‌పల్లి మండలం



బండలింగాపూర్ నుంచి వెల్గటూర్ మండలం స్తంభంపల్లి వరకు భూసేకరణ దాదాపు పూర్తయింది. భూములు కోల్పోతున్న రైతులు, భూముల వివరాలతో పాటు తుది అవార్డుల ప్రకటన చేయాల్సి ఉంది. దీంతో ఆయా రైతుల బ్యాంకు ఖాతాల్లో నష్ట పరిహారం జమ కానుంది. గత నెలలో ధర్మపురి మండలంలో కొందరు రైతులు తమ వ్యవసాయ బావులు నమోదు కాలేదని కలెక్టరుకు ఫిర్యాదు చేయగా.. రెవెన్యూ సిబ్బంది సర్వే చేసి వాటిని నమోదు చేశారు. ఈ రహదారి నిర్మాణం పట్టణాలను తాకకుండా బైపాస్‌లతోనే ముందుకు సాగనుంది. ఆర్మూర్ నుంచి మంచిర్యాల వరకు జగిత్యాల మీదుగా నిర్మించే ఈ రహదారికి కేంద్రం రూ. 2,529 కోట్లు కేటాయించింది. మొత్తం 125 కి.మీ పొడవునా గ్రీన్ ఫీల్డ్ రోడ్డును నిర్మించనున్నారు. త్వరలోనే తుది అవార్డును ప్రకటించి.. టెండర్లు పిలిచేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఈ రహదారి పూర్తయితే నిజామాబాద్ నుంచి మంచిర్యాల వరకు ప్రయాణ సమయం గణనీయంగా తగ్గుతుంది, ఇది ఆయా ప్రాంతాల ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని అంచనా వేస్తున్నారు.

# ఇక ఖాళీ స్థలాలకు ట్యాక్స్

హైదరాబాద్, జూన్ 4,: టర్ హైదరాబాద్ పరిధిలో మీకు ఓపెన్ ప్లాట్ ఉందా..? అయితే మీకో షాకింగ్ న్యూస్. మీరు ఖాళీ స్థలానికి ట్యాక్స్ కట్టాల్సిందే. ఈ మేరకు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కార్యాలయం కీలక ఆదేశాలు జారీ చేసింది. నగరంలోని ఖాళీ స్థలాల యజమానులకు పన్ను చెల్లించాలని సూచించారు. ఈ మేరకు రిజిస్ట్రేషన్ల శాఖ నుండిచిపొందిన వివరాల ఆధారంగా.. వేకెంట్ ల్యాండ్ టాక్స్ బకాయిల వివరాలను అన్ని జోన్లు, సర్కిళ్లు, డివిజన్లకు అందించింది.ఈ బకాయిలను వసూలు చేయడానికి జోనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లకు ఆదేశాలు జారీ చేశారు. కింది స్థాయిలోని బిల్ కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లకు లక్ష్యం టార్గెట్లను నిర్దేశించి, రోజువారీ పురోగతిని పర్యవేక్షించాలని చెప్పారుఇక జీహెచ్‌ఎంసీ కమిషనర్ ట్రేడ్ లైసెన్సుల జారీ అధికారాన్ని ఇటీవల సర్కిల్ డిప్యూటీ కమిషనర్లకు బదిలీ చేశారు. గతంలో ఈ అధికారం గ్రేటర్ పరిధిలోని సహాయ వైద్యాధికారులు, పశు వైద్యాధికారుల వద్ద ఉండేది. అవకతవకలు, జవాబుదారీతనం లోపం వంటి సమస్యలను నివారించడానికి ఈ నిర్ణయం తీసుకున్నారు. పన్ను వసూళ్ల బాధ్యత కూడా డిప్యూటీ కమిషనర్లదేనని జీహెచ్‌ఎంసీ కేంద్ర కార్యాలయం తాజా ప్రకటనలో స్పష్టం చేసింది.జీహెచ్‌ఎంసీ ఆస్తి పన్ను వసూళ్లలో గణనీయమైన పురోగతి సాధిస్తోంది. గత ఆర్థిక సంవత్సరం 2024-25లో జీహెచ్‌ఎంసీ రూ. 2,038 కోట్లకు పైగా ఆస్తి పన్నును వసూలు చేసి చరిత్ర సృష్టించింది. ఇది జీహెచ్‌ఎంసీ చరిత్రలోనే అత్యధిక వసూలు. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది రూ. 121 కోట్లకు పైగా ఎక్కువ. 2025-26 ఆర్థిక సంవత్సరానికి జీహెచ్‌ఎంసీ రూ. 3,000 కోట్ల ఆస్తి పన్ను వసూలును లక్ష్యంగా పెట్టుకుంది. పౌరులు తమ ఆస్తి పన్నును జీహెచ్‌ఎంసీ వెబ్‌సైట్, మీసేవ కేంద్రాలు, లేదా నిర్దేశిత బ్యాంక్ శాఖల ద్వారా చెల్లించవచ్చు. సకాలంలో పన్ను చెల్లించకపోతే నెలకు 2శాతం వడ్డీ వర్తిస్తుందని జీహెచ్‌ఎంసీ అధికారులు తెలిపారు. పన్ను వడ్డీ భారం తప్పాలంటే బాధ్యతగా ట్యాక్స్ చెల్లించాలని సూచిస్తున్నారు.

# అమల్లోకి స్లాట్ బుకింగ్ విధానం

హైదరాబాద్, జూన్ 4,: రిజిస్ట్రేషన్ల వ్యవస్థలో తెలంగాణ ప్రభుత్వం? స్లాట్ బుకింగ్ విధానం తీసుకువచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పటికే 47 చోట్ల విజయవంతంగా అమలు కావటంతో... రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని కార్యాలయాల్లోనూ ఇదే విధానాన్ని అమలు చేయనుంది. ఈ విధానం అమల్లోకి రానుంది. ఇందుకోసం ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది.ఈ సరికొత్త విధానంపై రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమీక్షించారు. రాష్ట్ర వ్యాప్తంగా స్లాట్ బుకింగ్ తీసుకువస్తున్న నేపథ్యంలో ఎలాంటి సాంకేతిక సమస్యలు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.స్లాట్ బుకింగ్ విధానంతో సత్ఫలితాలు వచ్చాయని మంత్రి పొంగులేటి చెప్పారు. పైలెట్ ప్రాజెక్ట్ గా అమలు చేసిన చోట్ల? ఆస్తుల క్రయ విక్రయదారులకు సమయం ఆదా అయిందని? పారదర్శకంగా మెరుగైన సేవలు అందాయని చెప్పారు. 94 శాతం ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారని వివరించారు.ప్రయోగాత్మకంగా మొదటి దశలో ఏప్రిల్ 10వ తేదీన 22 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానాన్ని ప్రవేశపెట్టారు. ఇక్కడ మంచి ఫలితాలు రావడంతో మే 12వ తేదీ నుంచి 25 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలు చేశారు. ఈ రెండు విడతలు కలిపి 47 చోట్ల అమలు చేసిన విధానం విజయవంతమైందని మంత్రి పొంగులేటి వివరించారు. ఈ రెండు విడతల్లో కలిపి మొత్తం 45,191 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ జరిగాయన్నారు. గత పద్ధతితో పోల్చితే?. స్లాట్ బుకింగ్ వల్ల మూడు వేల డాక్యుమెంట్లు ఎక్కువగా రిజిస్ట్రేషన్ జరిగాయని పేర్కొన్నారు.అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలలో స్లాట్ బుకింగ్ విధానంతో పాటు కృత్రిమ మేధ( ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ -ఎఐ) అనుసంధానంతో కూడిన చాట్‌బాట్ అందుబాటులో ఉంటుంది. ఇందుకోసం 82476 23578 వాట్సాప్ నెంబర్ ను అందుబాటులోకి తీసుకువచ్చారు.ఈ నూతన ప్రక్రియ వల్ల రిజిస్ట్రేషన్ చేసుకునే వారికి కలిగే సందేహాలు నివృత్తి అవుతాయి. అంతేగాకుండా రిజిస్ట్రేషన్ ఆఫీస్ లొకేషన్, స్లాట్ బుకింగ్ ఖాళీల వివరాలు, సమయం అందుబాటు వంటి సమాచారం లభిస్తుంది. గిఫ్ట్ డీడ్, సేల్ డీడ్ పై రిజిస్ట్రేషన్ ఛార్జీలు మార్కెట్ ధరలు తదితర అన్ని అంశాలపై ఈ? ఏఐ చాట్‌బాట్ - మేథ ద్వారా సమాచారం తెలుసుకోవచ్చు.త్వరలో డెవలపర్ రిజిస్ట్రేషన్ మాడ్యూల్ ను తీసుకువస్తామని మంత్రి పొంగులేటి తాజాగా ప్రకటించారు. డబుల్ రిజిస్ట్రేషన్ జరగకుండా, రిజిస్ట్రేషన్ పూర్తయిన వాటి వివరాలు, పూర్తి కాని వాటి వివరాలు ఇందులో అందుబాటులో ఉంచుతామన్నారు. ఈ మాడ్యూల్ లో రిజిస్ట్రేషన్ అయిన ప్లాట్ల వివరాలు రెడ్ కలర్ లో కనిపిస్తాయని వివరించారు.ఉదయం 10.30 గంటల నుంచి లంచ్ సమయాన్ని మినహాయించి సాయింత్రం 5 గంటల వరకూ స్లాట్ బుక్ చేసుకోవచ్చు. ప్రతి కార్యాలయంలో రోజుకు 48 స్లాట్‌లు బుక్ అవుతాయి. స్లాట్ బుకింగ్ చేసుకోని వారి కోసం ఏదైనా అత్యవసర సందర్భాలలో సాయంత్రం 5 నుంచి 5.30 గంటల వరకు ఐదు వాకిన్ రిజిస్ట్రేషన్లకు అనుమతి ఇవ్వడం జరుగుతుంది. బుకింగ్‌తోపాటు రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేయడంలో భాగంగా ఆధార్-ఈ సంతకం ప్రవేశపెడుతున్నారు. ముందుగా నిజామాబాద్ జిల్లా ఆర్మూర్, ఖమ్మం జిల్లా కూసుమంచి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రయోగాత్మక అమలుచేస్తున్నారు. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తారు.

# మారుతున్న విద్యావిధానం




హైదరాబాద్, జూన్ 4,: పాఠ్యపుస్తకంలో ఉన్నది ఉన్న ట్లుగా బోధించే మూసపద్ధతి బోధనకు ఉపాధ్యాయులు స్వస్తి పలుకనున్నారు. వినూత్న పద్ధతుల్లో ఇకనుంచి విద్యార్థులకు బోధించనున్నారు. ఈ విద్యాసంవత్సరం నుంచి బోధనా పద్ధతుల్లో విద్యా శాఖ మార్పులు తీసుకురానుంది. అందుకు ఉపాధ్యాయులను సంసిద్ధం చేసింది. గతంలో కంటే పూర్తి భిన్నంగా తరగతి గదుల్లో విద్యార్థులకు బోధించే లా ఇటీవల టీచర్లకు ఉన్నతాధికారులు శిక్షణ ఇచ్చారు.పుస్తకంలోని పాఠాన్ని ఏదో మొక్కుబడిగా చెప్పేశామని కాకుండా ఉపాధ్యాయులు సరికొత్త పద్ధతులను అమలుచేయాలని ఆదేశించారు. వీలైతే ఆటాపాటలతో బోధించాలని సూచించారు. పిల్లవాడిని ఆకర్షించేలా, సులువుగా అర్థమయ్యేలా బోధనా పద్ధతులను అవలంబించాలని పేర్కొన్నారు. ఆక్టివిటీస్ బేస్‌గా విద్యాబోధన ద్వారా విద్యార్థులకు సులువుగా అర్థమవ్వడమే కాకుండా ఎక్కువ కాలం గుర్తుండి పోతుంది.ఇందుకు టీచర్ పాఠాలు చెప్పేటప్పుడు విద్యార్థులను ఇన్‌వాల్వ్ చేయాలని అధికారులు సూచించారు. కేవలం బ్లాక్‌బోర్డుపై సుద్దముక్కతో పాఠాలు చెప్పకుండా అవసరమైన చోట బోధనోపకరణాలను ఉపయోగించి విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధనా పద్ధతులను అమలుచేసేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ విద్యా సంవత్సరం ప్రభుత్వ పాఠశాలల్లో బోధనా పద్ధతులు, ఎన్‌రోల్‌మెంట్‌పై విద్యాశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. విడతల వారీగా ఉపాధ్యాయులు, ఎంఈవోలకు శిక్షణ ఇస్తోంది. ఇప్పటికే ఉపాధ్యా యుల శిక్షణ పూర్తి కాగా, ప్రస్తుతం ఎంఈవోల శిక్షణ కొనసాగుతోంది. త్వరలో ప్రతీజిల్లా నుంచి బెస్ట్ ప్రాక్టీసెస్ టీచర్లను ముగ్గు రి చొప్పున ఎంపిక చేసి సదస్సును నిర్వహించనున్నారు.

ప్రభుత్వ బడుల్లో తగ్గుతున్న ఎన్‌రోల్‌మెంట్..: ఒకవైపు తల్లిదండ్రులకు ప్రభుత్వ బడులపై నమ్మకం సన్నగిల్లడం, మరోవైపు ప్రైవేట్ బడులు ఆకర్షిస్తుండటంతో సర్కారు బడుల్లో ఎన్‌రోల్‌మెంట్ ప్రతిఏటా పడిపోతోంది. చదువుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారీగా నిధులు ఖర్చుచేస్తున్నా ఎన్‌రోల్‌మెంట్ పడిపోతుండటంతో ప్రభు త్వ స్కూళ్ల మనుగడ ఆందోళన కలిగిస్తోంది. రాష్ట్రంలో 42,900బడులుంటే అందులో 30,022 (70 శాతం) ప్రభుత్వ పాఠశాలలున్నాయి. వీటిలో ఎన్‌రోల్‌మెంట్ కేవలం 27.8లక్షలు (38.11 శాతం విద్యార్థులు) మాత్రమే ఉన్నారు. ఇక ప్రైవేట్ స్కూళ్లు 12,125 (28.26 శాతం) ఉండగా, వీటిలో మాత్రం 44.31లక్షలు (60.75 శాతం) మంది విద్యార్థులున్నారు. గత ఆరేళ్లుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు సంఖ్య క్రమంగా తగ్గుతుంటే..ప్రైవేట్ స్కూళ్ల లో పెరుగుతోంది. దీంతో కేంద్రం నుంచి రావాల్సిన నిధులకు కోత పడుతోంది. సమగ్రశిక్ష ప్రాజెక్టు కింద రాష్ట్రాలకు కేంద్రం నిధులిస్తోంది. అయితే వీటిని సకాలంలో వివిధ కార్యక్రమాలకు ఖర్చుచేయాల్సి ఉం టుంది. వాటిని ఖర్చు చేయకుంటే నిధుల్లో కేంద్రం కోత విధిస్తుంది. 2025 విద్యాసంవత్సరం నుంచి ప్రత్యే క కార్యాచరణ తీసుకున్న విద్యాశాఖ అటు ప్రభుత్వ బడుల్లో ఎన్‌రోల్‌మెంట్ పెంచేందుకు, వినూత్న పద్ధతుల్లో బోధించేందుకు ప్రణాళికలు రచించింది. జూన్ 6 నుంచి 19 వరకు బడిబాట కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ఉపాధ్యాయులు, అధికారులు, అమ్మ ఆదర్శపాఠశాలల కమిటీలు, స్థానిక ప్రజాప్రతినిధులు ఇందులో పాల్గొని బడీడు పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించనున్నారు.ప్రతీ బడిలో ఎన్‌రోల్‌మెంట్ సంఖ్య పెంచేలా ఉపాధ్యాయులు, ఎంఈవోలు కృషిచేయాలని ఆదేశించారు. అంతేకాకుండా ఈ విద్యాసంవత్సరం నుంచి జిల్లాకు 30 చొప్పున ప్రీప్రైమరీ తరగతులు సైతం ప్రారంభించాలని విద్యాశాఖ ఇప్పటికే భావించింది. అయితే వీటికి సంబంధించిన ఉత్వర్వులు జారీ కావాల్సి ఉంది.

# సికింద్రాబాద్ కు సమ్మర్ ట్రైన్స్

హైదరాబాద్, జూన్ 4: వేసవి సెలవుల చివరి దశకు చేరాయి. ఈ నేపథ్యంలో స్వస్థలాలకు వెళ్లిన ప్రజలు తిరిగి నగరాలకు పయనమవుతుండటంతో రైల్వే స్టేషన్లలో రద్దీ గణనీయంగా పెరిగింది. ప్రయాణికుల అసౌకర్యాన్ని తగ్గించేందుకు దక్షిణ మధ్య రైల్వే కీలక నిర్ణయాలు తీసుకుంది. ఈ రద్దీని దృష్టిలో ఉంచుకొని.. అనేక ప్రాంతాలకు ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు అధికారులు ప్రకటించారు. జూన్‌లో 150 ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. దక్షిణ మధ్య రైల్వే ప్రకటించిన వివరాల ప్రకారం.. దీనిలో సికింద్రాబాద్ - కాకినాడ టౌన్ మధ్య మొత్తం 16 ప్రత్యేక రైళ్లను అందుబాటులోకి తెచ్చారు. ఈ రైళ్లు రెండు నెలల పాటు నడపబడతాయి.సికింద్రాబాద్ నుంచి కాకినాడ టౌన్‌కు వెళ్లే ప్రత్యేక రైలు (నంబర్ 07041) ప్రతి గురువారం రాత్రి 10:40 గంటలకు బయలుదేరి.. మరుసటి రోజు శుక్రవారం ఉదయం 10:45 గంటలకు కాకినాడ టౌన్ చేరుకుంటుంది. ఈ రైలు జూన్ 12, జూన్ 19, జూన్ 26వ తేదీల్లో నడుస్తుంది. మళ్లీ జులై నెలలో.. జూలై 3, జులై 10, జులై 17, జులై 24, జులై 30 తేదీలలో సేవలు అందిస్తుంది.కాకినాడ టౌన్ నుంచి సికింద్రాబాద్‌కు వెళ్లే ప్రత్యేక రైలు ప్రతి శుక్రవారం ఉదయం 6:55 గంటలకు బయలుదేరి.. శనివారం ఉదయం 07:00 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. ఈ రైలు జూన్ 13 నుంచి ప్రతీ శుక్రవారం బయలుదేరుతుంది. ఆగస్టు1న చివరి ట్రిప్ వేయనుంది. ఈ ప్రత్యేక రైళ్లు నల్లగొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లె, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట వంటి ప్రధాన స్టేషన్లలో ఆగుతాయి. ఈ రైళ్లలో ఫస్ట్ ఏసీ, సెకండ్ ఏసీ, థర్డ్ ఏసీ కోచ్‌లతో పాటు ఇతర తరగతుల బోగీలు కూడా అందుబాటులో ఉంటాయిప్రస్తుతం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. చాలా వరకు ట్రైన్లను చర్లపల్లి టెర్మినల్‌కు మార్చారు. అయితే ఈ కాకినాడ టౌన్ ప్రత్యేక రైలును మాత్రం సికింద్రాబాద్ నుంచి



బయలుదేరుతుందని అధికారులు తెలిపారు.

చర్లపల్లి స్టేషన్ నుంచి మరికొన్ని ట్రైన్స్..: హైదరాబాద్ నగరానికి నాలుగవ అతి పెద్ద రైల్వే టెర్మినల్‌గా చర్లపల్లి అభివృద్ధి చేయబడింది. సికింద్రాబాద్, కాచిగూడ, నాంపల్లి స్టేషన్లలో రద్దీని తగ్గించడానికి, చర్లపల్లి నుంచి రైళ్లు నడపడం ప్రయాణికులకు, ముఖ్యంగా నగర తూర్పు ప్రాంత ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది. ఇక్కడ నుంచి కూడా ప్రత్యేక ట్రైన్స్ జన్ 6వ తేదీ నుంచి అందుబాటులోకి రానున్నాయి. విశాఖపట్నం టు చర్లపల్లి మార్గంలో ఎనిమిది రైళ్లు జూన్ 6 (శుక్రవారం) నుండి జూలై 25 వరకు సేవలందిస్తాయి. చర్లపల్లి టు విశాఖపట్నం రైలు తిరుగు ప్రయాణంలో ఎనిమిది రైళ్లు జూన్ 7 నుండి జూలై 26 వరకు అందుబాటులో ఉండనున్నాయి.విశాఖ-చర్లపల్లి మధ్య ప్రత్యేక రైళు ... రైల్వే ప్రచారం లేక ఖాళీగానే ప్రయాణంఈ ప్రత్యేక రైళ్లు ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాలకు వెళ్లే ప్రయాణికులకు అందుబాటులో ఉంటాయి. ఇప్పటికే విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, కామారెడ్డి సహా పలు ప్రాంతాలకు ప్రత్యేక రైళ్లు నడుస్తున్నాయి. ప్రయాణికులు తమ ప్రయాణ ప్రణాళికలకు అనుగుణంగా ఈ రైళ్లను ఉపయోగించుకుని, ఎటువంటి ఇబ్బందులు లేకుండా సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవచ్చునని రైల్వే అధికారులు సూచించారు. టికెట్ బుకింగ్ కోసం రైల్వే వెబ్‌సైట్‌ను లేదా రైల్వే యాప్‌లను ఉపయోగించుకోవచ్చు.

## పోస్టర్ను ఆవిష్కరించిన మంత్రి శ్రీధర్ బాబు

కమాన్ పూర్ జూన్ 4: జూన్ 15 తారీఖున కరీంనగర్ కళాభారతిలో జరగబోయే పాటల పల్లకిలో 12 గంటలు కార్యక్రమానికి రాష్ట్ర ఐటీ శాఖామాత్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు చేతుల మీదుగా పోస్టర్ ఆవిష్కరణ చేయడం జరిగింది ఈ పాటల పల్లకి కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున కవులు, కళాకారులు పాల్గొననున్నారు. కరీంనగర్ కలెక్టరేట్ నుండి కళాభారతి వరకు తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలు ఉట్టిపడేలా బతుకమ్మలు కోలాటం ఒగ్గుడోలు,బోనాలు, డప్పులు అనేక కళారూపాలతో భారీ ఎత్తున ర్యాలీ ఉంటుందని ప్రముఖ కవి గాయకులు నేర్నాల కిషోర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి సాంస్కృతిక సేన రాష్ట్ర అధ్యక్షులు చక్రాల రఘు,



వరంగల్ రవి,గ్యార యాకన్న, గడ్డమీది సంపత్ పొన్నాల విష్ణు, పెద్దపల్లి జిల్లా మాజీ గ్రంథాలయ డైరెక్టర్ ఇజ్జగిరీ రాజు లడ్డు,బాలు,నమిండ్ల అక్షయ్ తదితరులు పాల్గొన్నారు.

# ముప్పు కాదు కానీ, అప్రమత్తత అవసరం!

## భూభారతి చట్టంతో ప్రతి రైతుకు న్యాయం

### అదనపు కలెక్టర్ వేణు.



కమాన్ పూర్ జూన్ 4: భూభారతి చట్టంతో ప్రతి రైతుకు న్యాయం జరుగుతుందని పెద్దపల్లి జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ వేణు అన్నారు. బుధవారం కమాన్ పూర్ మండలంలోని లింగాల గ్రామంలో భూభారతి సదస్సు తహసిల్దార్ ముస్త్యాల వాసంతి ఆధ్వర్యంలో నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన భూ భారతి చట్టంలో భూమి యజమానికి అప్పీలు చేసుకునేందుకు కొత్తగా అప్పీలు వ్యవస్థను ఏర్పాటు చేసింది. తహసీల్దార్లు జారీచేసే పాసు పుస్తకాల్లో లేదా భూ మి పై ప్రజలెవరికైనా అభ్యంతరాలుంటే రెవెన్యూ డివిజనల్ అధికారి(అర్డీఓ)కి అప్పీలు చేసుకునేందుకు భూ భారతి చట్టంలో సెక్షన్ 15, నిబంధన 14 ద్వారా ప్రభుత్వం అవకాశం కల్పించింది అని పేర్కొన్నారు.%ళి5రి% రెవెన్యూ డివిజనల్ అధికారి(ఆర్డీఓ) ఇచ్చిన తీర్పుపై అభ్యంతరాలుంటే జిల్లా కలెక్టర్ లకు రెండో దశలో అప్పీలు చేసుకోనేందుకు అవకాశం కల్పించింది అని ఆర్డిఓ అన్నారు. రెవెన్యూ డివిజనల్ అధికారి ఆర్డీఓ చేసిన మ్యుటేషన్లపై లేదా రెవెన్యూ డివిజనల్ అధికారిఆర్డీఓ చేసిన సాదా బైనామాల క్రమబద్ధీ కరణ పై ఎవరికైనా అభ్యంతరాలుంటే జిల్లా కలెక్టర్ లకు అప్పీలు చేసుకోవచ్చని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఇచ్చే తీర్పుపై అభ్యంతరాలంటే భూమి ట్రైబ్యునల్లో కూడా అప్పీలు చేసుకోనేందుకు అవకాశం కల్పించింది అన్నారు. భూమి యజమాని రూ.300 రుసుం చెల్లించి దరఖాస్తు చేస్తే పట్టాదారు పాసుపుస్తకు జారీ చేస్తారు అన్నారు. భూమి యజమాని లైసెన్స్ డ్ సర్వేయర్ సర్వే చేయించుకొని పటం తయారు చేయించుకోవాలి పేర్కొన్నారు. మండల సర్వేయర్ దాన్ని సరిచూసిన తర్వాత పట్టాదారు పాసు పుస్తకాలులో పటాన్ని నమోదు చేస్తారు స్పష్టం చేశారు. సాదా బైనామాల క్రమబద్ధీకరణకు ధరణి చట్టంలో ఎలాంటి నిబంధన లేదు. దీనివల్ల వాటి హైకోర్టు స్టే విధించింది అన్నారు. ఈ సదస్సులో కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు వైనాల రాజు మాజీ సర్పంచ్ సాగి శ్రీధర్ రావు నాయకులు సాగి శ్రీనివాసరావు గడ్డం శ్రీనివాస్, ఆర్ ఐ స్రవంతి,సీనియర్ అసిస్టెంట్ సతీష్, ఏ ఎస్ ఐ ఖ లీల్ ఖాన్, జూనియర్ అసిస్టెంట్లు గోస్కుల రజిత, శ్రీనివాస్ , రంజిత్ రాజేందర్ రికార్డు అసిస్టెంట్ శ్రీనివాస్ కట్ట కుమార్ ధరణి ఆపరేటర్ ప్రదీప్ మీసేవ ఆపరేటర్ తోట రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రపంచవ్యాప్తంగానూ మన దేశంలోనూ మరోసారి కోవిడ్ భయం వెన్నాడుతోంది. కరోనా వైరస్ కేసులు పెరుగుతుండటం, మరణాలు సంభవిస్తుండటం కాస్త ఆందోళన కల్గించే విషయమే. మన రాష్ట్రంలో కూడా ఈ కేసులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. రాష్ట్ర కుటుంబ సంక్షేమ విభాగం ద్వారా అనునిత్యం ప్రజానీకాన్ని అప్రమత్తం చేసే కృషి జరుగుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సైతం ప్రత్యేక అలర్ట్ ప్రకటించటంతోపాటుగా కొన్ని సూచనలు చేశాయి. వాటిని తప్పక పాటించాలని కోరుతున్నాయి. ఎక్కడైనా ప్రాంతంలో కరోనా కేసులు నమోదైతే ముఖ్యంగా ఎవ్వరూ ఇళ్లలో నుంచి బయటకు రాకూడదు. ఎక్కువమంది హాజరయ్యే కార్యక్రమాలు నిర్వహించొద్దని సూచించింది. రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, విమానాశ్రయాల్లో మాస్ట్ తప్పనిసరిగా ధరించాలని సూచించింది. వృద్ధులు, గర్భిణీలు అత్యవసరమైతే తప్ప ఇంటి నుంచి బయటకు రావొద్దని సూచిస్తున్నాయి. విదేశాల నుంచి వచ్చిన వారికి కోవిడ్ పరీక్షలు చేయించేలా అధికార యంత్రాంగం కృషి చేస్తోంది. ప్రభుత్వాసుపత్రుల్లో మాస్కులు, పీపీఈ కిట్లు అందుబాటులో ఉంచేలా వైద్యాధికారులకు ప్రభుత్వం సూచించింది. ఇంటి నుంచి బయటకు వచ్చేటప్పుడు మాస్క్ ధరించడం, శానిటైజర్ వాడటం అలవర్చుకోవాలని స్పష్టం చేసింది. ప్రపంచవ్యాప్త ఆరోగ్య సంక్షోభంగా మారి ప్రపంచాన్ని అతలాకుతలం చేసిన కరోనా వైరస్ (సార్స్-కోవిడ్-2) విధ్వంసక, మరణాంతక దశ ముగిసింది. ఇప్పుడు ఈ వైరస్ మన జనాభాలో భాగంగా స్థిరపడి, ఒక ఎండెమిక్ వ్యాధిగా మారింది. అంటే ఫ్లూ వంటి ఇతర శ్వాసకోశ వైరస్‌ల మాదిరిగా ఇది మన మధ్య నిరంతరం వ్యాపిస్తూనే ఉంటుంది. లాక్‌డౌన్ వంటి కఠినమైన ఆంక్షల కాలం ముగిసినప్పటికీ, ఈ వైరస్‌తో కలిగే ప్రమాదం పూర్తిగా తొలగిపోలేదు. ముఖ్యంగా వృద్ధులు, ఇతర దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు ఉన్నవారు కరోనా పట్ల అత్యంత జాగరూకతతో ఉండటం చాలా ముఖ్యం.

ఒమిక్రాన్ రాక, జెఎన్ 1 పరిణామం: 2021లో డెల్టా వేరియంట్ సృష్టించిన తీవ్రమైన పీడ మనందరికీ తెలిసిందే. అయితే, ఆ తర్వాత వచ్చిన 'ఒమిక్రాన్' వేరియంట్ కరోనా స్వభావాన్నే మార్చివేసింది. ఇది అధిక వ్యాప్తి శక్తిని కలిగి ఉన్నప్పటికీ, తీవ్రమైన జబ్బును కలిగించే శక్తిని చాలా వరకు కోల్పోయింది.

ఈ ఒమిక్రాన్ కుటుంబం నుండే కాలక్రమేణా మరెన్నో ఉప రకాలు ఉద్భవించాయి. దీనికి తాజా ఉదాహరణే జెఎన్.1 వేరియంట్. ఇది ఒమిక్రాన్ బిఎ 2.86 సబ్-వేరియంట్ నుండి ఉద్భవించింది. దీని వ్యాప్తివేగాన్ని గమనించిన ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఒ), 2023 డిసెంబర్‌లో దీనిని 'వేరియంట్ ఆఫ్ ఇంట్రెస్ట్' (విఒఐ) గా వర్గీకరించింది. అంటే, దీనిపై ప్రత్యేక నిఘా అవసరమని అర్థం. అయినప్పటికీ, జెఎన్.1 కూడా వ్యాధి తీవ్రతను పెంచినట్లు ఆధారాలు లేనందున, ఇది మరింత ప్రమాదకరమైన 'వేరియంట్ ఆఫ్ కన్సర్న్' (విఒసి) కేటగిరీకి మారలేదు. ప్రస్తుతం (2025 మధ్య నాటికి) ప్రపంచవ్యాప్తంగా వ్యాప్తిలో ఉన్న అత్యధిక వేరియంట్లు జెఎన్.1కు చెందిన ఉప-రకాలే. ఉదాహరణకు, ఇటీవల ప్రాబల్యంలో ఉన్న కెపి 2, కెపి 3 వంటి 'ఫ్లిర్ట్' వేరియంట్లు కూడా ఈ జెఎన్.1 కుటుంబానికి చెందినవే. ఈ పరిణామాలన్నీ, వైరస్ నిరంతరం తన స్వరూపాన్ని మార్చుకుంటూనే ఉంటుందని, అందుకే మన అప్రమత్తతలో ఏమాత్రం అలసత్వం పనికిరాదని స్పష్టం చేస్తున్నాయి. ఇతర శ్వాసకోశ వైరస్‌ల కుటుంబంలో చేరిన కరోనా: ప్రతి ఏటా కాలానుగుణంగా మనపై దాడి చేసే శ్వాసకోశ వైరస్‌లు చాలా ఉన్నాయి. వీటిలో ముఖ్యమైనవి ఇన్ఫ్లుయెంజా వైరస్ (ఫ్లూ), రెస్పిరేటరీ సిన్సిషియల్ వైరస్ (ఆర్ఎస్‌వి), రైనోవైరస్ (సాధారణ జలుబు) మొదలైనవి. ఇప్పుడు సార్స్-కోవిడ్-2కూడా ఈజాబితాలో శాశ్వతంగా చేరిపోయింది. ఈ వైరస్‌లన్నీ దాదాపు ఒకే రకమైన ఫ్లూ లక్షణాలను (జలుబు, దగ్గు, గొంతు నొప్పి, జ్వరం, ఒళ్లు నొప్పులు) కల్గిస్తాయి. ఎవరికి ఇబ్బందికరం?: కరోనా లేదా ఇతర శ్వాసకోశ వైరస్‌లతో కలిగే ఇన్‌ఫెక్షన్లు సాధారణఆరోగ్యవంతుల్లో కొన్నిరోజుల్లో తగ్గిపో యినా, మరికొందరికి తీవ్రంగా పరిణమించే అవకాశం ఉంది. వృద్ధులు(60ఏళ్లు పైబడినవారు) దీర్ఘకాలికవ్యాధిగ్రస్తులు మధుమేహం, రక్తపోటు, గుండె, కిడ్నీ, లివర్, ఊపిరితిత్తుల వ్యాధులు ఉన్నవారు.

రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు క్యాన్సర్ చికిత్స తీసుకుంటున్న వారు, అవయవ మార్పిడి చేయించుకున్నవారు, హెచ్ఐవి వంటి సమస్యలతో బాధపడుతున్నవారు. గర్భిణీ స్త్రీలు. ఇలాంటి వారిలో వైరస్ సులభంగా న్యుమోనియాకు దారితీయొచ్చు. ఆసుపత్రిలో చేరాల్సిన పరిస్థితి రావొచ్చు. లేదా ప్రాణాంతకం కావొచ్చు. కరోనా మనతోనే ఉన్నందున, దానితో కలిసి జీవిస్తూ మనల్ని మనం రక్షించుకోవాలి.

మాస్క్ ధరించడం: రద్దీగా ఉండే ప్రదేశాలు, ఆసుపత్రులు, ప్రజా రవాణా వ్యవస్థల్లో మాస్ట్ ధరించడం అత్యంత సురక్షితమైన పద్ధతి. శుభ్రత: ఇంటి నుండి బయటకు వెళ్లినప్పుడు చేతులను సబ్బుతో కడుక్కోవడం లేదా శానిటైజర్ వాడటం అలవాటు చేసుకోవాలి. టీకాలు: ప్రభుత్వం సూచించిన కరోనా వ్యాక్సిన్లు, బూస్టర్ డోసులు తప్పనిసరిగా తీసుకోవాలి. ఇవి ఇన్‌ఫెక్షన్ తీవ్రతను, ఆసుపత్రిలో చేరే అవసరాన్నిగణనీయంగాతగ్గిస్తాయి. ప్రస్తుతం కరోనాటీకాలపై ప్రభు త్వం నుంచినిర్దిష్టమైన కొత్త సూచనలు లేనప్పటికీ, భవిష్యత్తులో వచ్చే అప్‌డేట్‌లనుగమనిస్తూ,వైద్యులసలహా మేరకునడుచుకోవడం ముఖ్యం. లక్షణాలు కనిపిస్తే: జ్వరం, దగ్గు వంటి లక్షణాలు కనిపిస్తే, వెంటనే వైద్యుడిని సంప్రదించి, అవసరమైతే పరీక్ష చేయించుకోవాలి. ముఖ్యం గా ఆరోగ్య ప్రమాదంలో ఉన్న రోగుల పట్ల అశ్రద్ధ చేయకూడదు.

ముగింపు: కరోనా వైరస్ మన జీవితంలో ఒక భాగమైంది. ఇది ఇప్పుడు నిర్లక్ష్యం చేయదగిన సాధారణ జలుబు కాదు, అలాగని అనవసరంగా భయపడాల్సిన తీవ్రమైన ఆరోగ్య ముప్పు కాదు. ఇది ఒక నిరంతర ఆరోగ్య సవాలు. వ్యక్తిగత బాధ్యతతో, సరైన జాగ్రత్తలు తీసుకుంటూ, మన సమాజంలోని బలహీన వర్గాలను రక్షించుకోవడం మనందరి సమష్టి బాధ్యత. అప్రమత్తతే మనకు రక్షణ కవచం.

# నాగబాబుకు అడగడుగునా అడ్డంకులు



విజయవాడ, జూన్ 4,: జనసేన ఎమ్మెల్సీ నాగబాబుకు మంత్రి పదవి విషయంలో పవన్ కల్యాణ్ పునరాలోచనలో పడినట్లు కనపిస్తుంది. నాగబాబుకు మంత్రి పదవి ఇవ్వడం వల్ల అనేక సమస్యలు తలెత్తే అవకాశముందని భావిస్తున్నారు. ప్రస్తుతం చంద్రబాబు నాయుడు కేబినెట్ లో జనసేన నుంచి ముగ్గురు మంత్రులు ఉన్నారు. పవన్ కల్యాణ్, నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్ లు ఉన్నారు. అందులో నాదెండ్ల మనోహర్ మినహాయిస్తే మిగిలిన ఇద్దరు కాపు సామాజికవర్గానికి చెందిన వారు. ?ప్పుడు నాగబాబుకు కూడా పదవి ఇస్తే నలుగురిలో ముగ్గురు కాపు సామాజికవర్గానికి చెందిన వారికి మంత్రి పదవులు ఇచ్చినట్లవుతుంది. అది పార్టీకి కొంత ఇబ్బందిగా మారుతుందన్న అంచనాలు వినిపిస్తున్నాయి. జనసేన అంటే ఒకే సామాజికవర్గానికి చెందిన పార్టీగా ముద్రపడటం ఇష్టంలేని పవన్ కల్యాణ్ నాగబాబు కు మంత్రి పదవి విషయంలో కొంత ఆలోచనలో పడినట్లు తెలిసింది. మరొకవైపు కాపు సామాజికవర్గానికి చెందిన ఇద్దరికి టీడీపీ కూడా మంత్రి పదవులు ఇచ్చింది. పొంగూరు నారాయణ, నిమ్మల రామానాయుడు కూడా కేబినెట్ లో ఉండటంతో ఎక్కువ మంది కాపులకు కేబినెట్ లో అవకాశం ఇచ్చినట్లవుతుందన్న భావన కలుగుతుందని చంద్రబాబు నాయుడు కూడా పవన్ తో చెప్పినట్లు తెలిసింది. చంద్రబాబు కేబినెట్ లో ఒక మంత్రి పదవి ఖాళీగా ఉంది. జూన్ నెలలో ప్రమాణ స్వీకారం చేసినప్పుడు ఒక్క పదవిని ఖాళీగా ఉంచారు. వంగవీటి రాధాను ఎమ్మెల్సీగా ఎంపిక చేయకపోవడానికి కూడా అదే కారణమని అంటున్నారు. ఈ పరిస్థితుల్లో నాగబాబును కేబినెట్ లోకి తీసుకుంటే ఇంకా ఇబ్బందులు ఏర్పడతాయని, ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళతాయని పవన్ కల్యాణ్ భావిస్తున్నట్లు తెలిసింది. పార్టీ కోసం కష్టపడిన నాగబాబుకు ముందు మంత్రివర్గంలో స్థానం కల్పించాలని అనుకున్నప్పటికీ ఇలాంటి డిస్కషన్స్ వల్ల పార్టీకి నష్టం చేకూరుతుందని, జనసేనను ఒక సామాజికవర్గానికి కట్టే ప్రయత్నం తామే చేసుకున్నట్లవుతుందని పవన్ కూడా నిర్ణయానికి వచ్చినట్లు కనపడుతుంది. అందుకే ఎమ్మెల్సీతో సరిపెడుతున్నారు.

ముందుగా నాగబాబును రాజ్యసభకు పంపాలని అనుకున్నా, జనసేన తరుపున లింగమనేనిని పంపాలని నిర్ణయించడంతో నాగబాబును ఎమ్మెల్సీగా ఎంపిక చేశారంటున్నారు. చంద్రబాబు స్ట్రాటజీ ఇది ముందుకు వెళ్లడంపై... ఇప్పటివరకూ అందుతున్న సమాచారాన్ని బట్టి మంత్రి వర్గ విస్తరణ జూన్ 12వ తేదీ న గాని, తర్వాత గాని ఉండకపోవచ్చని టాక్ బాగా వినపడుతుంది. విస్తరణ నాగబాబు కోసమే పెట్టారన్న అభిప్రాయం కూడా ప్రజల్లో కలుగుతుందని, నాగబాబును తాము మంత్రిపదవిలోకి తీసుకుంటే బీసీలతో పాటు మిగిలిన సామాజికవర్గాల్లో కూడా ఆలోచన బయలుదేరి పార్టీని దూరం పెట్టే అవకాశముందని భావించి పవన్ కల్యాణ్ ఆలోచనలో పడినట్లు చెబుతున్నారు. అయితే పవన్ కల్యాణ్ ఒకసారి నిర్ణయం తీసుకున్నారంటే వెనక్కు తగ్గరు. మరి నాగబాబు విషయంలో ఇన్నిసమస్యలు వచ్చి పడతాయని తెలిసినా పవన్ ముందుకు వెళతారా? లేదా? అన్నది మరో పది రోజుల్లో తెలియనుంది.

# పండుగలను అందరు సంతోషంగా మరియు ప్రశాంతంగా జరుపుకోవాలి

## రాబోవు బక్రీద్ సందర్భంగా పీస్ కమిటీ మీటింగ్ నిర్వహణ: డిసీపీ పెద్దపల్లి కర్ణాకర్



గోదావరిఖని :రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు రాబోయే బక్రీద్ సందర్భంగా గోదావరిఖని ఏసీపీ పర్యవేక్షణ లో గోదావరిఖని 1 టౌన్ పోలీస్ స్టేషన్ లో గోదావరిఖని 1 టౌన్, గోదావరిఖని 2 టౌన్ మరియు రామగుండం సర్కిల్ పరిధిలోని ముస్లిం, హిందూ, క్రిస్టియన్ మత పెద్దల తో శాంతి సమావేశం (పీస్ కమిటీ) ఏర్పాటు చేయడం జరిగింది. ఇట్టి సమావేశం కు పెద్దపల్లి డీసీపీ పి. కర్ణాకర్ ముఖ్య అతిథులు గా హాజరై హిందూ, ముస్లిం మత పెద్దలతో మాట్లాడి పోలీసుల తరుపున సూచనలు, సలహాలను తప్పకుండా పాటించాలని డీసీపీ కోరారు. గోదావరిఖని సబ్ డివిజన్ పరిధిలో హిందూ ముస్లిం సోదరులు అన్నదమ్ముల వలె కలిసిమెలిసి ముందుకు వెళుతున్నారని తెలిపారు. ఆయా మతస్తులు పండుగ సందర్భాల్లో అందరు కలిసి కుటుంబ సభ్యులుగా పాల్గొంటున్నట్లు సంతోషం వ్యక్తం చేశారు ఈ సందర్భంగా డిసిపి మాట్లాడుతూ....బక్రీద్ సందర్భంగా పశు వుల రవాణాలను అనుమతి లేకుండా వెటర్నరీ డాక్టర్ సర్టిఫికెట్ లేకుండా ఎటువంటి ఆవుల రవాణా చేయకూడదు. పశువుల కాళేబరాలను, పశువుల వ్యర్థాలను బయట పడేయకుండా మున్సిపాలిటీ వారు ఏర్పాటు చేసే డిస్పోజల్ వాహనాలు, కవర్ లలో మాత్రమే వేయాలి. అనుమతి లేకుండా ప్రజలకి ఇబ్బంది కలిగించే విధంగా బహిరంగ ప్రదేశాలలో పశువుల వధ చేసే వారిపై, మరియు పశువులను అక్రమంగా రవాణా చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కొంతమంది యువత బక్రీద్ సందర్భంగా అతి ఉత్సాహంతో సోషల్ మీడియాలో వదంతులు ప్రచారం చేసి అల్లర్లు గొడవలు పాల్పడే విధంగా కార్యకలాపాలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుంది. పశువుల అక్రమ రవాణా జరిగే అవకాశం ఉండే ప్రాంతాలలో విస్తృతమైన పెట్రోలింగ్ చేయడం జరుగుతుంది అన్నారు. పశువుల అక్రమ రవాణా జరుగుతుందని కొంతమంది చట్టాన్ని ఎవరూ చేతుల్లోకి తీసుకోరాదని, చట్టానికి ఎవరూ అతీతులు కాదని, తమంతట తాముగా వెళ్లి వాహనాలను ఆపడం గాని పరిశీలించడం గాని చేసి అనవసర ఉద్రిక్తతలకు కారణమైన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఏదైనా సమాచారం ఉన్నట్లయితే స్థానిక పోలీస్ అధికారులకు లేదా డయల్ - 100కు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు. మత ఘర్షణల కలిగేలాగా సమస్యలు సృష్టించే వారిపై ప్రత్యేక నిఘా, సోషల్ మీడియాలో మతాలను, కులాలను, ఒకరినొకరు కించపరుస్తూ గాని , లేనిపోని అబద్ధపు పుకార్లను సృష్టించి ఎవరైనా సోషల్ మీడియా లో పోస్టులు పెడితే వారిపై సోషల్ మీడియా మానిటరింగ్ సెల్ నిఘా ఉంటుంది. సోషల్ మీడియా ద్వారా అసత్య ప్రచారాలు, ఇతరుల మనోభావాలు దెబ్బతినే విధంగా అభ్యంతరకర పోస్టులు వచ్చిన ప్రజలు అట్టి పోస్టులను చూసిన వెంటనే ప్రతిస్పందించకుండా, సంయమనం పాటిస్తు అట్టి పోస్టుల్లో నిజానిజాలను తెలుసుకునే ప్రయత్నం చేయాలని, సామాజిక మాధ్యమంల్లో వచ్చే వదంతులను నమ్మవద్దని వాటిని ముందుగా ఎటువంటి సమాచారం తెలిసినా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలి సూచించారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లఘించి ఆవులు, లేగదూడలను అమ్మినట్లయితే సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామన్నారుపండుగ సందర్భంగా ప్రజలు శాంతియుతంగా, ఒకరితో ఒకరు కలసిమెలసి ఉండాలి. చట్టవ్యతిరేక కార్యకలాపాలు, ప్రజా శాంతికి భంగం కలిగించే వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని గుర్తుంచుకోవాలి. పండుగను సంతోషంగా మరియు ప్రశాంతంగా జరుపుకోవాలి. ఈ సమావేశంలో గోదావరిఖని ఏ సి పి ఎం రమేష్, గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, గోదావరిఖని టూ టౌన్ ఇన్స్పెక్టర్ ప్రసాదరావు, రామగుండం సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, గోదావరిఖని టౌన్ ఎస్ఐ లు రమేష్, భూమేష్, ఎన్ టి పి సి ఎస్ ఐ ఉదయ్ కిరణ్, రామగుండం ఎస్సై సంధ్యారాణి, హిందూ ముస్లిం క్రిస్టియన్ మత పెద్దలు మరియు తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 10న వసుంధర విజ్ఞాన వికాస మండలి వార్షికోత్సవ వేడుకలు.

కమాన్ పూర్ ప్రజా క్రాంతి జూన్ 4. : వసుంధర విజ్ఞాన వికాస మండలి 32వ వార్షికోత్సవ వేడుకలు ఈనెల 10న హైదరాబాద్లోని రవీంద్ర భారతిలో నిర్వహించడం జరుగుతుందని వ్యవస్థాపక అధ్యక్షుడు మధు ధర్మారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఈ వేడుకలను నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ వేడుకలకు గాను ముఖ్య అతిథులుగా రమణాచారి ఐఏఎస్ మాజీ అధికారి. వైస్ ఛాన్సర్ బిఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం గంట చక్రపాణి, గౌరవ అతిథులుగా మామిడి హరికృష్ణ, ఏనుగు నరసింహారెడ్డి బి వి శ్యాంప్రసాద్ లాల్, ప్రత్యేక ఆహ్వానితులుగా నామోజు బాలా చారి తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి, మరియు సినీ నటులు తాగుబోతు రమేష్ రచ్చ రవి తోపాట రాయన్న రమేష్ ,గంట వెంకటరమణారెడ్డి, జక్కుల దామోదర్ తోపాటు సభా నిర్వహణ దేవి లక్ష్మీ నరసయ్య కర్క శ్రీధర్ రెడ్డి కోల మాధురి తదితరులు తదితరులు పాల్గొనడం జరుగుతుందని పేర్కొన్నారు. అలాగే ఇందులో కర్క ముత్తారెడ్డి కవితా పురస్కారం అవార్డు, చదువు మల్లారెడ్డి పుడమిపుత్ర అవార్డు, చంద్రమోహన్ స్మారక విద్య పురస్కారం, స్ఫూర్తి పురస్కారాల అవార్డులు ప్రధానం చేయడం జరుగుతుందని చదువు వెంకటరెడ్డి, కట్కూరి శంకర్, గుడి కందుల భూమయ్య తెలిపారు.

## ఈనెల 10న పుడమిపుత్ర అవార్డు అందుకోనున్న "సాన"



రైతు, జంతు ప్రేమికుడు, సానా రామకృష్ణారెడ్డికి ఈనెల 10న హైదరాబాదులోని రవీంద్ర భారతి కాన్ఫరెన్స్ హాల్లో పుడమి పుత్ర అవార్డును వసుంధర విజ్ఞాన వికాస మండలి వ్యవస్థాపక అధ్యక్షుడు మధు ధర్మారెడ్డి ఆధ్వర్యంలో అందజేయనున్నారు. కమాన్ పూర్ మండలం జూలపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ఆదర్శనగర్ కు చెందిన పుడమిపుత్ర అవార్డుకు జూరీ కమిటీ ఎంపిక చేశారు. వసుంధర విజ్ఞాన వికాస మండలి వ్యవస్థాపక అధ్యక్షుడు మధు ధర్మారెడ్డి ఆధ్వర్యంలో చదువు మల్లారెడ్డి స్మారక ఉత్తమ రైతు పుడమిపుత్ర పురస్కారానికి జ్యూరీ కమిటీ ఎంపిక చేసినట్లు మధు ధర్మ రెడ్డి తెలిపారు. హైదరాబాద్ లో ప్రముఖులైన గంట చక్రపాణి రమణాచారి మామిడి హరికృష్ణ ఏనుగు నరసింహారెడ్డి శ్యాం ప్రసాద్ లాల్ ల చేతుమీదుగా అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. రామకృష్ణారెడ్డి ఎంపిక పట్ల నల్లవెల్లి శంకర్, జబ్బార్ ఖాన్, అనవేన లక్ష్మి రాజం, తదితరులు హర్షం వ్యక్తం చేశారు. రామకృష్ణారెడ్డిని ఎంపిక చేసిన మధు ధర్మ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పేదలకు ఉచిత న్యాయ సహాయం

### -సీనియర్ సివిల్ జడ్జ్ వి.భవాని



మంథని ప్రతినిధి,జూన్ 04: మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పేదలకు ఉచిత న్యాయ సహాయం అందిస్తున్నట్లు మంథనిసీనియర్ సివిల్ జడ్జ్ వి.భవాని పేర్కొన్నారు, బుధవారం మంథని మండలం గుజపడుగు గ్రామంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జ్ వి.భవాని సదస్సులో మాట్లాడుతూ ఈనెల 14 న నిర్వహించనున్న లోక్ అదాలత్ లో రాజీకి అవకాశం ఉన్న కేసులను ఇరు వర్గాల మధ్య అవగాహన తో పరిష్కరించే అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు,పేద ప్రజలు న్యాయ సహాయం కోసం కోర్టులకు రావచ్చని పేర్కొన్నారు,బార్ అసోషియేషన్ ఉపాధ్యక్షులు కె రఘోత్తమ్ రెడ్డి పౌరుల హక్కులు,భాధ్యతలు,చట్టాల పట్ల అవగాహన కల్పించారు,మంథని తహసీల్దార్ కుమార స్వామి భూభారతి,భూ చట్టపరమైన అంశాల పట్ల అవగాహన కల్పించారు, మంథని ఏస్.ఐ డి.రమేష్ సైబర్ చట్టాలు,మారక ద్రవ్యాలపై మాట్లాడారు,న్యాయ వాదులు శశిభూషణ్ కాచె,కటకం శ్రీనివాస్ లు రైతు సంబంధించిన చట్టపరమైన అశాలపై మాట్లాడారు. పిఏసిఏస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్,లోక్ అదాలత్ సభ్యులు కనుకుంట్ల స్వామి తోపాటు మహిళలు,రైతులు పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ఉచిత కుట్టు శిక్షణ శిబిరం

### -రాణి రుద్రమ దేవి కుట్టు శిక్షణ కేంద్ర నిర్వాహకులు కటుకు ప్రవీణ్



రామగుండం :మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ఏర్పాటు చేసినట్లు రాణి రుద్రమ దేవి కుట్టు శిక్షణ కేంద్ర నిర్వాహకులు కటుకు ప్రవీణ్ తెలిపారు. రామగుండం స్థానిక 13వ డివిజన్ లో రాణి రుద్రమదేవి ఉచిత నైపుణ్య శిక్షణ కేంద్రంలో 45 రోజుల ఉచిత కుట్టు శిక్షణ శిబిరం ఏర్పాటు చేశారు. మంగళవారం ఉచిత కుట్టు శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమాన్ని కేంద్రంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని, మహిళాభివృద్ధికి ఆర్థికత చేకూరితే మరింత ముందుకెళ్లే అవకాశం ఉందని, ఇందుకు నా వంతు సహాయంగా ఉచిత శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేసి సుమారు 60 మంది మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణాలో ఇప్పించడం జరిగిందనీ తెలిపారు. ఈ శిక్షణలో మేము ఎంతగానో నేర్చుకొని మా వంతు సహాయంగా మేము ఆర్థికంగా ముందుకెళ్తామని మహిళా మణులు సంతోషం వ్యక్తం చేశారు. అదేవిధంగా ఉచిత అబాకాస్ క్లాసులను కూడా స్టార్ట్ చేశామని, అబాకాస్ క్లాసుల ద్వారా పిల్లల భవిష్యత్తు ఉజ్వలంగా మారుతుందని భావిస్తూ కటుకు ప్రవీణ్ ఇంత మంచి కార్యక్రమాలకు పూనుకున్నారని పిల్లల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో భరోసా స్వచ్ఛంద సంస్థ ఫౌండేషన్ అధినేత నసీమా బేగం, శిక్షకురాలు రేష్మ, అధిక సంఖ్యలో బస్తీవాసులు, మహిళలు పాల్గొన్నారు.

# గ్రేటర్ రేషన్ కార్డుల దందా

హైదరాబాద్, జూన్4,: రేషన్ కార్డుల కోసం ఇప్పుడు ప్రజలు మీ సేవా కేంద్రాలకు క్యూ కడుతున్నారు. ఇదే అదునుగా భావించిన పౌరసరఫరాల అధికారులు డబ్బుల వసూళ్లకు పాల్పడుతున్నారు. కాంగ్రెస్ పాలనలో 30 శాతం కమిషన్లు ఇస్తేనే పనులు చేస్తున్నారంటూ పలువురు రాష్ట్ర మంత్రులపై ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో మేమేం తక్కువ తిన్నామా అంటూ కొందరు అధికారులు సైతం వారిని ఆదర్శంగా తీసుకొని అవినీతి దందాకు తెరలేపారు. ప్రతి రోజూ అందినకాడికి దండుకుంటున్నారు. రెండు మూడు రోజుల్లోనే కొత్త రేషన్ కార్డులు ఇప్పిస్తామని కొందరు సివిల్ సప్లై ఉద్యోగులతో పాటు పలువురు దళారులు భారీగా వసూళ్లకు పాల్పడుతున్నారనే అరోపణలు వెల్లువెత్తుతున్నాయి .రాష్ట్రంలో ఏ సంక్షేమ పథకానికి దరఖాస్తు చేసుకోవాలన్నా కావాల్సింది ప్రధానంగా రేషన్ కార్డు. ప్రతి పేద, నిరు పేద, మధ్యతరగతి కుటుంబాల్లో ప్రతిష్టాత్మకంగా రేషన్ కార్డు అనేది అవసరం. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు ఇవ్వాలనే ఉద్దేశంతో మీసేవ సెంటర్ల ఆన్‌లైన్ చేసుకొని పౌరసరఫరాల కార్యాలయాల్లో వాటిని వెరిఫికేషన్ చేసి వెంటనే కార్డు మంజూరు చేయాలని ప్రభుత్వం చెబుతుంటే దీనికి భిన్నంగా పౌరసరఫరాల అధికారులు వ్యవహరిస్తున్నారు. కొత్త రేషన్ కార్డుల కోసం గత ఏడాది నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమంలో దరఖాస్తులు స్వీకరించారు. వాటి విచారణను మాత్రం పౌరసరఫరాల అధికారులు జీహెచ్ఎంసీకి అప్పగించించారు. కొత్తగా కార్డు కావాలనుకునే వారు మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించినా ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న వారు ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకునే అవసరం లేదంటూ అప్పట్లో అధికారులు ప్రకటించారు. అయితే రెండు శాఖల అధికారుల సమన్వయ లోపంతో తీరా ప్రజా పాలన దరఖాస్తులను పక్కన పెట్టి జీహెచ్ఎంసీ అధికారులు చేతులెత్తేశారు. దీంతో ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు కూడా తాజాగా మరో సారి మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకోవాలని అధికారులు ప్రకటించారు. దీంతో గతంలో ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న కుటుంబాలతో పాటు కొత్తగా రేషన్ కార్డు కావాలనుకునే వారు, కార్డులో మార్పులు చేర్పులు చేసుకునే వారు మీ సేవా కేంద్రాలకు క్యూ కడుతున్నారు. అయితే వీరిది అవసరం..ఇదే మనకు అవకాశంగా భావించిన కొంత మంది పౌరసరఫరాల అధికారులు కొందరు దళారుల అండతో అక్రమంగా డబ్బుల వసూళ్లకు పాల్పడుతూ భారీ అవినీతికి తెరలేపారని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.కొత్త రేషన్ కార్డుల మంజూరులో ఏరియా సివిల్ సప్లై ఇన్ స్పెక్టర్లు కీలకంగా మారారు. దీంతో అంబర్ పేట సర్కిల్ పరిధిలోని అంబర్ పేట డివిజన్ పరిధిలోకి వచ్చే 2 ?3 ఇంటి నంబర్లకు సంబంధించిన విచారణ అధికారిగా విధులు నిర్వహిస్తోన్న ఓ సివిల్ సప్లై ఇన్ స్పెక్టర్ అవినీతికి పాల్పడుతున్నాడని ఆరోపణలు ఉన్నాయి. సదరు అధికారి కొత్త రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న కుటుంబాల ఇంటి వెళ్లి క్షేత్ర స్థాయిలో విచారణ జరిపి అసలైన అర్హులను గుర్తించి వారికి కొత్త రేషకార్డులను మంజూరు చేయాల్సి ఉంటుంది?కానీ అతను అంబర్ పేట పటేల్ నగర్ హనుమాండ్ల గుడి వద్ద ఓ వారం రోజుల పాటు క్యాంపు ఏర్పాటు చేసుకొని తూతూ మంత్రంగా విచారణ చేపట్టి వదిలేశాడని పలువురు ఆరోపిస్తున్నారు. ఇక దరఖాస్తు చేసుకున్న వారి ఇంటికి విచారణ పేరుతో వెళ్లి ఏదో కారణం చూపిస్తూ మీకు కార్డు రాదంటూ బయపెడుతున్నారని దీంతో చేసేది ఏమీ లేక రూ.వెయ్యి లంచం ఇచ్చుకోక తప్పడం లేదని పలువురు పేరు తెలపడానికి ఇష్ట పడని అర్హులైన పలువురు లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లంచం ఇచ్చే వారి పట్ల ప్రేమగా ఉంటూ .. నెలలు గడిచినా ఇంకా కొత్త కార్డు రాలేదని అర్హులైన దరఖాస్తు చేసుకున్న సామాన్య ప్రజలు సర్కిల్ కార్యాలయం వద్దకు వెళితే బెదిరింపులకు పాల్పడుతూ సరైన సమాధానం చెప్పకుండా వారి పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారని పలువురు



దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. ఇదిలా ఉంటే కాంగ్రెస్ పాలనలో ఇది కామనే ?అంటూ ప్రజలు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు.ఈ అక్రమ దందాలో పలు పార్టీల నాయకులతో పాటు తాడు, బొంగరం, ఊరు పేరు లేని పొట్ట చీల్చితే అక్షరం రాని కొందరు విలేకరులు కూడా దళారులుగా మారి అందిన కాడికి దండుకుంటున్నారు. కొత్త రేషన్ కార్డు వెంటనే ఇప్పిస్తామంటూ సదరు దళారులు మీ సేవా కేంద్రాల్లో నమోదు చేసిన దరఖాస్తులను లబ్ధిదారుల వద్ద తీసుకుని వారి వద్ద రూ. 2వేల వరకు వసూళ్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. వీరు అంబర్ పేట డివిజన్ సివిల్ సప్లై ఇన్ స్పెక్టర్ తో కుమ్మక్కై ఓ ఒప్పందం కుదర్చుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. లబ్ధిదారుల వద్ద తీసుకున్న డబ్బుల్లో రూ.వెయ్యి ఇన్ స్పెక్టర్ కు లంచంగా ఇవ్వడంతో అదే రోజు అనర్హులైనా ఎలాంటి విచారణ చేయకుండా వాటిని క్లియరెన్స్ చేస్తున్నట్లు ఆరోపణలు సైతం ఉన్నాయి. దీంతో వారికి కేవలం రెండు రోజుల్లోనే కొత్త కార్డులు మంజూరు అవుతున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంటే కొంతమంది నెలలు గడిచినా రేషన్ కార్డు మంజూరు కాకపోవడంతో తమకు కార్డు వస్తుందో ..రాదో అంటూ ఆందోళన చెందుతున్నారు. డబ్బులు తీసుకొని రేషన్ కార్డులు మంజూరు చేసే అధికారుల పైన ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని రేషన్ కార్డు లబ్ధిదారులు కోరుతున్నారు

## బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా కాంగ్రెస్ పార్టీలో చేరిక



నర్సంపేట జూన్ 4 చెన్నారావుపేట మండలం లింగాపురం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ విద్యాకమిటీ చైర్మన్ వేములపెల్లి కుమారస్వామి,వేములపెల్లి శివకృష్ణ,ముదిగొండ రాజు ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి సాధరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,కాంగ్రెస్ పార్టీ ప్రవేశ పెడుతున్న పథకాలకు ప్రజలు ఆకర్షతులై కాంగ్రెస్ పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో చెన్నారావుపేట మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ లింగాపురం మాజీ సర్పంచ్ తప్పేట రమేష్,మాజీ వైస్ ఎంపీపీ పురం రాంబాబు,మాజీ సొసైటీ వైస్ చైర్మన్ రాజబోయిన దూడయ్య,మాజీ ఉప సర్పంచ్ తప్పేట స్వామి,పండుగ రాజు,చేలాగోల రాజు తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల నియంత్రణ కు ముందస్తు చెర్యలు చేపట్టాలి

### జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి జూన్ 4: వర్షాకా లంలో వచ్చే సీజనల్ వ్యాధుల నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన. ముందస్తు జాగ్రత్తలపై వైద్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పంచాయతి రాజ్, డిఆర్డీఓ, విద్యా, ఆర్ డబ్ల్యూఎస్, సంక్షేమ శాఖల అధికారులు, మున్సిపల్ తదితర శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సీజనల్ వ్యాధులు నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలు, జాగ్రత్తలను గురించి వివరించా రు. వ్యాధి. ప్రబలిన తదుపరి చికిత్సలు చేయడం కంటే వ్యాధులు ప్రబల కుండా ముందస్తు చర్యలు చాలా ముఖ్యమని తెలిపారు. వానాకాలంలో మలేరియా, పైలేరియా, మెదడు వాపు, డెంగీ, చికెన్ గున్యా, టైఫాయిడ్, డయేరియా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ఎప్పటికప్పుడు అన్ని.పరీక్షలు నిర్వహిస్తూ మెరుగైన వైద్య సేవలు అందించాలని స్పష్టం చేశారు. పరసరాలను పరిశుభ్రంగా ఉ ంచుకోవడంతో అన్ని వ్యాధులను అరికట్టవచ్చని ఇందుకు గాను ప్రతి శుక్రవారం ప్రతి కుటుంబం తప్పని సరి డ్రై డే పాటించేలా అవగాహనకల్పించాలని సూచించారు.వర్షపు నీరు నిల్వ వల్ల దోమలు వ్యాప్తి జరుగుతుందని ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సూచించా రు. నీరు నిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించి ఆయిల్ బాల్స్, గంబూషి యా చేపలు వేసి దోమలు ప్రభల కుండా అరికట్టాలని తెలిపారు. దోమలు వ్యాప్తి జరుగకుండా ఫాగింగ్ చేయాలన్నారు. గ్రామ పంచా యతీ, మున్సిపల్ ప్రాంతాల్లో మురుగునీరు నిల్వలు, వ్యర్థాలు లేకుం డా పరిశుభ్రం చేయాలని సూచించారు. పాఠశాలల్లో విద్యార్థులకు వ్యక్తి గత పరిశుభ్రత అలాగే వ్యాధులు ప్రబల కుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు, అంగన్వాడీ. కేంద్రాల చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వ్యాధులు. ప్రబలిన గ్రామాలల్లో వైద్య శిబిరాలు నిర్వహించి ఇంటింటి సర్వే చేసి వైద్య సేవలు అందించి వ్యాధులు ప్రభలకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ర్యాపిడ్ టీములు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. సురక్షిత. మంచినీటి సరఫరా అత్యంత ముఖ్యమని ముందిగానే కుళాయిలు, మంచినీటి వైపు లైన్ల లీకేజీలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆర్ డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. మంచినీటి ట్యాంకులు ప్రతి 10 రోజులకు ఒకసారి పరిశుభ్రం చేయాలని, మంచినీటిని క్లోరిన్ వేయాలని తెలిపారు. డిఆర్డీఓ, మెప్మా అధికారులు మహిళా సంఘాల సమావేశాల్లో వ్యాధులు ప్రబల కుండా తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. గతంలో జ్వరాలు ప్రబలిన ప్రాంతాలను హాట్ స్పాట్ గా గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పరీక్షలు నిర్వహిస్తూ వ్యాధులు ప్రబల కుండా అన్ని జాగ్రత్తలు చేపట్టాలని తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా వైద్యాధికారి డా మధుసూదన్, ప్రధాన ఆసుపత్రి సూపరింటెండెంట్ డా నవీన్, ఆసుపత్రుల సమన్వయ అధికారి డా శ్రీకాంత్, డిపిఓ వీరభద్రయ్య, డిఆర్డీఓ బాలకృష్ణ, బిసి సంక్షేమ అధికారి క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## భూ భారతి అవగాహన సదస్సులో పాల్గొన్న ఎమ్మెల్యే, కలెక్టర్

### - రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు..





జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి జూన్ 4: జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం బుద్దారం గ్రామంలో తహశీల్దార్ సత్యనారాయణ స్వామి అధ్యక్షతన నిర్వహించిన భూ భారతి రెవెన్యూ అవగాహన సదస్సులో జిల్లా కలెక్టరేట్ రాహుల్ శర్మ తో కలిసి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ... గతంలో ఉన్న ధరణిలో అనేక లోపాలు ఉన్నాయని సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం గుర్తించి ధరణి స్థానంలో కొత్త చట్టాన్ని తీసుకువచ్చేందుకు మేధావులు, రైతు సంఘాలు, అందరితో చర్చించి గత చట్టంలోని లోపాలను సవరిస్తూ కొత్త చట్టం తీసుకు వచ్చిందన్నారు. లోపభూయిష్టంగా ఉన్న ధరణి వల్ల పట్టాల జారీలో ఏదేని పొరపాటు జరిగితే అప్పీలు చేయడానికి అవకాశం లేదని, రైతులు సివిల్ కోర్టు చుట్టూ తిరగాల్సి వచ్చేదని దానివల్ల ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వస్తే ధరణి స్థానంలో భూ భారతి తెస్తామని చెప్పిన ప్రకారం పటిష్టమైన చట్టాన్ని అమల్లోకి తెచ్చినట్లు తెలిపారు. ఈరోజు నుండి ఈనెల 20వ తేదీ వరకు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని, ప్రజలు ఇచ్చిన ప్రతీ దరఖాస్తు రిజిస్టర్ లో నమోదు చేయాలని ఆదేశించారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి పట్టాలు జారీ చేస్తామని తెలిపారు. ప్రజలు రెవెన్యూ సదస్సులలో తమ భూ సమస్యలపై దరఖాస్తు ఇవ్వాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నేతలు, అధికారులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పర్వత వర్ధిని రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే, కలెక్టర్..బుద్దారం గ్రామంలో నిర్వహించిన భూ భారతి అవగాహన సదస్సు లో పాల్గొన్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయ ణ రావు, కలెక్టర్ రాహుల్ శర్మ గ్రామంలోని శ్రీ పర్వత వర్ధిని రామలింగేశ్వర స్వామి వారి ఆలయాన్ని సందర్శించారు. ఆలయ ప్రధానార్చకులు శేషాచార్యులు వారి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామలింగేశ్వర స్వామి వారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నారు.

## ఫార్మసీ ఆఫీసర్లు అందరూ మందులను పోర్టల్ లో ఎంట్రీ చేయాలి

### డాక్టర్ బి రవి రాథోడ్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి



మహబూబాబాద్, ప్రతినిధి (జూన్ 4):బుధవారం జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో ఫార్మసీ ఆఫీసర్లకు "ఫ్యామిలీ ప్లానింగ్ లాజిస్టిక్ మేనేజ్మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టం" పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ జిల్లాలో ఫార్మసీ ఆఫీసర్లు అందరూ ఫ్యామిలీ ప్లానింగ్ సంబంధించిన, తాత్కాలిక పద్ధతులైన అంతరా ఇంజక్షన్స్, ఓరల్ పిల్స్, ఐ యు సి డి, జిల్లాకు వచ్చిన మందులు, అన్నీ కూడా పోర్టల్ లో, అప్లోడ్ చేయాలని అన్నారు. వర్షాకాలంలో మందులన్నీ మూడు నెలల స్టాక్ ఉంచుకోవాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్స్ డాక్టర్ లక్ష్మీనారా యణ డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ సారంగం, డిప్యూటీ డెమో కొప్పు ప్రసాద్, హెల్త్ ఎడ్యుకేటర్ కెవి రాజు, సబ్ యూనిట్ ఆఫీసర్ రామకృష్ణ, లో కియా, ఫార్మసీ ఆఫీసర్ రామారావు, డిపిఓ నీలోహన, డిడిఎం సౌమిత్, సూపర్వైజర్ రవి, రాజ్యలక్ష్మి విసిసిఎం, ఫార్మసీ ఆఫీసర్లు పాల్గొన్నారు.

## శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ షష్టమ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు ప్రారంభం



మెట్ పల్లి జూన్ 4: భూ నీలాదేవి సమేత వెంకటేశ్వరా స్వామి షష్టమా వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు పురస్కరించుకొని బుధవారం శ్రీ వెంకటేశ్వర ఆలయం మెట్ పల్లి లో వేదమంత్రాల తో యాగశాల ప్రవేశము, హోమము, పూర్ణాహుతి, తీర్థ ప్రసాద వితరణ జరిగినది. అనంతరం సాయంత్రము విష్ణు సహస్ర నామ పారాయణం నిత్య విధి, నిత్యహోమము, పూర్ణాహుతి, బలిహరణ ము, తీర్థ ప్రసాద గోష్టి కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. గురువార ము రోజున ఉదయము శ్రీ భూనీలా సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవం ఘనంగా జరుగును. కావున పట్టణ, గ్రామీణ ప్రజలు స్వామివారి దివ్య ఆశీస్సుల కొరకు కళ్యాణానికి విచ్చేయాలని, స్వామివారి కటాక్షం పొందాలని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు మహాజన్ నర్సింలు , దొంతుల రాజ్ కుమార్, మహాజన్ శివకుమార్ , మంచాల రవీందర్ మరియు భక్తులు, కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

# ఆ మాత్రలు.. అసలే వద్దు!



గర్భ నిరోధక మాత్రలు తీసుకొనే మహిళల్లో క్రిప్టోజెనిక్ స్ట్రోక్స్ వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని తాజా పరిశోధన ఒకటి వెల్లడించింది. సింథటిక్ ఈస్ట్రోజన్, ఎథినిల్ ఈస్ట్రడియాల్, ప్రొజెస్టిరాన్ ఉండే ఈ మాత్రలు.. ఆడవాళ్ల ఆరోగ్యానికి ఏమాత్రం మంచిదికాదని సదరు సర్వే హెచ్చరించింది. మెదడుకు రక్త ప్రవాహం తగ్గడం వల్ల వచ్చే క్రిప్టోజెనిక్ స్ట్రోక్స్‌తోపాటు అనేక అనారోగ్య సమస్యలను తెచ్చిపెడుతుందని చెబుతున్నది. 'యూరోపియన్ స్ట్రోక్ ఆర్గనైజేషన్'లో ఈ సర్వేకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. 18 నుంచి 49 ఏళ్ల వయసు మహిళల్లో క్రిప్టోజెనిక్ స్ట్రోక్స్ రావడానికి గల కారణాలపై యూరోపియన్ యూనియన్‌కు చెందిన పరిశోధకులు ప్రత్యేక సర్వే నిర్వహించారు. ఇందులో 13 వేర్వేరు యూరోపియన్ దేశాల నుంచి క్రిప్టోజెనిక్ ఇస్కిమిక్ స్ట్రోక్ ఉన్న 608 మంది రోగులు పాల్గొన్నారు. వారి హెల్త్ ట్రాక్‌ను క్షుణ్ణంగా పరిశీలించిన అధ్యయనకారులు.. మిగతా వారితో పోలిస్తే గర్భ నిరోధక మాత్రలు వాడిన మహిళలకు క్రిప్టోజెనిక్ స్ట్రోక్ వచ్చే అవకాశం మూడురెట్లు ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. ఇక గర్భధారణ నివారణకు మాత్రలు తీసుకోవడం కేవలం తాత్కాలిక పద్ధతి మాత్రమేననీ, అయినా కొందరు వీటిని తరచుగా తీసుకుంటున్నారని వారు వెల్లడించారు. ఫలితంగా మహిళల్లో అనేక రకాల సైడ్ ఎఫెక్ట్స్ వస్తున్నాయని చెబుతున్నారు. ఈ మాత్రలు మహిళల శరీర పనితీరును తీవ్రంగా ప్రభావితం చేస్తాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. వీటిని తీసుకున్న తర్వాత కొందరిలో తీవ్రమైన ఒత్తిడి కనిపిస్తుంది. వికారం, తలనొప్పి లాంటి సమస్యలు వేధిస్తాయి. హార్మోన్లలో అసమానతలు ఏర్పడి.. రుతుక్రమంలోనూ మార్పులు వస్తాయి. అధిక రక్తస్రావం, ఎక్కువ రోజులపాటు రుతుస్రావం లాంటి సమస్యలు ఏర్పడుతాయి. ఇక వీటిని ఎక్కువగా తీసుకుంటే.. భవిష్యత్తులో పిల్లలు పుట్టే అవకాశం లేకుండాపోయే ప్రమాదం కూడా ఉందని అధ్యయనకారులు హెచ్చరిస్తున్నారు. కాబట్టి, ఈ మాత్రలను తీసుకోవడం వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి తెలుసుకున్న తర్వాతే.. వీటిని వాడాలని అంటున్నారు.

# కొబ్బరినీళ్లలో తేనె కలిపి తాగితే కలిగే అద్భుతమైన ప్రయోజనాలు



కొబ్బరి నీళ్లు, తేనె.. ఇవి రెండూ మనకు ఆరోగ్యకరమైన ప్రయోజనాలను అందించేవే. కొబ్బరి నీళ్లను వేసవికాలంలోనే కాదు ప్రతి సీజన్‌లోనూ తాగాలి. వీటిని తాగితే అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. తేనె కూడా మనకు అద్భుతమైన లాభాలను అందిస్తుంది. అయితే ఈ రెండింటి కాంబినేషన్‌ను మీరు ఎప్పుడైనా ట్రై చేశారా. కొబ్బరినీళ్లు, తేనె కాంబినేషన్ మనకు ఎన్నో విధాలుగా ఉపయోగపడుతుంది. ఈ రెండింటినీ కలిపి తీసుకోవచ్చు. వీటిని కలిపి తీసుకుంటే అద్భుతమైన ప్రయోజనాలు ఉంటాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. కొబ్బరినీళ్లు, తేనెను కలిపి తీసుకుంటే శరీరానికి శక్తి లభించి ఉత్సాహంగా మారుతారు. చురుగ్గా పనిచేస్తారు. శరీరంలో శక్తి స్థాయిలు పెరుగుతాయి. రోజంతా ఉత్సాహంగా ఉంటారు. నీరసం, అలసట తగ్గిపోతాయి.జ్వరం నుంచి కోలుకుంటారు..: జ్వరం వచ్చిన వారు ఈ రెండింటి కాంబినేషన్ తీసుకుంటే త్వరగా జ్వరం నుంచి కోలుకుంటారు. ఉత్సాహం వస్తుంది. నీరసం పోతుంది. ఈ రెండింటి కాంబినేషన్‌ల వల్ల శరీరం హైడ్రేటెడ్‌గా ఉంటుంది. శరీరంలోని ద్రవాలు సమతుల్యంలో ఉంటాయి. ఎలక్ట్రోలైట్స్ సరైన స్థాయిలో ఉంటాయి. దీంతో డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉంటారు. అలాగే శరీరంలోని వేడి తగ్గిపోతుంది. తేనె, కొబ్బరి నీళ్లను కలిపి తీసుకోవడం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. కొబ్బరినీళ్లలో ఉండే ఎలక్ట్రోలైట్స్, విటమిన్ సి, తేనెలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ మైక్రోబియల్ గుణాలు రోగ నిరోధక వ్యవస్థను పటిష్టంగా మారుస్తాయి. దీంతో శరీరం వ్యాధులు, ఇన్‌ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాటం చేస్తుంది. రోగాలను త్వరగా తగ్గేలా చేస్తుంది.

జీర్ణ వ్యవస్థ ఆరోగ్యానికి..: కొబ్బరినీళ్లు, తేనెల మిశ్రమాన్ని తాగితే ప్రీ బయోటిక్ ఆహారంలా పనిచేస్తుంది. అంటే జీర్ణ వ్యవస్థలో మంచి బ్యాక్టీరియాను పెంచుతుందన్నమాట. దీంతో పొట్టలో ఉండే అసౌకర్యం తగ్గుతుంది. విరేచనాల సమస్య తగ్గుతుంది. అజీర్తి, గ్యాస్, కడుపు ఉబ్బరం, మలబద్ధకం. అసిడిటీ వంటి జీర్ణ సమస్యలు అన్నీ తగ్గిపోతాయి. తేనె, కొబ్బరినీళ్ల రెండింటిలోనూ యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించి కణాలకు జరిగే నష్టాన్ని నివారిస్తాయి. దీంతో గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా జాగ్రత్త పడవచ్చు. కొబ్బరినీళ్లు, తేనె మిశ్రమం గొంతులో ఏర్పడే గరగరను సైతం తగ్గిస్తుంది. గొంతు నొప్పి, మంట కూడా తగ్గిపోతాయి. దగ్గు, జలుబు నుంచి ఉపశమనం లభిస్తుంది. శ్వాస నాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోయి శ్వాస సరిగ్గా లభిస్తుంది.ఎలా తీసుకోవాలి..?: కొబ్బరినీళ్లు, తేనె మిశ్రమాన్ని తీసుకోవడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నప్పటికీ డయాబెటిస్ ఉన్నవారు, బరువు అధికంగా ఉన్నవారు డాక్టర్ సూచన మేరకు ఈ మిశ్రమాన్ని తీసుకోవాల్సి ఉంటుంది. ఇక ఒక గ్లాస్ కొబ్బరినీళ్లకు గాను ఒక టీస్పూన్ తేనెను కలిపి తాగాల్సి ఉంటుంది. దీన్ని ఉదయం పరగడుపునే సేవిస్తే మంచిది. దీంతో రోజంతా ఉత్సాహంగా ఉంటారు. శరీరంలో శక్తి స్థాయిలు తగ్గవు. ఎంత పనిచేసినా నీరసం, అలసట రావు. అలర్జీలు ఉన్నవారు. కిడ్నీ సమస్యలు ఉన్నవారు ఈ మిశ్రమాన్ని తీసుకోకూడదు. కొబ్బరి నీళ్లు, తేనె మిశ్రమం అందరికీ పడకపోవచ్చు. ఏవైనా లక్షణాలు కనిపిస్తే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి. మీరు ఏదైనా డైట్‌ను మారిస్తే కచ్చితంగా నిపుణుల సలహా తీసుకోవాల్సి ఉంటుంది.

# ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న ఆర్టీసీ ఓడి కండక్టర్

**-ఉద్యోగ కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తే సహించేది లేదు**

**-ప్రజా సంఘాల నాయకుల హెచ్చరిక**



మంథని ప్రతినిధి,జూన్ 04: పంచని బస్సు డిపోలో ఒక ఆర్టీసీ ఓడి కండక్టర్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తు ఉద్యోగ కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ఇలాంటి చర్యలను సహించేది లేదని ప్రజా సంఘాల నాయకుల హెచ్చరించారు.బుధవారం మంథనిలోప్రజా సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బూడిద గణేష్ మాట్లాడుతూ మంథని ఆర్టీసీ డిపో ఓడి కండక్టర్ ఆధ్వర్యంలో నడుస్తుందా లేక ఆర్టీసీ యాజమాన్యం ఆధ్వర్యంలో నడుస్తుందా అని ప్రశ్నించారు ఆర్టీసీ డిపోలో ఓడి కండక్టర్ తిష్ట వేసి ఆధిపత్యం చెలాయిస్తూ అన్ని పనులు చేస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాడని అన్నారు డ్రైవర్ ,కండక్టర్లను వాడు వీడు అంటూ దుర్భాషలాడుతూ హేళనగా మాట్లాడుతుంటే యాజమాన్యం చోద్యం చూస్తుందని మండిపడ్డారు డ్యూటీ బుకింగ్ అయిన తర్వాత కూడా తనవారికి అనుకూలమైన డ్యూటీలు వేయించుకుంటున్నాడని పర్మినెంట్ డ్యూటీలను కూడా డబల్ డ్యూటీ పేరుతో తన వాళ్లకి వేస్తూ కార్మికులను వేధిస్తున్నాడని అన్నారు. అత్యవసర పరిస్థితుల్లో కార్మికులకు సెలవు మంజూరు కావాలన్నా ఓడి కండక్టర్ అనుమతి తప్పనిసరి అని సెలవు ఇవ్వడంలో ఓడి కండక్టర్ పెత్తనం ఏమిటని ప్రశ్నించారు. యాజమాన్యమే ఓడి కండక్టర్ ను లైన్ మీద డ్యూటీ కి వెళ్ళదు అంటున్నారని చెప్పుకుంటూ డిపోలోనే ఓడి కండక్టర్ గా చలామణి అవుతున్నాడని అన్నారు. ఓడి కండక్టర్ డిపోలో ఆజమా యిషి గా చలాయించడం వల్ల ఆర్టీసీ కార్మికులు బిక్కుబిక్కుమంటు దిక్కు లేని పరిస్థితుల్లో విధులు నిర్వర్తిస్తున్నారని అన్నారు .ఓడి కండక్టర్ ప్రవర్తనలో మార్పు రాకుంటే తిరిగి ఇలాంటి పరిస్థితులే పునరావృతమై కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తే కార్మికుల పక్షాన ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంథని ఆర్టీసీ డిపో ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆర్ల సందీప్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గొర్రెంకల సురేష్, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షుడుమంథని లింగయ్య, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

# గుండెజబ్బుల ప్రమాదం పెంచుతున్న కరోనా..

**చిన్నపాటి లక్షణాలు కూడా డేంజరేనంటున్న స్టడీస్..!**




కరోనా మహమ్మారి 2019 సంవత్సరంలో చైనాలో వెలుగులోకి వచ్చింది. తక్కువ సమయంలోనే ప్రపంచవ్యాప్తంగా విస్తరించింది. కొంతకాలంగా సైలెంట్ అయిన వైరస్.. ఇటీవల మళ్లీ విరుచుకు పడుతున్నది. మహమ్మారి వెలుగులోకి వచ్చినప్పటి నుంచి పలు అధ్యయనాలు కరోనా వైరస్ శ్వాసకోశ వ్యాధులకు కారణమైనప్పటికీ.. శరీరంలోని అనేక భాగాలపై దుష్ప్రభావం కలిగిస్తుందని తెలిపాయి. కరోనావైరస్ శరీరాన్ని ఎలా ప్రభావితం చేస్తుందో అర్థం చేసుకోవడానికి ప్రపంచవ్యాప్తంగా శాస్త్రవేత్తలు అనేక పరిశోధనలు నిర్వహించారు. ఇటీవలి ఓ అధ్యయనంలో కొవిడ్‌తో గుండె సంబంధిత సమస్యలతో మరణాలు వేగంగా పెరిగినట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. కొవిడ్ తర్వాత ప్రపంచవ్యాప్తంగా గుండెపోటు, కార్డియాకరెస్ట్ కేసులు పెరిగాయని పలు నివేదికలు పేర్కొన్నాయి.కొవిడ్ కొత్త కోడ్ ఏంటి..?: వైరస్ వెలుగులోకి వచ్చాక గుండె సంబంధిత మరణాలు పెరిగినట్లు శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. మసాచుసెట్స్‌లో మరణించిన దాదాపు 1.28లక్షల మంది మరణ ధ్రువీకరణపత్రాల డేటాను పరిశోధకుల బృందం విశ్లేషించి హెచ్చరికలు జారీ చేశారు. మహమ్మారి నుంచి 2020 నుంచి 2023 మధ్య గుండె సంబంధిత మరణాల రేటు గణనీయంగా ఎక్కువగా ఉందని శాస్త్రవేత్తలు గుర్తించారు. మసాచుసెట్స్ జనరల్ హాస్పిటల్‌లోని కార్డియాలజీ విభాగంలో ప్రొఫెసర్, రీసెర్చ్ డైరెక్టర్ జాసన్ హెచ్ వాస్పీ మాట్లాడుతూ కరోనా ఇన్ఫెక్షన్ గుండె ఆరోగ్యాన్ని ప్రభావితం చేసిందని గత అధ్యయనాలు స్పష్టం చేశాయన్నారు. వైరస్ ప్రారంభం నుంచి గుండెపోటు, కార్డియాకరెస్ట్‌తో ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోతున్నట్లు గుర్తించామన్నారు. మయోకార్డియల్ ఇన్ఫార్క్షన్‌తో ఆసుపత్రిలో చేరే వారి సంఖ్య 20-34శాతం తగ్గిందని ఆసుపత్రి డేటా చూపిస్తుందని, అయితే గుండెపోటు మరణాలు పెరిగాయని.. మహమ్మారి సమయంలో ఇతర ఆరోగ్య సేవల్లో లోపాన్ని హైలెట్ చేస్తుందని అధ్యయనాలు పేర్కొన్నాయి.

అమెరికన్ హార్ట్ అసోసియేషన్ ఓ నివేదిక కోవిడ్-19 బాధిత వ్యక్తులు భవిష్యత్‌లో మూడేళ్ల తర్వాత ఎలాంటి లక్షణాలు కనిపించకపోయినా గుండెపోటు, స్ట్రోక్, అకాల మరణాలు సంభవించే ప్రమాదం రెండు రెట్లు ఎక్కువగా ఉంటుందని తెలిపింది. లాస్ ఏంజిల్స్‌లోని సదరన్ కాలిఫోర్నియా విశ్వవిద్యాలయంలో పబ్లిక్ హెల్త్ సైన్సెస్ ప్రొఫెసర్ డాక్టర్ హూమన్ అల్లే మాట్లాడుతూ.. పాజిటివ్ పరీక్షించినప్పటికీ తీవ్రమైన లక్షణాలు కనిపించని వారికి కూడా హృదయ సంబంధ సమస్యల ప్రమాదం రెండు రెట్లు ఎక్కువగా ఉందని పరిశోధనలో తేలింది. కరోనావైరస్ కొంతమంది వ్యక్తులకు దీర్ఘకాలిక నష్టాన్ని కలిగిస్తున్నట్లు కనిపిస్తోందని పరిశోధకులు పేర్కొన్నారు.


కరోనా ఇన్ఫెక్షన్ మన శరీరాన్ని ఎలా ప్రభావితం చేస్తుందనే విషయంపై అర్థం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్న శాస్త్రవేత్తల బృందం ఇటీవల అధ్యయనంలో ఓ షాకింగ్ విషయాన్ని వెల్లడించింది. గర్భదారణకు ముందు, గర్భదారణ సమయంలో కొవిడ్ ఇన్ఫెక్షన్ సంభవిస్తే.. గర్భం దాల్చిన 20వ వారానికి ముందు గర్భస్రావం అయ్యే ప్రమాదం రెండు నుంచి మూడు రెట్లు ఎక్కువగా ఉంటుందని అధ్యయనంలో తేలింది. గర్భధారణ సమయంలో కరోనా ఇన్ఫెక్షన్ గర్భస్రావం అయ్యే ప్రమాదాన్ని పెంచుతుందని అధ్యయనాలు చెబుతున్నాయని అమెరికాలోని హ్యూస్టన్‌కు చెందిన ఎపిడెమియాలజిస్ట్ డాక్టర్ మైకేలా సాండోవల్ చెప్పారు. ఈ క్రమంలో మహిళలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

# మొక్కజొన్న పీచును పడేయకండి..



మొక్క జొన్నలను చాలా మంది ఎంతో ఇష్టంగా తింటుంటారు. ఒకప్పుడు ఇవి కేవలం సీజన్‌లోనే అందుబాటులో ఉండేవి. కానీ ఇప్పుడు ప్రతి సీజన్‌లోనూ అందుబాటులో ఉంటున్నాయి. మొక్కజొన్నలను చాలా మంది ఉడకబెట్టి లేదా కాల్చి తింటారు. ఎలా తిన్నా కూడా ఇవి ఎంతో రుచిగా ఉంటాయి. అయితే మొక్కజొన్నలను ఒలిచిన తరువాత కంకులను పడేస్తారు. కానీ వాటికి ఉండే పీచు మనకు ఎంతగానో ఉపయోగపడుతుంది. అమెరికా, చైనా సంప్రదాయ వైద్య విధానంలో మొక్కజొన్న పీచును కూడా ఎక్కువగా ఉపయోగిస్తారు. ఇందులో అనేక పోషకాలతోపాటు ఔషధ విలువలు కూడా ఉంటాయి. మొక్క జొన్న పీచు వల్ల మనకు కలిగే లాభాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.ఆర్థరైటిస్ నొప్పులకు..: మొక్కజొన్న పీచులో అనేక రకాల యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ముఖ్యంగా ఫ్లేవనాయిడ్స్, ఫినోలిక్ సమ్మేళనాలు, స్టెరాల్స్, సాపోనిన్స్, అల్లన్‌టోయిన్, ఆల్కలాయిడ్స్ అధికంగా ఉంటాయి. ఇవి ఫ్రీ ర్యాడికల్స్ వల్ల శరీరానికి జరిగే నష్టాన్ని నివారిస్తాయి. కణాలు డ్యామేజ్ అవకుండా చూస్తాయి. ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. దీంతో గుండె జబ్బులు, డయాబెటిస్ రాకుండా చూసుకోవచ్చు. శరీరంలోని వాపులు సైతం తగ్గిపోతాయి. మొక్క జొన్న పీచులో ఉండే యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు ఆర్థరైటిస్ నొప్పుల నుంచి ఉపశమనాన్ని అందిస్తాయి. ఈ పీచులో ఉండే మెగ్నీషియం వాపులను, నొప్పులను తగ్గిస్తుంది. అందువల్ల ఆర్థరైటిస్ ఉన్నవారికి ఎంతగానో మేలు జరుగుతుంది. డయాబెటిస్ తగ్గేందుకు..: మొక్కజొన్న పీచు వల్ల షుగర్ లెవల్స్‌ను తగ్గించుకోవచ్చు. ఇన్సులిన్ ఉత్పత్తి పెరుగుతుంది. శరీరం ఇన్సులిన్‌ను సరిగ్గా ఉపయోగించుకుంటుంది. క్లోమ గ్రంథిలో డ్యామేజ్ అయిన బీటా కణాలు మరమ్మత్తులకు గురవుతాయి. దీంతో షుగర్ లెవల్స్ అదుపులోకి వస్తాయి. డయాబెటిస్ నియంత్రణలో ఉంటుంది. సైంటిస్టులు చేపట్టిన అధ్యయనాల ప్రకారం తరచూ మొక్కజొన్న పీచును తీసుకోవడం వల్ల డయాబెటిస్ నియంత్రణలో ఉంటుందని తేల్చారు. అయితే పీచును నేరుగా తినలేరు కనుక దీన్ని నీటిలో వేసి మరిగించి తాగాల్సి ఉంటుంది. ఈ పీచు సహజసిద్ధమైన డైయురెటిక్‌గా కూడా పనిచేస్తుంది. శరీరంలో అదనంగా ఉన్న ద్రవాలను బయటకు పంపుతుంది. దీంతో పాదాలు, చేతుల్లో ఉండే వాపులు తగ్గిపోతాయి. అలాగే బీపీ తగ్గుతుంది. హైబీపీ ఉన్నవారికి ఈ పీచు ఎంతో మేలు చేస్తుంది. మూత్రాశయ ఇన్‌ఫెక్షన్లకు..: మొక్కజొన్న పీచు మూత్రాశయ ఇన్‌ఫెక్షన్లను సైతం తగ్గిస్తుంది. మూత్రాశయం, జననావయవాల దగ్గర బ్యాక్టీరియా, ఫంగస్ చేరకుండా చూస్తుంది. మూత్రం ధారాళంగా వచ్చేలా చేస్తుంది. శరీరంలోని వ్యర్థాలు పూర్తిగా బయటకు వెళ్లిపోతాయి. కిడ్నీ స్టోన్ల సమస్య ఉన్నవారు మొక్క జొన్న పీచు వేసి మరిగించిన నీళ్లను రోజూ తాగుతుంటే స్టోన్స్ కరిగిపోతాయి. మూత్రాశయ సంబంధ సమస్యలు ఉన్నవారికి కూడా ఈ కషాయం ఎంతగానో పనిచేస్తుంది. కొలెస్ట్రాల్ అధికంగా ఉన్నవారు ఈ పీచును ఆహారంలో భాగం చేసుకుంటే మేలు జరుగుతుంది. దీని వల్ల చెడు కొలెస్ట్రాల్ (ఎల్‌డీఎల్) తగ్గి, మంచి కొలెస్ట్రాల్ (హెచ్‌డీఎల్) పెరుగుతుంది. ఫలితంగా గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా నివారించవచ్చు. ఇలా మొక్కజొన్న పీచుతో అనేక లాభాలను పొందవచ్చు.

# షుగర్, గుండె జబ్బులు ఉన్నవారికి వరం ఈ పండ్లు.. కనిపిస్తే వదలకండి..!



ఆరోగ్యంగా ఉండేందుకు, శక్తితోపాటు పోషకాలు కూడా లభించేందుకు పండ్లను తినాలని వైద్యులు చెబుతుంటారు. పండ్లను ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు. సీజనల్‌గా అందుబాటులో ఉండే పండ్లతోపాటు ఇతర అన్ని రకాల పండ్లను కూడా తరచూ తినాలని పోషకాహార నిపుణులు సైతం సూచిస్తుంటారు. అయితే చాలా మంది అనేక రకాల పండ్లను తింటుంటారు. కానీ పియర్స్ అని పిలవబడే ఈ పండ్లను చాలా తక్కువగా తింటారు. ఇవి మనకు ఫ్రూట్ స్టాల్స్‌తోపాటు సూపర్ మార్కెట్‌లలోనూ లభిస్తాయి. బాగా పండిన పియర్స్ పండ్లు పసుపు రంగులో ఉంటాయి. కొద్దిగా పండినవి ఆకుపచ్చ రంగులో ఉంటాయి. పియర్స్ పండ్లనే బేరి పండ్లు అని కూడా పిలుస్తారు. వీటిని తరచూ ఆహారంలో భాగం చేసుకుంటే అనేక లాభాలు పొందవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు.జీర్ణ వ్యవస్థకు..: పియర్స్ పండ్లలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఒక మీడియం సైజ్ పియర్ పండును తినడం వల్ల సుమారుగా 6 గ్రాముల మేర ఫైబర్ పొందవచ్చు. ఈ పండ్లను ఫైబర్‌కు మంచి మూలంగా చెబుతారు. ఒక పియర్ పండును తినడం ద్వారా మనకు రోజుకు కావల్సిన ఫైబర్‌లో సుమారుగా 25 శాతం వరకు లభిస్తుంది. ఫైబర్ వల్ల జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. పేగుల్లో మలం కదలికలు సరిగ్గా ఉంటాయి. దీంతో మలబద్ధకం తగ్గుతుంది. పియర్ పండ్లు ప్రో బయోటిక్ ఆహారాల జాబితాకు చెందుతాయి. ఇవి జీర్ణ వ్యవస్థలో ఉండే మంచి బ్యాక్టీరియాను వృద్ధి చెందేలా చేస్తాయి. దీంతో జీర్ణ శక్తి పెరుగుతుంది. మనం తిన్న ఆహారంలో ఉండే పోషకాలను శరీరం సరిగ్గా శోషించుకుంటుంది. రోగ నిరోధక శక్తి పెరిగేలా చేస్తాయి.బరువు తగ్గేందుకు..: అధికంగా బరువు ఉన్నవారు పియర్స్ పండ్లను ఆహారంలో భాగం చేసుకుంటే ఎంతో మేలు జరుగుతుందని డైటిషియన్లు చెబుతున్నారు. ఈ పండు ఒక్కదాన్ని తింటే చాలు కడుపు నిండిన భావన కలుగుతుంది. దీంతో ఆహారం తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది. బరువును నియంత్రణలో ఉంచుతుంది. పియర్ పండ్లలో యాంటీ ఆక్సిడెంట్లు, ఫ్లేవనాయిడ్స్, ఆంథో సయనిన్స్, క్వర్సెటిన్, ఫినోలిక్ సమ్మేళనాలు, విటమిన్ సి అధికంగా ఉంటాయి. ఇవి మన శరీరానికి హాని చేసే ఫ్రీ ర్యాడికల్స్ ను నిర్మూలిస్తాయి. దీంతో ఆక్సీకరణ ఒత్తిడి తగ్గుతుంది. కణాలకు జరిగే నష్టంనివారించబడుతుంది.ఫలితంగా గుండె జబ్బులు, క్యాన్సర్, నాడీసంబంధ సమస్యలు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు.

గుండె జబ్బులు రాకుండా..: పియర్స్ పండ్లలో యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. ఇవి శరీరంలో అంతర్గతంగా ఏర్పడే వాపులను తగ్గిస్తాయి. దీంతో టైప్ 2 డయాబెటిస్, గుండె జబ్బులు రాకుండా నివారించవచ్చు. పలు రకాల క్యాన్సర్లు రాకుండా అడ్డుకునే శక్తి కూడా ఈ పండ్లకు ఉందని సైంటిస్టులు చేపట్టిన అధ్యయనాల్లో తేలింది. పియర్స్ పండ్లను తింటే కొలెస్ట్రాల్ లెవల్స్ తగ్గుతాయి. చెడు కొలెస్ట్రాల్ (ఎల్‌డీఎల్) తగ్గి మంచి కొలెస్ట్రాల్ (హెచ్‌డీఎల్) పెరుగుతుంది. దీని వల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా చూసుకోవచ్చు. పియర్స్ పండ్లలో ఉండే పొటాషియం శరీరంలోని రక్త సరఫరాను మెరుగు పరుస్తుంది. దీంతో బీపీ నియంత్రణలో ఉంటుంది. హైబీపీ ఉన్నవారికి ఈ పండ్లను వరంగానే చెప్పవచ్చు. రోజూ ఒక పియర్ పండును తింటుంటే బీపీ తగ్గుతుంది. స్ట్రోక్స్ వచ్చే అవకాశాలు గణనీయంగా తగ్గిపోతాయి. ఇలా పియర్స్ పండ్లను తినడం వల్ల అనేక అద్భుతమైన లాభాలను పొందవచ్చు.

# విశ్వంభర విషయంలో మెగా ఆదేశం?



అగ్ర కథానాయకుడు చిరంజీవి 'విశ్వంభర' సినిమా కోసం మెగా ఫ్యాన్సంతా ఆతృతగా ఎదురు చూస్తున్నారు. ఒకట్రెండు రోజుల ప్యాచ్ వర్క్ మినహా షూటింగ్ ఇప్పటికే పూర్తయింది. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన సీజీ వర్క్ జరుగుతున్నది. 'విశ్వంభర' చిత్రాన్ని 90శాతం ఇండోర్‌లోనే తెరకెక్కించారు దర్శకుడు మల్లిడి వశిష్ట. కథానుసారం ఈ సినిమాకు 70శాతం సీజీ వర్కే ఉంటుంది. అందుకే.. ప్రపంచంలోనే పేరెన్నికగన్న వివిధ స్టూడియోలు ఈ సినిమా సీజీకి వర్క్ చేస్తున్నాయి. వాటినుంచి పూర్తి అవుట్ పుట్ వచ్చాకే సినిమా రిలీజ్ డేట్‌ని ప్రకటించాలనేది 'మెగా' ఆదేశం. అందుకు నిర్మాతలు సైతం కట్టుబడి ఉన్నారని సమాచారం. వచ్చే ఏడాది సంక్రాంతికి చిరంజీవి, అనిల్ రావిపూడిల సినిమా విడుదల చేయనున్నట్టు ముందే ప్రకటించేసిన నేపథ్యంలో.. ఒక నాలుగు నెలలు తేడాతో 'విశ్వంభర' కూడా దానికంటే ముందే విడుదల కావాల్సివుంది. బహుశా 'విశ్వంభర' విడుదల దసరాకు ఉండొచ్చని ఫిల్మ్ వర్గాల టాక్. యూవీ క్రియేషన్స్ పతాకంపై ప్రమోద్ ఉప్పలపాటి, వి.వంశీకృష్ణారెడ్డి, విక్రమ్‌రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్న విషయం తెలిసిందే.




# రాజాసాబ్ వచ్చేది ఆరోజే!



ప్రభాస్ అభిమానులకిది నిజంగా శుభవార్తే. వారి సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ 'ది రాజా సాబ్' చిత్ర విడుదల తేదీని మంగళవారం మేకర్స్ ప్రకటించారు. డిసెంబర్ 5న వరల్డ్‌వైడ్‌గా ఈ సినిమా ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నెల 16న టీజర్‌ను రిలీజ్ చేయబోతున్నారు. మారుతి దర్శకత్వంలో హారర్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న 'ది రాజాసాబ్' చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ కథానాయికలు. డేట్ అనౌన్స్‌మెంట్ సందర్భంగా విడుదల చేసిన కొత్త పోస్టర్‌లో ప్రభాస్ పవర్‌ఫుల్ లుక్‌లో కనిపిస్తున్నారు. ప్రభాస్ ఇప్పటివరకూ చేయని రొమాంటిక్ హారర్ జోనర్ కావడంతో సినిమాపై అందరిలో ఆసక్తి రెట్టింపయ్యింది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: కార్తీక్ పళని, సంగీతం: తమన్, ప్రొడక్షన్ డిజైనర్: రాజీవన్, సహనిర్మాత: వివేక్ కూచిభొట్ల, నిర్మాత: టీజీ విశ్వప్రసాద్, రచన-దర్శకత్వం: మారుతి.

# బాలు స్వరం వినని లోగిలి లేదేమో



నెల్లూరు,జూన్4 : గానగంధర్వుడి గళం వినిపించని రోజు...మనం ఆయన పాటలు పాడుకోని ఉదయం ఉండదేమో. నిత్యం సంకీర్తనలా బాలసుబ్రమణ్యం మన జీవితంలో చెరగని ముద్రవేశారు. 1946, జూన్ 4న నెల్లూరు జిల్లా కోనేటమ్మ పేట గ్రామంలో సాంబమూర్తి, శకుంతలమ్మ దంపతులకు రెండో సంతానంగా జన్మించారు. ఇంజనీర్ కావాలనుకున్నారు. కానీ తండ్రి కోరిక మేరకు గాయకుడయ్యారు. ఎస్పీ బాలు తండ్రి సాంబమూర్తి హరికథా కళాకారుడు. ఆయన భక్తిరస నాటకాలూ ప్రదర్శిస్తూండేవారు. అలా బాలుకి చిన్ననాటి నుంచే సంగీతం మీద ఆసక్తి.. అనురక్తి పెరిగాయి. దీంతో ఆయనకి తండ్రే తొలి గురువు అయ్యారు. ఐదేళ్ల వయసులో భక్త రామదాసుః నాటకంలో తండ్రితో కలిసి బాలు నటించారు. అలా మొదలైన బాలు సీంగీత ప్రయాణం అప్రతిహతంగా సాగింది. కరోనా మహమ్మారి రాకతో బాలు అనంత లోకాలకు వెళ్లారు. బాలు జయంతి సందర్భగా ఆయనను స్మరించుకోవడం ఓ మంచి అవకాశం. వెండితెర తెలుగు పాటపై ఆయనది చెరగని ముద్ర. ఐదు దశాబ్దాలకు పైగా 40 వేల పైచిలుకు పాటలు పాడిన బాలూ మనందరి ఇంటి వెలుగయ్యారు. ఘంటసాల మాస్టార్ తరవాత ఇంతగా ప్రాచుర్యం పొందింది బాలు మాత్రమే. .. ప్రతినిత్య ప్రవాహంగా.. అనేక భాషల్లో...అనేక యాసల్లో.. బాలు గానామృతం మార్మోగుతూనే ఉంది. శ్రీపతి పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం.. ఎస్.పి.బాలు.. భౌతికంగా దూరమైనా ... అమరంగా.. ఆ పాత మధురంగా... ఆ గాన గంధర్వం.. అలరిస్తూనే ఉంటుంది. ఆయన గాత్రం నిత్య యవ్వనంతో చివరివరకూ తొణికిసలాడుతూనే ఉంది.. అన్ని రకాల పాటలు పాడగలగడం ఆయనకున్న ప్రత్యేకత. 50 వసంతాలుగా వేలాది పాటలను తన స్వరంలో మాధుర్యాన్ని చిలికించి పలికించారు. అదే ఆయనకు తిరుగులేని అవార్డు. బాలసుబ్రహ్మణ్యం గాయకుడి మాత్రమే కాదు.. నటుడిగా, డబ్బింగ్ కళాకారుడిగా.. బహుముఖ ప్రజ్ఞాశాలి.. ఆయన భౌతికంగా దూరమైనా.. ఆయన స్వరం ఎప్పటికీ సజీవంగా నిత్యం అలరారుతోంది. ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం తెలుగు సినీ సంగీతంలో ఓ ఆణిముత్యం. ఘంటసాల తరువాత అంత స్థాయిలో పేరొందిన ఏకైక గాయకుడు బాలు. కథా నాయకుల గొంతుకు తగినట్లు- తన గాత్రం వారి స్వరంలో పాడడం ఆయనకున్న టాలెంట్. చాలామంది నటులకు ఆయన వారి హావభావాలకు, నటనా శైలులకు అనుగుణంగా పాటలు పాడి జీవం పోశారు. ఘంటసాల అతి చిన్న వయసులో మరణించడంతో తెలుగు సినిమా పాటలకు లోటు ఏర్పడింది. ఆ ఖాళీని ఎస్పీ బాలు పూడ్చారు. ఆయన తన గళంతో పాత్రలకు ప్రాణం పోశారు. బాలు సినీ జీవితం ఃశంకరాభరణంః సినిమాతో పూర్తిగా మారిపోయింది. అప్పటివరకు మాస్ గీతాలకే పరిమితమైన బాలు.. ఈ సినిమాలో సాంప్రదాయ సంగీతాన్ని సైతం అద్భుతంగా పాడగలరని నిరూపించుకున్నారు. సంగీత పండితుల ప్రశంసలను పొందారు. ఆయన పాటలు పాడడమే కాదు... పాటలకు బాణీలు కట్టేవారు. పాత్రలకు డబ్బింగ్ చెప్పారు. కెమేరా ముందుకొచ్చి నటించారు. మంచి కథలకు నిర్మాతయ్యారు. ప్రతిభావంతులైన కొత్తతరం గాయనీ గాయకులను వెలికితీసి, మెరుగుపెట్టి మట్టిలోని మాణిక్యాలను వెలుగులోకి తెచ్చారు. అందుకే, భారతీయ సినీ నేపథ్య గాయకుల్లో బాలూది ఓ ప్రత్యేక చరిత్ర.

# 'వేదం' సినిమాకు 15 ఏండ్లు..



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కెరీర్‌లో మైలురాయిగా నిలిచిపోయిన చిత్రాలలో వేదం ఒక్కటి. క్రిష్ (జాగర్లమూడి కృష్ణ) దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం 2010 జూన్ 04న ప్రేక్షకుల ముందుకు వచ్చి బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని నమోదు చేసుకుంది. అయితే ఈ సినిమా వచ్చి నేటికి 15 ఏండ్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా సినిమాను గుర్తు చేసుకుంటూ అల్లు అర్జున్ ఎమోషనల్ పోస్ట్ పెట్టాడు.వేదం సినిమా తన కెరీర్‌లో ఒక విభిన్నమైన చిత్రమని అల్లు అర్జున్ పేర్కొన్నారు. ఈ సినిమాను ఎంతో నిజాయితీగా తీసినందుకు దర్శకుడు క్రిష్ జాగర్లమూడికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఈ చిత్రంలో తనతో పాటు నటించిన అనుష్క శెట్టి, మంచు మనోజ్, మనోజ్ బాజ్‌పాయ్‌తో పాటు ఇతర నటీనటులతో కలిసి పని చేయడం ఎంతో ప్రత్యేకమని అల్లు అర్జున్ చెప్పారు. ఈ సినిమాను నిర్మించిన శోబు యార్లగడ్డ మరియు ప్రసాద్ దేవినేనికి, సంగీతం అందించిన ఎం.ఎం. కీరవాణికి, ఇంకా చిత్రబృందం మొత్తానికి అల్లు అర్జున్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. చివరగా, ఈ సినిమాను ఆదరించి, ఎప్పటికీ నిలిచిపోయే చిత్రంగా మార్చిన అభిమానులందరికీ అల్లు అర్జున్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# 'జాక్' డిజాస్టార్.. రూ. 4 కోట్ల రెమ్యూనరేషన్ వెనక్కి ఇచ్చిన హీరో!



'డీజే టిల్లు', 'టిల్లు స్క్వేర్' వంటి విజయవంతమైన చిత్రాల తర్వాత సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటించిన చిత్రం జాక్. బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమా ఏప్రిల్ 10న ప్రేక్షకుల ముందుకు వచ్చి బాక్సాఫీస్ వద్ద పరాజయం అందుకుంది. 'టిల్లు స్క్వేర్ తర్వాత సిద్ధు జొన్నలగడ్డ సినిమాపై భారీ అంచనాలు ఉండగా.. ఈ అంచనాలను అందుకోలేకపోయింది ఈ చిత్రం. దీంతో ఈ సినిమా వలన డిస్ట్రిబ్యూటర్లు, నిర్మాతలు భారీ నష్టాలను చవి చూశారు.ఈ నేపథ్యంలోనే, 'జాక్' సినిమా నిర్మాతలకు జరిగిన నష్టంలో తన వంతు బాధ్యతగా సిద్ధు జొన్నలగడ్డ అరుదైన నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తుంది. ఈ సినిమాకు తీసుకున్న పారితోషికంలో సగం, అంటే రూ. 4 కోట్ల రూపాయలను నిర్మాతలకు తిరిగి ఇచ్చినట్లు వార్తలు వస్తున్నాయి. 'జాక్' సినిమాకు సిద్ధు మొత్తం రూ. 8 కోట్ల పారితోషికం అందుకున్నట్లు సమాచారం. అందులో సగం తిరిగి ఇవ్వడం ద్వారా ఆయన తన పెద్ద మనసును చాటుకున్నారు. అయితే ఈ వార్తలపై సిద్ధు ఇంకా ఎటువంటి ప్రకటన చేయలేదు. కాగా, థియేటర్లలో పరాజయం పాలైనప్పటికీ, 'జాక్' సినిమా ఓటీటీలో మంచి స్పందన రాబడుతుంది. నెట్‌ఫ్లిక్స్‌లో ఈ సినిమా ప్రస్తుతం ట్రెండింగ్‌లో ఉంది. సిద్ధు జొన్నలగడ్డ ప్రస్తుతం తన తదుపరి చిత్రం 'తెలుసు కదా' విడుదల కోసం సిద్ధమవుతున్నారు.

# ప్రశాంత్ నీల్‌కు ఎన్టీఆర్ బర్త్‌డే విషెస్.!





కేజీఎఫ్, సలార్ చిత్రాల ఫేమ్ కన్నడ దర్శకుడు ప్రశాంత్ నీల్ పుట్టినరోజు నేడు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు సినీ ప్రముఖులు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. తాజాగా టాలీవుడ్ అగ్ర నటుడు ఎన్టీఆర్ కూడా ప్రశాంత్‌కి బర్త్‌డే విషెస్ తెలిపాడు. హ్యాపీ బర్త్‌డే ప్రశాంత్ నీల్. మీ విజన్ మాటల కంటే గొప్పది. తెరపై మరింత ఫైర్‌ని చూడాలని ఆశిస్తున్నాను అని తారక్ రాసుకొచ్చాడు. ప్రస్తుతం ప్రశాంత్ నీల్, ఎన్టీఆర్ కాంబినేషన్‌లో ఒక సినిమా తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. ఎన్టీఆర్ నీల్ అంటూ రాబోతున్న ఈ ప్రాజెక్ట్‌కి డ్రాగన్ అనే టైటిల్‌ని అనుకుంటున్నట్లు సమాచారం. మైత్రీ మూవీ మేకర్స్ ఈ సినిమాను నిర్మిస్తుంది. ప్రశాంత్ నీల్ గత చిత్రాలు 'కేజీఎఫ్' సిరీస్, 'సలార్' భారీ విజయాలు సాధించడంతో డ్రాగన్ కూడా అదే స్థాయిలో ఉంటుందని ప్రేక్షకులు ఆశిస్తున్నారు.

Printed, Published and Ownedby **JADAV ROHIDAS,** and Printed at RATNA GRAPHICS Printing press (Name&Adress) 2-3-703/7,Tirumalanagar colony,amberpet,policeline,Hyderabad,Telangana-500013 Published from H.No 12-27 Village;FatkalMangi,Mandal;Lingapur, Kumrambheem Asifabad, Adilabad,Mancherial,TELANGANA-504293.**Editor: JADAV ROHIDAS.RNI NO:TGTEL/25/A0870, Email: jananinadam@gmail.com**.Phone no:9550100197,9490111460